PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 67 | విజయవాడ, సోమవారం 7 అక్టోబర్2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 7 October 2024 | Rs

గుజరాత్‌లో

కొనసాగుతున్న బుల్డోజర్‌రాజ్

- కోర్టు ఆదేశాలను ధిక్కరించి కూల్చివేతలు
- మసీదులు, ప్రార్థనా మందిరాలే లక్ష్యం
- మైనార్టీల ఆవాసాలూ నేలమట్టం

5

అరుంధతి అదరహో

మూడు వికెట్లతో మెరిసిన తెలుగు పేసర్

పాకిస్థాన్‌పై భారత్ అలవోక విజయం

6

కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహించిన భారీ మానవహారంలో పాల్గొన్న ఉక్కు కార్మికులు, ప్రజలు

'ఉక్కు'ను అమ్మితే ఊరుకోం

- భారీ మానవహారం
- అగనంపూడి నుంచి గాజువాక వరకూ చేయిచేయి కలిపిన జనం
- మద్దతు తెలిపిన సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు వి శ్రీనివాసరావు, కె రామకృష్ణ

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం)

'చేయి చేయి కలుపుదాం... విశాఖ ఉక్కును కాపాడుకుందాం' పేరిట భారీ మానవహారానికి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఇచ్చిన పిలుపునకు ఆదివారం విశేష స్పందన లభించింది. అగనంపూడి నుంచి గాజువాక వరకూ ప్రజలు ఎక్కడికక్కడ చేయిచేయి కలిపి మానవహారంగా ఏర్పడ్డారు. ఉక్కు పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులు, అధికారులు, వారి కుటుంబీకులు, ఉక్కు నిర్వాసితులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు దీక్షా శిబిరాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సందర్శించి మద్దతు తెలిపారు. అక్కడి కూడలిలో జాతీయ రహదారిపై బైఠాయించి ఉక్కు పరిరక్షణ నినాదాలు చేశారు. అనంతరం అక్కడ మానవహారం కొనసాగింది. దీక్షా శిబిరం వద్ద వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విశాఖ ఉక్కుపై ఆటవిక న్యాయాన్ని ప్రదర్శిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్లాంట్‌ను రక్షిస్తామని చెబుతున్న మాటలలో విశ్వాసం కానరా లేదన్నారు. రోజురోజుకూ ప్లాంట్‌లో పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నాయని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులను తొలగించేందుకు ఉత్తర్వులు ఇవ్వడం, ఉక్కు కార్మికులకు హెచ్‌ఆర్‌ఎ నిలుపుదల చేయడం, విద్యుత్ ఛార్జీలు పెంచడం, ఇతర పరిశ్రమలకు డిప్యుటేషన్ల పేరుతో అధికారులను పంపించడం వంటి చర్యలతో కార్మికులలో భయాందోళనలను సృష్టించడం తగదన్నారు. ఈ నెల 8న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని మోడీతో మాట్లాడుతున్నారని, దానిలో విశాఖ ఉక్కు పరిరక్షణ అంశం ప్రధానంగా ఉండాలని అన్నారు. ఉక్కును రక్షించే చర్యలు చేపడితే స్వాగతిస్తామని, లేనిపక్షంలో కార్మికులతో కలిసి రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు. కె.రామకృష్ణ మాట్లాడుతూ 1333 రోజులుగా ఇక్కడ ఉద్యమం జరుగుతున్నా కార్మికుల ఘోష పాలకులకు పట్టకపోవడం దారుణమన్నారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని పార్టీలూ ఉక్కు పరిరక్షణ కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. కూర్మన్నపాలెం కూడలిలో ఆందోళనకు దిగిన ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్.నర్సింగరావును పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత విడుదల చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గ నాయుడు, సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, డి.ఆదినారాయణ, నాయకులు జె.అయోధ్యరామ్, ఎన్.రామారావు తదితరులు పాల్గొన్నారు. గాజువాకలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మద్దతు తెలిపారు.

జాతీయ రహదారిపై బైఠాయించిన సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణ, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

మసీదుపై ఇజ్రాయిల్ బాంబుల వర్షం

26 మంది మృతి

గాజా స్ట్రిప్ : ఏడాదికాలంగా యుద్ధోన్మాదంతో అమానవీయ దాడులను కొనసాగిస్తున్న ఇజ్రాయిల్ ఆదివారం మరోమారు దాష్టీకానికి పాల్పడింది. సెంట్రల్ గాజాలో ఓ మసీదుపై ఆదివారం తెల్లవారుజామున బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడిలో 26 మంది మరణించారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. శరణార్థులకు ఆశ్రయం కల్పిస్తున్న మసీదును లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయిల్ బలగాలు ఈ దాడులకు పాల్పడటం పట్ల సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. డెయిర్ అల్ -బలాహ్ పట్టణంలోని అల్-అక్సా అమరవీరుల ఆస్పత్రికి సమీపంలో ఉన్న ఈ మసీదు ఇటీవల శరణార్థి శిబిరంగా మారిందని, వందలాది మంది ఆశ్రయం పొందుతున్నారని గాజా పౌర రక్షణ సంస్థ ప్రతినిధి మహముద్ బస్సాల్ తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున ఇజ్రాయిల్ దళాలు బాంబులతో మసీదుపై దాడి చేశాయని, ఈ దాష్టీక దాడిలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

కాగా, ఈ దాడిని ఎప్పటిలాగే ఇజ్రాయిల్ నిస్సిగ్గుగా సమర్థించుకుంది. ఆ ప్రాంతంలో ఉగ్రవాదులు కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్వహిస్తున్నారని, అందుకనే తాము దాడులకు పాల్పడ్డామని పేర్కొంది. ఈ మేరకు ఇజ్రాయిల్ సైన్యం ఓ ప్రకటన విడుదల చేసింది. డెయిర్ అల్ -బలాహ్ ప్రాంతంలో గతంలో షుహాద్ అల్-అక్సా మసీదుగా ఉన్న నిర్మాణంలో హమాస్ ఉగ్రవాదులు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నిర్వహిస్తున్నారని, వాకె లక్ష్యంగా దాడి జరిపినట్లు ఆ ప్రకటనలో పేర్కొంది. పాలస్తీనాపై ఇజ్రాయిల్ నరమేధానికి ఈ నెల 7తో ఏడాది పూర్తి అవుతుంది. గాజాలో పాలస్తీనా పౌరులను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయిల్ సాగిస్తున్న అమానవీయ దాడులకు ప్రతిదాడిగా అక్టోబర్ 7న హమాస్ ఇజ్రాయిల్‌పై బాంబుల వర్షం కురిపించింది. అప్పటి నుండి ఇజ్రాయిల్ గాజా, వెస్ట్‌బ్యాంక్‌పై యుద్ధోన్మాదంతో, అమెరికా అండదండలతో విరుచుకుపడుతోంది. ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాడుల్లో 42,000 మంది అమాయకులైన పౌరులు చనిపోయారు. వేలాది మంది క్షతగాత్రులయ్యారు. వీరిలో అత్యధికులు మహిళలు, చిన్నారులే కావడం పట్ల ఐక్యరాజ్యసమితితో సహా అంతర్జాతీయ సమాజం మొత్తం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఇజ్రాయిల్ ఇప్పటికైనా దాడులను విరమించుకోవాలని కోరుతున్నారు.

22 నుంచి అమరావతి డ్రోన్ సమ్మిట్

- దేశ వ్యాప్తంగా వెయ్యి మంది ప్రతినిధులు
- అదేరోజు సాయంత్రం కృష్ణా తీరంలో డ్రోన్‌షో
- పెట్టుబడులశాఖ కార్యదర్శి సురేష్‌కుమార్

3లో..

12 గంటలకు రూ.350

- నెల మొత్తం కష్టపడినా రూ.పదివేలే
- కార్మికుల శ్రమను దోచుకుంటున్న జీడీపిక్కల యాజమాన్యం
- కేరళలో ఇఎస్ఐ, పిఎఫ్ అమలు
- ఆంధ్ర కార్మికులకు అమలు కాని కార్మిక చట్టాలు

3లో..

శ్రీ లలితా త్రిపురసుందరీదేవిగా దుర్గమ్మ

- కిటకిటలాడిన క్యూ లైన్లు

3లో..

వివరాలు తెలుసుకుంటున్న మంత్రులు అనిత, రామ్‌ప్రసాద్ రెడ్డి, ఫరూక్

బాలిక హత్యపై రాజకీయం తగదు

- హోం మంత్రి అనిత
- హతురాలి కుటుంబ సభ్యులకు మంత్రుల పరామర్శ

ప్రజాశక్తి- పుంగనూరు (చిత్తూరు జిల్లా)

బాలిక హత్యపై రాజకీయం చేయడం తగదని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఇటీవల అదృశ్యమైన బాలిక హత్యకు గురైన నేపథ్యంలో ఆమె తల్లిదండ్రులను మంత్రి అనిత, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి, మైనారిటీ శాఖ మంత్రి ఫరూక్ ఆదివారం పరామర్శించారు. బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకొని మిగతా 2లో

సిఎం పరామర్శ

చిన్నారి కుటుంబాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివారం ఫోన్లో పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అధైర్యపడొద్దని, దోషులను శిక్షిస్తామని ఓదార్చారు. బాలికను కాపాడేందుకు పోలీసు వ్యవస్థ శత విధాలా ప్రయత్నించిందని, బాలిక హత్యకు గురవడం బాధ కలిగించిందని తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటామని బాలిక తండ్రికి హామీ ఇచ్చారు.

రాజధాని సీడ్ యాక్సెస్ రోడ్డు

కనెక్టివిటీలో గందరగోళం

- ప్లానులో స్పష్టత కరువు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి రాజధాని నగరానికి జాతీయ రహదారికి అనుసంధానం కోసం ఏర్పాటు చేసిన సీడ్ యాక్సెస్ రోడ్డు కనెక్టివిటీపై గందరగోళం నెలకొంది. ప్రస్తుతం ఉన్న రోడ్డును 16వ నెంబరు జాతీయ రహదారిలో కలిపేందుకు తొలి నుండి ప్రయత్నిస్తున్నా ఇంతవరకు ప్లాను రూపొందించలేదు. 2017లో సీడ్ యాక్సెస్‌రోడ్డుకు రాజధాని మాస్టర్‌ప్లాను రూపొందించిన సమయంలో సీడ్ యాక్సెస్ రోడ్డును కలకత్తా-చెన్నై జాతీయ రహదారికి కలపాలని అనుకున్నారు. మణిపాల్ వద్ద ట్రంపెట్ జంక్షన్ ఏర్పాటుచేసి కలిపేలా ప్రాథమికంగా అంచనాలు రూపొందించారు. సీతానగరం వద్ద గతంలో ఉన్న వర్కుషాపు, కృష్ణా పశ్చిమకెనాల్ మీదుగా ఫ్లైఓవర్ నిర్మించి బోటుయార్డు, రైల్వేలైన్ మీదుగా మరొక ఫ్లైఓవర్ కట్టి అక్కడ నుండి మణిపాల్ హాస్పటల్ వద్ద జాతీయ రహదారిలో కలపాలని ప్లాను రూపొందించారు. దీనికి వీలుగా సర్వేలు కూడా చేశారు. సీతానగరం వద్ద నుండి జాతీయ రహదారి వరకూ రోడ్డు నిర్మాణానికి ప్రాథమిక సర్వేలు తప్ప ప్లాను ఇవ్వలేదు. భూసేకరణగానీ, సమీకరణ ప్రక్రియ గానీ మొదలుపెట్టలేదు, నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. 2019లో టిడిపి ప్రభుత్వం అధికారం కోల్పోయిన తరువాత వచ్చిన వైసిపి ప్రభుత్వం అసలు ఈ ప్రాజెక్టునే పక్కనబెట్టింది. ప్రస్తుతం టిడిపి ప్రభుత్వం మరలా అధికారంలోకి రావడంతో సీడ్‌యాక్సెస్ రోడ్డు కనెకట్టివిటీ అంశాన్ని ముందుకు తెచ్చారు. అయితే గతంలో సీతానగరం నుండి మణిపాల్ ఆస్పత్రి వరకూ ఫ్లైవోవర్ పద్ధతిలో రోడ్డు వేద్దామనుకున్న ప్రాంతంలో ప్రస్తుతం నిర్మాణాలు వచ్చి చేరాయి. రోడ్డు నిర్మిద్దామనుకున్న ప్రాంతంలో నెల్లూరు జిల్లాకు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే పెద్దఎత్తున అపార్టుమెంట్లు నిర్మించారు. ఇటీవల సిఆర్‌డిఎ ఇంజనీర్లు పరిశీలించినా సరైన నిర్ణయానికి రాలేకపో యారు. ప్రస్తుతం సీతానగరం వరకూ పూర్తి చేయాల ని ప్రాథమికంగా నిర్ధారించుకున్నారు. దీనిపై త్వరలో డిపిఆర్ సిద్ధం చేసి నవంబరు నెలలో టెండరు ఇవ్వాలని అనుకున్నట్లు తెలిసింది. కేంద్రం నుండి నిధులు వస్తే తొలుత ఈ రోడ్డుకు ప్రాధాన్యత ఇచ్చి నిర్మించాలని నిర్ణయించారు. గతంలో అనుకున్న విధంగా ప్రస్తుతం భూముల్లో నుండి రోడ్డు వేయడం పెద్ద ఇబ్బంది కాదని, అపార్టుమెంటు నిర్మాణం వల్ల ప్లాను మొత్తం దెబ్బతిందని చెబుతున్నారు. దీంతో సీడ్ యాక్సెస్ రోడ్డు విస్తరణ వ్యవహారం గందరగోళంలో పడింది.

ప్లానులేకపోవడం వల్లే సమస్య

రోడ్డు నిర్మిద్దామనుకున్న సమయంలోనే రోడ్డుకు నోటిఫికేషన్ ఇచ్చి పూర్తి చేసి ఉంటే మాస్టర్‌ప్లాను ప్రకారం ఆ ప్రాంతంలో భవనాల నిర్మాణానికి ప్లాను ఇచ్చేవారు కాదని, అలా చేయకపోవడం వల్లే ప్లాను మంజూరయినట్లు తెలిసిందని, దీనిపైనా విచారణ చేస్తామని సిఆర్‌డిఎ అధికారులు చెబుతున్నారు. అప్పట్లో ప్రాథమిక సర్వేలు పూర్తయ్యాయని, అప్పటి అధికారుల నిర్లక్ష్యం ఇప్పుడు సీడ్ యాక్సెస్ రోడ్డుకు అడ్డంకిగా మారిందని స్పష్టం చేస్తున్నారు. ఒకవేళ మణిపాల్ వద్ద సాధ్యం కానిపక్షంలో ప్రస్తుతం ఉన్న పాత ఎన్‌టిఆర్ కట్టమీదుగా పాత టోలుగేటు వద్ద కలపాలనే ఆలోచన చేస్తున్నారు. అయితే రోడ్డు దానికి సరిపోదని, అది కూడా సమస్యగానే ఉంటుందని అంటున్నారు. దీనిపై త్వరలోనే స్పష్టమైన నిర్ణయం రానున్నట్లు తెలిసింది.

ముంబయిలో అగ్నిప్రమాదం

- ఏడుగురు సజీవదహనం

ముంబయి : మహారాష్ట్ర రాజధాని నగరంలో ముంబయిలో ఘోరం చోటుచేసుకుంది. చెంబూరు ప్రాంతంలోని సిద్ధార్థ కాలనీలోని రెండంతస్తుల భవనంలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో ఏడుగురు సజీవదహనమయ్యారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..దుకాణం, నివాసం కలిసివున్న ఈ భవనంలో ఆదివారం ఉదయం 5.20 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగాయి. కాసేట్లోనే భవనమంతా మంటలు వ్యాపించాయి. ఈ దుర్ఘటనలో ఏడేళ్ల బాలికతో సహా ఏడుగురు చనిపోయారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజవాడిలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒక దుకాణాన్ని కలిగి ఉండగా, పై అంతస్తును నివాసంగా వినియోగించుకుంటున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని షాపులోని ఎలక్ట్రిక్ వైరింగ్, ఇన్‌స్టాలేషన్‌లకు మంటలు చెలరేగాయి. ఇవి పై అంతస్తుకు వ్యాపించడంతో ప్రమాదం చోటుచేసుకుంది. షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగివుండవచ్చునని అధికారులు భావిస్తున్నారు.

నయా ఉదారవాద విధానాలపై పోరాడి

ఫాసిజాన్ని పాతిపెట్టాలి

- సామ్రాజ్యవాదంపై పోరాడి లెనిన్ వారసత్వాన్ని నిలబెట్టాలి
- విశాఖ లెనిన్ శత వర్థంతి సభలో ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

ఫాసిజాన్ని ఓడించాలంటే దానికి మూలమైన నయా ఉదారవాద విధానాలపై నిరంతరం పోరాడాలని ప్రముఖ ఆర్థికవేత్త, ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ పిలుపునిచ్చారు. సోవియట్ సోషలిస్ట్ విప్లవ రథసారథి, సమసమాజ నిర్మాత విఐ.లెనిన్ శత వర్థంతి సభ విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఆదివారం జరిగింది. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. తొలుత లెనిన్ చిత్రపటానికి, ఇటీవల కన్నుమూసిన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం వివిధ అంశాలపై సెమినార్లు జరిగాయి. 'లెనిన్ విప్లవ జీవితం - సోషలిస్టు విప్లవం - నేటి సామ్రాజ్యవాదం', అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ప్రభాత్ పట్నాయక్, 'ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి - లెనినిస్టు దృక్పథం- ప్రత్యామ్నాయ విధానాలు అంశంపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. లోకనాథం, 'లెనినిజం - వర్తమానం-కర్తవ్యం' అంశంపై మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్ శర్మ కీలక ఉపన్యాసం చేశారు. ప్రభాత్ పట్నాయక్ మాట్లాడుతూ సామ్రాజ్యవాదం, ఫాసిజంపై పోరాటానికి లెనిన్ రచనలే ఆయుధమన్నారు. గతంలో జరిగిన రెండు ప్రపంచ యుద్ధాలు సామ్రాజ్యవాదుల మధ్య ఘర్షణ వల్లే తలెత్తాయని, ఆ కాలంలోనే ప్రపంచంలోని పలు దేశాలు సామ్రాజ్యవాద వలసల నుంచి బయటపడ్డాయని వివరించారు. మార్క్స్, ఎంగెల్స్ చూపిన సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టడానికి లెనిన్ తగిన ప్రణాళిక వేశారన్నారు. 1917లో రష్యాలో సోషలిజం విజయానికి బాటలు వేశారని తెలిపారు. కార్మికవర్గ పార్టీ ఎలా ఉండాలో తెలియజెప్పిన మహోపాధ్యాయుడు లెనిన్ అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో అనేక దేశాలు వలసల నుంచి విముక్తి పొంది 1917 తర్వాత స్వాతంత్ర్యం సాధించాయన్నారు. నయా ఉదారవాద విధానాల అమలుకు ముందు మన దేశంలో చిన్నచిన్న ఉత్పత్తిదారులకు పంటల మద్దతు ధరలను ప్రభుత్వాలు ఇచ్చాయని గుర్తు చేశారు. పెట్టుబడులు సమకూర్చాయన్నారు. పరిశోధనలకు ప్రాధాన్యమిచ్చి నీటిపారుదల సౌకర్యాలను సమకూర్చి, ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేశాయని మిగతా 2లో

లెనిన్ వర్థంతి సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్

మెరీనా బీచ్

చెన్నై మెరీనా బీచ్ వద్ద తొక్కిసలాట

- ఐదుగురు మృతి.. ఆస్పత్రుల్లో క్షతగాత్రులు
- మెగా ఎయిర్ షో వీక్షించేందుకు భారీగా సందర్శకులు

చెన్నై: భారత వైమానిక దళం 92వ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా తమిళనాడులోని చెన్నై మెరీనా బీచ్ వద్ద తోక్కిసలాట జరిగింది. భారత వైమానిక దళం ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించిన 'మెగా ఎయిర్ షో' ను వీక్షించేందుకు లక్షలాది సందర్శకులు పోటెత్తారు. తిరుగు ప్రయాణంలో ఎక్కడికక్కడ రద్దీ ఏర్పడటంతో వారంతా తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ఉక్కపోత, ఎండవేడిమి తాళలేక నలుగురు సొమ్మసిల్లి ప్రాణాలు విడిచారు. మరొకరు గుండెపోటుతో మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఐసియులో చికిత్స అందిస్తున్నారు. దాదాపు 230 మందిని చెన్నైలోని 3 ఆసుపత్రులకు తరలించారు. వీరిలో ఎక్కువ మందిని చికిత్స అనంతరం ఇంటికి పంపారు. ఎయిర్ షోకు దాదాపు 15 లక్షల మందికి పైగా సందర్శకులు హాజరైనట్లు అంచనా. మధ్యాహ్నం ఒంటిగంటకే ప్రదర్శన ముగిసినప్పటికీ.. సాయంత్రం వరకు ట్రాఫిక్ కొనసాగింది. క్షతగాత్రులను అంబులెన్స్‌ల ద్వారా ఆస్పత్రులకు తరలించేందుకూ ఇబ్బంది ఎదురైంది. చెన్నైనుంచే కాకుండా పరిసర ప్రాంతాల ప్రజలు భారీగా తరలివచ్చారు.. దీంతో మెరీనా బీచ్ సమీపంలోని లైట్‌హౌస్ మెట్రో స్టేషన్, మిగతా 2లో

విశాఖ స్టీలుపై కేంద్రాన్ని ప్రశ్నించండి

- షర్మిల డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ స్టీలు ప్లాంటు పరిరక్షణ కోసం గతంలో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, మోడీ, షాను నిలదీయాలని పిసిసి అధ్యక్షులు షర్మిల డిమాండ్ చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆదివారం ఆమె పోస్టు చేశారు. ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలో విశాఖ స్టీలుప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చంద్రబాబు రాసిన లేఖను కూడా ఆయనకు పంపుతున్నట్లు పేర్కొన్నారు. ఆ లేఖ ప్రతిని ఎక్స్‌లో చేసిన పోస్టులో జత చేశారు. ప్రైవేటీకరణ అడ్డుకుంటామని, ప్లాంటు పూర్వ వైభవానికి కృషి చేస్తామని, అవసరమైతే రాజీనామాలు కూడా చేస్తామని ఆ లేఖలో రాశారో లేదో ఒకసారి చదవాలని కోరారు. మాటమీద నిలబడే తత్వం ఉంటే, ఇచ్చిన లేఖకు విలువ ఉంటే వెంటనే కేంద్రాన్ని నిలదీయాలని కోరారు. ప్లాంటు ప్రైవేటీకరణ ఆపకపోతే మద్దతు ఉపసంహరించుకోవాలని, ఆంధ్రుల హక్కు ముఖ్యమా ? బిజెపితో పొత్తు ముఖ్యమా, విశాఖ ఉక్కు ముఖ్యమా- ఎన్‌డిఎలో పదవులు ముఖ్యమా తేల్చకోవాలని అన్నారు. కార్మికులకు విజయదశమి కానుకగా ప్లాంటును సెయిల్‌లో విలీనం చేస్తున్నట్లు, 14 వేలమంది కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేస్తున్నట్లు ప్రకటన ఇవ్వాలని కోరారు. భూములు కోల్పోయిన ఎనిమిది వేల మందికి ఉద్యోగాలు ఇస్తున్నట్లు అధికారిక ప్రకటన చేయించాలని, లేనిపక్షంలో ఎన్‌డిఎ కూటమి నుండి వైదొలగాలని కోరారు.

నాలుగుకు చేరిన ఆన్‌లైన్ బెట్టింగ్ మృతుల సంఖ్య

ప్రజాశక్తి- గంగాధరనెల్లూరు(చిత్తూరు జిల్లా)

ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పులపాలై కుటుంబం ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. పురుగుల మందు తాగిన ఘటనలో దినేష్ (23) చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందారు. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరులో నాగరాజురెడ్డి, ఆయన భార్య జయంతి, కుమార్తె సునీత, కుమారుడు దినేష్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన విషయం తెలిసిందే. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నాగరాజురెడ్డి, జయంతి, సునీత శనివారం మృతి చెందారు. వారి స్వగ్రామమైన గంగాధర నెల్లూరులో కుటుంబ సభ్యులు ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. దినేష్ మృతదేహానికి సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చెన్నై మెరీనా బీచ్ వద్ద తొక్కిసలాట

(మొదటిపేజీ తరువాయి)

వెళచ్చేరి వద్ద ఉన్న ఎంఆర్‌టీఎస్ రైల్వేస్టేషన్‌లు కిక్కిరిసిపో యాయి. షో ముగిసిన అనంతరం తిరుగుప్రయాణం కోసం వేలాది మంది ఒక్కసారిగా స్టేషన్‌లకు చేరుకోవడంతో.. ప్లాట్‌ఫాంలపై నిలబడేందు కూ వీల్లేని పరిస్థితి ఏర్పడింది. అన్నా స్క్వేర్‌లో ని బస్‌స్టాప్‌కు సందర్శకులు పోటెత్తారు.

వైమానిక విన్యాసాలు

మెరీనా బీచ్‌లో ఆదివారం ఉత్కంఠభరితంగా, అద్భుతమైన వైమానిక ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనను సుమారు పదిహేను లక్షల మంది ప్రజలు వీక్షించారు. ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో ప్రజలు హాజరైన వైమానిక కార్యక్రమంగా ఇది లిమ్కా బుక్ రికార్డులలో స్థానం సంపాదించుకుంది. ఇరవై ఒక్క సంవత్సరాల తర్వాత జరిగిన వైమానిక సాహసాలను తిలకించేందుకు ప్రజలు కోవళం నుండి ఎన్నూరు వరకూ తూర్పు తీర రహదారి పైన, ఎత్తయిన భవనాల పైన చేరారు. గరుడ్ కమాండో బృందం చేపట్టిన బందీల విడుదల ఆపరేషన్‌తో ఎయిర్ షో మొదలైంది. స్క్వాడ్రన్ నాయకులు భావనా కాంత్, అవని చతుర్వేది సుఖోయ్-30 ఎంకెఐని నడిపి మహిళా శక్తిని చాటారు. స్క్వాడ్రన్ లీడర్ మోహన సింగ్ హెచ్‌ఏ ఎల్ తేజస్ ఫైటర్ జెట్‌ను నడిపారు. శివాంగి సింగ్ రఫేల్ విమానాన్ని, ఇతర మహిళా అధికారులు మిగ్-29ను నడిపారు. నెమ్మదిగా కదిలే హెలికాప్టర్ల నుండి సూపర్ సోనిక్ ఫైటర్ జెట్ల వరకూ వివిధ రకాల విమానాలు విన్యాసాలలో పాల్గొ న్నాయి. రఫేల్ సూపర్ సోనిక్ జెట్ నుండి గగనతలంలో బాణసంచా పేల్చారు.

బాలిక హత్యపై రాజకీయం తగదు

(మొదటిపేజీ తరువాయి)

వారిని ఓదార్చారు. న్యాయం చేస్తామని, నిందితులను కఠినంగా శిక్షిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం విలేకర్లతో మంత్రి అనిత మాట్లాడుతూ పుంగనూరుకు చెందిన బాలిక హత్య కేసులో ఎవరినీ వదలబోమన్నారు. బాలిక తల్లిదండ్రులకు భరోసా కల్పించాల్సిన సమయంలో వారిని మరింత బాధపెట్టేలా తప్పుడు ప్రసారాలు సమంజసం కాదని పేర్కొన్నారు. సంఘటన జరిగిన వెంటనే జిల్లా ఎస్‌పి మణికంఠ చందోలు దర్యాప్తు చేపట్టారని, రెండు రోజులపాటు పుంగనూరులోనే ఉండి బాలికను సజీవంగా తల్లిదండ్రులకు అప్పగించేందుకు 12 బృందాలు, క్లూస్ టీములు, డాగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే, బాలిక మృతదేహం స్టోరేజ్ ట్యాంకులో తేలడం అత్యంత బాధాకరమన్నారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఈ సంఘటన దురదష్టకర మని, బాలికను దారుణంగా హత్య చేశారని తెలిపారు. బాలిక మృతిని రాజకీయ కోణంలో చూడొద్దని, బాలిక పేరును సోషల్ మీడియా లో పదేపదే ప్రస్తావించడం, అత్యాచారం జరిగినట్లు చిత్రీకరించడం తగదన్నారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

వర్తమాన పరిస్థితులకు

లెనిన్ దృక్పథాన్ని అన్వయించి పోరాడాలి

- లెనిన్ శత వర్ధంతి సభలో వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

లెనిన్ శత వర్ధంతి సభలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు

మారిన వర్తమాన పరిస్థితులకు అనుగుణంగా లెనిన్ దృక్పథాన్ని అన్వయించుకుని పోరాడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అసమానతలు లేని అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. సోవియట్ సోషలిస్ట్ విప్లవ రథసారథి - సమసమాజ నిర్మాత వి.ఐ.లెనిన్ శత వర్ధంతి సభ సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగింది. దీనిలో భాగంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి సెమినార్‌లో 'ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి - లెనినిస్టు దృక్పథం - ప్రత్యామ్నాయ విధానాలు' అనే అంశంపై వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ 1908 నుంచి లెనిన్ మన స్వాతంత్ర్య పోరాటానికి మద్దతుగా నిలిచారన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ, సుభాస్ చంద్రబోస్, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి వాళ్లు లెనిన్ ఆలోచనలకు ప్రభావితం అయ్యారన్నారు. 1917లో రష్యాలో ఏర్పడిన సోవియట్ ప్రభుత్వం మన దేశాన్ని, రాష్ట్రాన్ని బాగా ప్రభావితం చేసిందన్నారు. 1919లో వచ్చిన మాలపల్లి నవలలో ఉన్నం లక్ష్మీనారాయణ సోవియట్ రాజ్యం గురించి ప్రముఖంగా ప్రస్తావించడం విశేషమని పేర్కొన్నారు. మనదేశం, రాష్ట్రంపై లెనిన్ కమ్యూనిజం భావజాలం ప్రభావం చూపిందనడానికి ఇది తార్కాణమన్నారు. తొలి నుంచీ లెనిన్ మన దేశంలో అందరికీ సుపరిచితుడని తెలిపారు. కమ్యూనిజం నేటి సమాజానికి పనికిరాదంటూ కొందరు ప్రచారం చేయడాన్ని వి.శ్రీనివాసరావు ప్రస్తావించారు. 200 సంవత్సరాల క్రితం నాటి కమ్యూనిజం నేటి సమాజానికి పనికి రాదట, 2000 సంవత్సరాల క్రితం నాటి సనాతన ధర్మం పనికొస్తుందట అని విమర్శించారు. లెనిన్ శిష్యుడైన చేగువేరా ఫొటోలను టీ షర్టులపై వేసుకుని, లెఫ్ట్ స్పేస్‌ను ఆక్రమించి, యువతను ఆకర్షితులను చేసిన పవన్ కల్యాణ్ నేడు ఎలా ప్లేటు ఫిరాయించి లెఫ్ట్ నుంచి రైట్‌కి జారిపోయారో చూడండంటూ ఎద్దేవా చేశారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి... 'నీ మతం.. నా మతం' అంటూ మాట్లాడడం సరైంది కాదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాల్సిన పవన్ ఆ పనిచేయడం లేదన్నారు. పెట్టుబడి దారుల మద్దతుకు దాసోహమై 2024 ఎన్నికల్లో చేగువేరాను పక్కనపెట్టి కాషాయ వస్త్రాలను పుచ్చుకున్నారన్నారు. ఇలాంటి వాళ్లు ఎవ్వరూ వామపక్షాలకు ప్రత్యామ్నాయం కాదని, కమ్యూనిస్టులే దేశానికి, రాష్ట్రానికి ప్రత్యామ్నాయమని తెలిపారు. విజన్ 2020 అయిపోయిందని, తాజాగా 2047 విజన్ వికసిత్ భారత్ మోడీ మోడల్‌ను రాష్ట్రంలో చంద్రబాబు అమలు చేసే దిశగా వెళ్లడం హాస్యాస్పదమని అన్నారు. విజన్ 2020లో పిపిపి విధానంలో వెళ్లారని, ఇది తిరోగమనం అని అందరికీ అర్థమైందని వివరించారు. తాజాగా పిపిపికి మరో 'పి' చేరిందని, ప్రజల ఆస్తులను ప్రయివేట్‌పరం చేయడం లేదా అమ్మేయడమే పిపిపిపి అని విమర్శించారు. దీనివల్ల ప్రకృతి వనరులేవీ భవిష్యత్తులో మిగలవని, అందుకే 2047 విజన్‌ను వ్యతిరేకించాలని అన్నారు.

సవాళ్లను గుర్తించి ముందుకెళ్లాలి

మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ

నేటి సమాజంలో ఎదురయ్యే తాత్విక, సామాజిక సవాళ్లను గుర్తించి ముందుకెళ్లడమే లెనిన్ చూపిన మార్గమని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ అన్నారు. 'లెనినిజం - వర్తమానం - కర్తవ్యం' అనే అంశంపై ఆయన మాట్లాడారు. భారతదేశ వారసత్వమే లౌకికవాదం తప్ప, సనాతనం కానేకాదన్నారు. అశోకుడి కాలం నుంచి లౌకికవాద పునాదులున్నాయని వివరించారు. అందుకోసం గత కాలపు తాత్విక భావాలతో అన్ని విషయాలను సరిచూసుకోవాలని, ఇదే లెనిన్ ఉంచిన కర్తవ్యమని అన్నారు. గతాన్ని వక్రీకరించి తప్పులు చేసే సంఘపరివార్, ఇతర ఉన్మాద శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సభా వేదికపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, విఎస్.పద్మనాభరాజు, విశాఖ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.పద్మ, బి.ఈశ్వరమ్మ, బి.జగన్, కెఎం.శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, ఎం అప్పలరాజు ఉన్నారు.

సింహ, ముత్యపు పందిరిపై శ్రీమలయప్ప

ప్రజాశక్తి- తిరుమల:


సింహ వాహనంపై శ్రీమలయప్ప

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజైన ఆదివారం ఉదయం శ్రీ మలయప్ప స్వామి సింహ వాహనంపై యోగనరసింహుడి అలంకారంలో, రాత్రి ముత్యపు పందిరి వాహనంపై ఉభయదేవేరులతో శ్రీవారు దర్శనమిచ్చారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష్టితో స్వామివారిని కీర్తిస్తూ మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. వాహనసేవలో తిరుమల పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, హైకోర్టు జడ్జి జస్టిస్ బివిఎల్ఎన్ చక్రవర్తి, టిటిడి ఇఒ జె శ్యామలరావు దంపతులు, అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి దంపతులు, జెఇఒలు గౌతమి, వీరబ్రహ్మం, సివిఎస్ఒ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

లాటరీలో అధీకృత వ్యక్తులకు అనుమతి

- ఎక్సైజ్‌శాఖ డైరెక్టరు నిషాంత్ కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నూతన మద్యం పాలసీని అనుసరించి ఒక షాపు కోసం ఒకే వ్యక్తి దాఖలు చేసే దరఖాస్తుల సంఖ్యపై ఎలాంటి పరిమితి లేదని, అలాగే ఒక వ్యక్తి నిర్వహించగల షాపుల సంఖ్యపైనా పరిమితి విధించలేదని రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ డైరెక్టరు నిషాంత్ కుమార్ తెలిపారు. మద్యం షాపుల కోసం నిర్వహించే లాటరీ ప్రక్రియలో పాల్గొనాల్సిన వ్యక్తి తరపున ఇతరులకు అధీకృత అనుమతి ఇవ్వొచ్చని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిర్దేశిత షాపు కోసం దరఖాస్తుదారుల ప్రతినిధులు, అతని తరపున దరఖాస్తు దాఖలు చేయడానికి, డ్రాలో పాల్గొనడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రక్రియను సులభతరం చేస్తూ స్వీయ ధ్రువీకరణ కోసం ఐడి ఆధారిత ప్రామాణికంతో కూడిన నమూనాను ఇప్పటికే విడుదల చేశామని తెలిపారు.

విశాఖ ఉక్కు త్యాగాలను మరిచిపోవద్దు

- పరిశ్రమను కాపాడుకోవాలి
- ఉద్యోగులు, కార్మికులు, భూ నిర్వాసితుల ప్రతిపాదన కేంద్రానికి చెబుతా
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పవన్‌కల్యాణ్‌ను కలిసిన స్టీల్‌ప్లాంట్ కార్మికసంఘాల నాయకులు

విశాఖ స్టీలు ప్లాంటు ఏర్పాటు కోసం చేసిన త్యాగాలను మరిచిపోవద్దని, పరిశ్రమను కాపాడుకోవాలనే భావోద్వేగం కార్మికులు, ఉద్యోగులు, వారి సంఘాల్లో ఉండాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. ఆదివారం ఉదయం విశాఖ స్టీలు ప్లాంటు కార్మిక సంఘాల నాయకులు క్యాంపు కార్యాలయంలో ఆయనతో సమావేశమయ్యారు. విశాఖ ప్లాంటు ప్రైవేటీకరణ కాకుండా ఆపాలని వారు కోరారు. 12,500 మంది ఉద్యోగులు, 14 వేల మంది కాంట్రాక్టు కార్మికులు ఉన్నారని చెప్పారు. పరిశ్రమను కాపాడుకునేందుకు ఉద్యోగులు, కార్మికులు, భూ నిర్వాసితులు తెలిపిన ప్రతిపాదనలను కేంద్రం దృష్టికి తీసుకెళతామని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ప్లాంటును ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచన వచ్చినప్పుడు కేంద్రంతో మాట్లాడామని చెప్పారు. అప్పట్లోనే కేంద్రం వద్దకు అఖిలపక్షం వెళ్లి వినతి ఇద్దామని కోరితే పలువురు స్పందించలేదని అన్నారు. తొలుత స్టీలు ప్లాంటు ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి రామస్వామి.. ప్లాంటును కాపాడేందుకు తీసుకోవాల్సిన అంశాలను పవన్‌కల్యాణ్‌కు వివరించారు. ప్రధానంగా సొంత గనులు సమకూర్చడం కేంద్రం బాధ్యత అని, అలా చేయకపోవడం వల్లే నష్టాలు వస్తున్నాయని తెలిపారు. వెంటనే గనులు కేటాయించేలా చూడాలని కోరారు. ప్లాంటును పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చర్చల అనంతరం గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడిపించాలని, ముడిసరుకు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ నాలుగు డిమాండ్లను కేంద్రం ముందు పెట్టాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఐఎన్‌టియుసి నాయకులు ఎం రాజశేఖర్, ఎఐటియుసి నాయకులు కెఎస్ఎన్ రావు, జనసేనతో సహ పది యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యుఎస్ ల్యాబ్ ఉద్యోగుల బకాయిల విడుదలకు హామీ

గ్రామీణ నీటి సరఫరా విభాగంలో పని చేస్తున్న ల్యాబ్ ఉద్యోగుల జీతాల బకాయిలను వెంటనే విడుదల చేసేలా అధికారులకు ఆదేశాలు ఇస్తామని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో తనను కలిసిన ఆర్‌డబ్ల్యుఎస్ ఇంటర్నల్ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ లేబరేటరీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ ల్యాబ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. రాజకీయ ఒత్తిళ్లతో తమను ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని, గత మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కడప జిల్లా కమలాపురం ల్యాబ్‌లో గత పదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న వికలాంగురాలైన జి సుజన మాట్లాడుతూ.. మూడు నెలల కిందట తనను విధుల నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ఆధారం లేని తనకు తిరిగి ఉద్యోగం ఇప్పించాలని కోరారు. అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి ఆమెకు హామీ ఇచ్చారు. .

ఫాసిజాన్ని పాతిపెట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ప్రభుత్వ జోక్యం అన్ని విషయాల్లోనూ ఉండడంతో దేశంలో అనేక రంగాలు అభివృద్ధి జరిగి ఉపాధి పెరిగి, వ్యవసాయ, పారిశ్రామిక అభివృద్ధి ఎంతోకొంత జరిగిందన్నారు. నయా ఉదారవాద విధానాలు అమలయ్యాక ప్రభుత్వాలు ద్రవ్యలోటును తగ్గించుకుంటూ ప్రజలపై భారాలు వేశాయని తెలిపారు. వ్యవసాయం దెబ్బతిందన్నారు. వ్యవసాయం చేయలేక ఆత్మహత్యలు చేసుకునేవారి సంఖ్య, గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలసల సంఖ్య పెరిగిపోయిందని తెలిపారు. 1991-2011 మధ్యకాలంలో 1.4 కోట్ల మంది వ్యవసాయం వదిలేసి వేర్వేరు పనులకు ఇలా వెళ్లిపోయారన్నారు. నేడు అమెరికన్ సామ్రాజ్యవాదం ప్రపంచ దేశాలపై పెత్తనం చెలాయించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని, ఇజ్రాయిల్, ఉక్రెయిన్‌లను పావులుగా వాడుకుంటోందని తెలిపారు. గతేడాది నుంచి ఇజ్రాయిల్‌తో పాలస్తీనాపై దాడులు చేయిస్తోందన్నారు. పశ్చిమాసియా దేశాలకు విస్తరించేందుకు అమెరికన్ సామ్రాజ్యవాదం తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని వివరించారు. ప్రపంచ చమురు ఉత్పత్తులపై అమెరికా పెత్తనం కోసం రష్యా, చైనా దేశాలను దెబ్బకొట్టే చర్యలను తీవ్రం చేసిందన్నారు. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రమాదాన్ని వివరించారు. నయా ఉదారవాద విధానాలను అమలు జరిపించడం ద్వారా పలు దేశాల్లో సహజ వనరులను దోపిడీ చేయడం, ప్రపంచంలోని వివిధ దేశాల మధ్య యుద్ధ వాతావరణం పెంపొందించడం వంటివి చర్యలకు పాల్పడుతోందని వివరించారు. ప్రపంచంలో పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి, రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం దీనికి ఒక తార్కాణమని పేర్కొన్నారు. నయా ఉదారవాద విధానాలు దేశ సార్వభౌమత్వంపై దాడిని పెంచుతూ దేశాన్ని ఫాసిజం వైపునకు తీసుకెళ్తాయని ప్రభాత్ పట్నాయక్ ఆందోళన చెందారు. ఉదారవాద విధానాలతో స్థూల జాతీయోత్పత్తి రేటు పెరుగుతున్నట్టు పాలకులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. సామ్రాజ్యవాదంపై పోరాడడం ద్వారా లెనిన్ వారసత్వాన్ని నిలబెట్టాలని పిలుపునిచ్చారు.

టిడిపి కార్యకర్తలపై అక్రమ కేసులు ఎత్తివేయిస్తాం

- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

వైసిపి హయంలో టిడిపి కార్యకర్తలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసేందుకు కృషి చేస్తానని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ తెలిపారు. గుంటూరు జిల్లా వట్టిచేరుకూరు, కాకుమానులలో ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ అక్రమ కేసులను ఎత్తివేయడానికి తాను న్యాయ నిపుణులతో చర్చిస్తానని, ఉచితంగా న్యాయ సహాయం చేస్తానని చెప్పారు. ఇందుకు సంబంధించి కొంతమంది న్యాయవాదులను ఏర్పాటు చేస్తానన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కృషి చేస్తామని, గుంటూరు ఛానల్ విస్తరణ, పొడిగింపు, నల్లమడ డ్రెయిన్ ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం ఎలా అందించాలని అంశంపై అధికారులతో నిరంతరంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. నీటి పారుదల రంగాన్ని గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ఈ ఏడాది రాష్ట్రానికి ఉపాధి హామీ పథకం కింద రూ. 2,800 కోట్లు మంజూరయ్యా యని తెలిపారు. గుంటూరు పార్లమెంటు పరిధిలోని ప్రతి నియోజకవర్గంలోనూ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'అసాగో'ను మూసివేయండి : ఫ్యాక్టరీ వద్ద ప్రజల ఆందోళన

ప్రజాశక్తి-గోకవరం (తూర్పుగోదావరి జిల్లా)

తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రామంలో నిర్మించిన అసాగో పరిశ్రమను మూసివేయాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామ ప్రజలు ఫ్యాక్టరీ వద్ద ఆదివారం పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఫ్యాక్టరీ వల్ల దుర్వాసన ఎక్కువగా వస్తోందని, శబ్దాలతో చెవులకు చిల్లులు పడుతున్నాయని, చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీని మూసివేయాలంటూ ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. సమస్యను పరిష్కరించకుంటే ఆందోళనను ఉధతం చేస్తామని పరిశ్రమ యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆందోళనలో పాల్గొన్న మహిళలు మాట్లాడుతూ.. అసాగో ఫ్యాక్టరీ కాలుష్యం వల్ల తమ గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

మాట్లాడుతున్న కేరళ ఎంపి, కైరళి టివి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జాన్ బ్రిట్టాస్

డిజిటల్ మీడియాపై మోడీ దాడి

- ఆధిపత్యం కోసమే బ్రాడ్‌కాస్టింగ్ బిల్లు
- జాతీయ 'మోడియా'గా మారిన మీడియా
- టి-10 వార్షికోత్సవ జాతీయ సదస్సులో జాన్ బ్రిట్టాస్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

జాతీయ మీడియా 'మోడియా'గా మారాక, ఇప్పుడు ప్రధాని దృష్టి డిజిటల్ మీడియాపై పడిందని కేరళ ఎంపి, కైరళి టివి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జాన్ బ్రిట్టాస్ అన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో జాతీయ మీడియా తటస్థంగా వ్యవహరించి ఉంటే, మోడీకి మూడు శాతం ఓట్లు తగ్గి, 200 సీట్ల కంటే తక్కువ వచ్చి ఉండేవని విశ్లేషించారు. ప్రధాన మీడియాపై ప్రజల్లో ఆదరణ తగ్గి, డిజిటల్ మీడియా ప్రభావం పెరిగి, మైండ్ ఇండస్ట్రీగా మారిందని, దీంతో, బ్రాడ్‌కాస్టింగ్ బిల్లు పేరుతో దానిపై మోడీ ఆంక్షలు విధిస్తున్నారని వివరించారు. డిజిటల్ మీడియాను క్రమేణా కార్పొరేటీకరించే ప్రయత్నాలు మొదలయ్యాయన్నారు. యూట్యూబ్‌లో ఏ వీడియో పోస్ట్ చేసినా అది ప్రభుత్వానికి, ప్రధానికి వ్యతిరేకంగా ఉంటే, దాన్ని ఎడిట్ చేయడం లేదా తొలగించడం కూడా ప్రభుత్వమే చేసేలా బ్రాడ్‌కాస్టింగ్ బిల్లులో నిబంధనలు చేర్చారని తెలిపారు. ఇందిరా గాంధీ మరణం తర్వాత రాజీవ్ గాంధీ అత్యధిక మెజారిటీతో ప్రధానిగా పనిచేశారని, అప్పటి మీడియా బోఫోర్స్ వంటి కుంభకోణాలను వెలికితీసి ప్రజలను జాగృతం చేసిందని, ఫలితంగా తర్వాతి ఎన్నికల్లో ఆయన అధికారాన్ని కోల్పోయారని గుర్తు చేశారు. గడిచిన 11 ఏళ్లగా జాతీయ మీడియా ఈ తరహా పరిశోధనాత్మక జర్నలిజం ఎందుకు చేయట్లేదని ప్రశ్నించారు.

రాజ్యాంగ పీఠికలోని అంశాలకు భిన్నంగా మోడీ ప్రభుత్వ పాలన సాగుతోందని, లోక్‌సభలో ఆయనకు పూర్తి మెజారిటీ రానందున ఈ దఫా మనుస్మృతితో కూడిన రాజ్యాంగ మార్పు జరగకున్నా, ఆ ముప్పు మాత్రం పొంచే ఉందని హెచ్చరించారు. 1992లో శిలాన్యాస్ పేరుతో బాబ్రీ మసీదు కూల్చివేసినప్పుడు అన్ని జాతీయ పత్రికలూ లౌకికత్వానికి భంగం కలిగిందంటూ ఎడిటోరియల్స్ రాశాయని, అవే పత్రికలు అయోధ్యలో రామమందిర నిర్మాణం జరిగితే దాన్నో చారిత్రక ఘట్టంగా అభివర్ణిస్తూ ఎడిటోరియల్స్ రాశాయని తెలిపారు. ఈ మార్పు ఎందుకు, ఎలా వచ్చిందో ప్రజలు అర్థం చేసుకోవాలని సూచించారు. కార్పొరేట్ కబంధ హస్తాల్లో మీడియా చిక్కుకుని, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తోందని విమర్శించారు. ఆర్ఎస్ఎస్‌కు, రాముడికి ఎలాంటి సంబంధమూ లేదని, సానుభూతి, ప్రేమకు చిహ్నంగా రాముడిని కొలుస్తామని, నాథూరాం గాడ్సే ఆర్ఎస్ఎస్‌కు మాత్రమే చెందినవారని పేర్కొన్నారు. మణిపూర్ అల్లర్లతో అట్టుడుకుతుంటే ప్రధాని మోడీ... అయోధ్య రామమందిర ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధాన పూజారిగా వ్యవహరించారని ఎద్దేవా చేశారు. న్యాయవ్యవస్థలో హేతుబద్ధత, తర్కం లేకుండా తీర్పులు వస్తున్నాయని, దీన్నెలా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. న్యాయమూర్తులు రిటైర్డ్ అవగానే కేంద్రప్రభుత్వం వారికి పదవులు ఇస్తోందని, దేశం ఎటుపోతుందో అర్థం కావట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా ప్రశ్నించే గొంతులను, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమానికి టీ-10 సిఇఒ శ్రీసుందర్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్, నవతెలంగాణ సంపాదకులు ఆర్.సుధాభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ప్రజానాట్యమండలి కళాకారులు పలు ప్రదర్శనలు నిర్వహించారు.

లడ్డుపై పెట్టిన శ్రద్ధ వరద బాధితులపై ఏదీ?

- 35 రోజులు గడిచినా అందని సాయం : సిపిఎం

ప్రజాశక్తి-విజయవాడ

తిరుపతి లడ్డుపై చూపించిన ఆసక్తి, శ్రద్ధ వరద బాధితులపై పెడితే బాగుండేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు అన్నారు. విజయవాడ గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్‌తో కలిసి ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల రాష్ట్రంలో సంభవించిన వరదల వల్ల 11.5 లక్షల మంది ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఈ విపత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతతోపాటు గత పాలకుల వైఫల్యమూ ఉందని విమర్శించారు. చివరి బాధితుడికీ కూడా పరిహారం ఇస్తామని సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనవసర విషయాలపై దీక్షలు చేయడం సరికాదని, వరద సాయంపై కేంద్రాన్ని నిలదీయాలన్నారు. వరద నేపథ్యంలో 1.50 కోట్ల మందికి భోజనాలు, అల్పాహారం కోసం రూ.368 కోట్లు, వాటర్ బాటిళ్లు, అగ్గి పెట్టేలు, కొవ్వొత్తులు, జనరేటర్ కోసం రూ.26.86 కోట్లు, ఇతర సామాన్లకు రూ.23.7 కోట్లు ఖర్చు చేసినట్లు సిఎం చంద్రబాబు చెప్పారన్నారు. డ్రోన్ల ద్వారా మందులు, మంచినీటి సరఫరా కోసం రూ.2 కోట్లుపైనే ఖర్చులు చేశారని, హెలికాప్టర్‌కు రూ.76 లక్షలు, పడవల అద్దెలకు రూ.93 లక్షలు, రక్షణ సిబ్బంది భోజనాలకు రూ.58 లక్షలు, ఈతగాళ్లకు రూ.15 లక్షలు ఖర్చు చేశారన్నారు. కానీ దిగువ స్థాయిలో బాధితులకు పూర్తిగా వరద సాయం అందలేదని విమర్శించారు. వరద సాయం రూ.25 వేల నుంచి రూ.50 వేలకు పెంచి ఇవ్వాలని, ప్రతి ఇంటికీ ఎన్యుమరేషన్ చేయాలని, బుడమేరు వరదల్లో దెబ్బతిన్న ఇళ్ల పునర్నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు నెలల కరెంటు బిల్లు, ఇంటి పన్ను, మంచినీరు, డ్రెయినేజీ ఛార్జీలు పూర్తిగా రద్దు చేయాలని కోరారు. సింగ్‌నగర్‌లో జ్వరాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విష జ్వరాలు ప్రభులుతున్న చోట తక్షణమే మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేయాలని, ఎన్యుమరేషన్ కోసం మళ్లీ అధికారులను, మంత్రులను కేటాయించి సర్వే చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే వరద బాధితుల సమస్యలపై పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

పరిశీలనాత్మక దృక్పథంతో ఏ రంగంలోనైనా రాణించొచ్చు: అజయ్ ఘోష్

- ఘనంగా తెలుగు షార్ట్ ఫిల్మ్ పోటీలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

సినిమా ద్వారా సమాజానికి మంచి సందేశం ఇవ్వాలని, పరిశీలనా దృక్పథం ఉంటేనే దర్శకుడిగా, నటులుగా రాణించగలుగుతారని ప్రముఖ సినీ నటులు అజయ్ ఘోష్ అన్నారు. తెలుగు షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలోని ఎంబి భవన్‌లో షార్ట్ ఫిలిమ్స్, ప్రయివేట్ పాటల వీడియోలు, రీల్స్ పోటీలు ముగింపు కార్యక్రమం ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అజయ్ ఘోష్ మాట్లాడుతూ దర్శకులుగా రాణించాలంటే ప్రతి ఒక్కరూ సాహిత్యాన్ని, అంతకంటే ముఖ్యంగా పుస్తకాలు చదవాలన్నారు. సాహిత్యం ద్వారా సమాజ ప్రగతికి మార్గం చూపాలని పేర్కొన్నారు. ప్రతి అంశాన్ని కొత్త కోణంలో ఆలోచించడంతోపాటు సమాజ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని సినిమా లేదా షార్ట్ ఫిల్మ్ ద్వారా మంచి సందేశం ఇవ్వాలని సూచించారు. సృజనాత్మకతతో పాటు విద్యార్థిగా ప్రతి అంశాన్ని నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా ఇటువంటి పోటీలు నిర్వహించే వేదిక లేదని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకొని మంచి దర్శకులుగా, నటులుగా రాణించాలని ఆకాక్షించారు. ప్రముఖ సినీ దర్శకులు రామ్ భీమన మాట్లాడుతూ.. సినిమా ద్వారా మనం చూపించాలనుకునే అంశాన్ని కొత్త కోణంలో కొత్తదనంగా చూపించాలని తెలిపారు. ఉన్నతస్థాయి విలువలతో చక్కని సందేశాన్ని సినిమా ద్వారా సమాజానికి అందించాలన్నారు. తాను కూడా చిన్నప్పుడు షార్ట్ ఫిల్మ్‌లు తీసి దర్శకుడిగా ఎదిగానని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమలోని ప్రతిభకు పదునుపెట్టి చక్కగా రాణించాలన్నారు. ఈ కార్యక్రమానికి తెలుగు షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు యడ్ల పార్థసారధి అధ్యక్షత వహించగా.. అమరావతి బాలోత్సవ్ అధ్యక్షులు ఆర్.కొండలరావు, తెలుగు షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బికెఎస్ ప్రసాద్, డివి రాజు, ఎంబివికె కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, ప్రముఖులు గోళ్ల నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం తెలుగు సినీ పాటల పోటీలు, రీల్స్, షార్ట్ ఫిల్మ్ విజేతలకు బహుమతులను అందజేశారు.

బకాయిలు చెల్లించాలి

- పత్తి వ్యాపారి ఇంటి ఎదుట రైతుల ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గుంటూరు చంద్రమౌళి నగర్‌లోని పత్తి వ్యాపారి ఇంటి వద్ద పలువురు రైతులు ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రెండేళ్ల క్రితం తమ వద్ద వ్యాపారి నేరెళ్ల హరి పత్తి కొనుగోలు చేశారని, ఇంతవరకు డబ్బు చెల్లించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తంగా రూ.1.80 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని తెలిపారు. పోలీసులను ఆశ్రయించినా పట్టించుకోవడంలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి వ్యాపారి తమను మోసం చేశారని ఆరోపించారు. తమ వద్ద కొనుగోలు చేసిన పత్తిని ఇతర ప్రాంతాల్లో విక్రయించుకుని సొమ్ము చేసుకున్నారని, తమకు మాత్రం డబ్బులు ఇవ్వడం లేదని వాపోయారు. ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాలో పల్నాడు జిల్లా నుండి సుధాకరరెడ్డి, గుంటూరు జిల్లా నుండి శ్రీనివాసరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

నేటి వరకూ పిజి వైద్య విద్య ప్రవేశాల రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పిజి వైద్య విద్యలో ప్రవేశం కోసం ఎన్‌టిఆర్ వైద్య విశ్వవిద్యాలయం విడుదల చేసిన తాజా నోటిఫికేషన్‌లో ఈ నెల 7వ తేదీ వరకూ సాధారణ రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తొలుత విశ్వవిద్యాలయం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం గత నెల 27వ తేదీ నుంచి సాధారణ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మొదలై ఈ నెల 4తో ముగిసింది. అదనపు రుసుము (లేటు ఫీజు) చెల్లించి 5, 6, 7 తేదీల్లో రిజిస్ట్రేషన్లకు అధికారులు అవకాశం కల్పించారు. 5, 6 తేదీల్లో 16 మంది ఈ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ఈ మూడు తేదీల్లో జరిగిన రిజిస్ట్రేషన్లను కూడా సాధారణ రిజిస్ట్రేషన్లుగా పరిగణిస్తున్నట్లు ఆదివారం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. పిజి వైద్య విద్యలో ప్రవేశం కోసం ఇప్పటి వరకూ 8,645 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వెల్లడించారు.

పంట నష్టపోయిన వారిని ఆదుకోండి

- రేపు కౌలు రైతు సదస్సు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇటీవల సంభవించిన వరదలు కారణంగా నష్టపోయిన కౌలు రైతుల సమస్యలపై చర్చించేందుకు మంగళవారం కౌలు రైతు సదస్సును విజయవాడలోని ఎంబివికెలో నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు తెలిపారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి వెంకటేశ్వర్లుతో కలిసి ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వరదలు కారణంగా కృష్ణా నది, బుడమేరు పరివాహక ప్రాంతాల్లో అసైన్డ్, లంక భూముల్లో పంటలు వేసిన రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఈ ప్రాంతాల్లోని పట్టా భూముల రైతులకు ఎంతో కొంత నష్టపరిహారం ఇచ్చిన ప్రభుత్వం అసైన్డ్, లంక భూముల్లో రైతులు, కౌలు రైతులను విస్మరించడం తగదన్నారు. రైతులు పంటలు, వ్యవసాయ పరికరాలు నష్టపోయినా ఇప్పటి వరకూ కనీసం ఎన్యూమరేషన్ కూడా చేయలేదన్నారు. పంటలు నష్టపోయిన వారిలో అధిక శాతం కౌలు రైతులే ఉన్నారని తెలిపారు. వెంటనే ఎన్యూమరేషన్ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. లంకల్లోని పంట భూముల్లో ఇసుక మేటలు వేసిందని, దీనిని తొలగించడం సన్న, చిన్నకారు రైతులకు సాధ్యం కాదన్నారు. 8న జరిగే కౌలు రైతు సదస్సును విజయవంతం చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వరదలు కారణంగా 5 లక్షల ఎకరాల్లో పంట దెబ్బతిందని తెలిపారు. వీరిలో కౌలు రైతులే అధికంగా ఉన్నారని ముఖ్యమంత్రే ప్రకటించారన్నారు. దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇచ్చే విధానం పూర్తి అశాస్త్రీయంగా ఉందన్నారు. భారీగా నష్టపోయిన కౌలు రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధి పథకంలో పని దినాలను 100 నుంచి 150కు పెంచి లంక భూముల్లో ఇసుక మేటలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య మాట్లాడుతూ.. మొత్తం 18 మండలాల్లో రైతులు భారీగా నష్టపోయారన్నారు. పంట నష్టపోయిన సన్న, చిన్నకారు రైతులకు, కౌలు రైతులకు రూ.2 లక్షల వరకూ రుణాలను రీ షెడ్యూల్ చేసి ప్రభుత్వమే వడ్డీ చెల్లించి, కొత్తగా పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు. పంటల బీమాపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. బీమా నిబంధనలు మార్చి పంట నష్టపోయిన ప్రతి రైతుకూ సర్వే నెంబరు ఆధారంగా పరిహారం ఇవ్వాలన్నారు.

12 గంటలకు రూ.350

- నెల మొత్తం కష్టపడినా రూ.పదివేలే
- కార్మికుల శ్రమను దోచుకుంటున్న జీడీపిక్కల యాజమాన్యం
- కేరళలో ఇఎస్ఐ, పిఎఫ్ అమలు
- ఆంధ్ర కార్మికులకు అమలు కాని కార్మిక చట్టాలు

జీడిపిక్కల ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

జీడి పిక్కల పరిశ్రమల్లో పనిచేస్తున్న పేద, మధ్యతరగతికి చెందిన అనేక మంది మహిళలు పొట్టకూటి కోసం జీడీ పిక్కల పరిశ్రమల్లో పనులకు వెళ్తున్నారు. అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న యాజమాన్యాలు వారి శ్రమను దోచుకుంటున్నారు తప్ప కనీస వేతనాలు ఇవ్వడం లేదు. కార్మిక చట్టాలను అమలు చేయాల్సిన అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాకినాడ జిల్లాలోని తుని, తొండంగి, కోటనందూరు, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో 22 వరకూ జీడిపిక్కల ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటిలో 11 వరకూ కేరళ వారికి చెందినవి. కేరళ, ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన దాదాపు ఎనిమిది వేల మందికిపైగా మహిళా కార్మికులు పనిచేస్తున్నారు.

రూ.350 మించి రాని వేతనం

జీడీ పిక్కల పరిశ్రమల్లో పీస్ రేట్ పేరుతో మహిళల శ్రమను యాజమాన్యాలు దోపిడీ చేస్తున్నాయి. జీడీ పిక్కలను కటింగ్ చేసినందుకు కిలోకి రూ.30, పప్పుపై తొక్క తొలగింపు (పీలింగ్)కు రూ.35, గ్రేడింగ్ ఒక బాక్స్‌కు రూ.70, ఈ పనులు కాకుండా పిక్కలను బాయిలింగ్ చేసినందుకు కూలి ఇస్తారు. రోజుకు పది నుంచి 12 గంటలు నిరంతరాయంగా పని చేస్తే రూ.350 లోపు వస్తుంది. నెలకు రూ.పది వేలు మించి రావడం లేదని మహిళా కార్మికులు చెబుతున్నారు. పప్పు రేటు కేజీకి ఒక్కోచోట ఒక్కోలా ఇస్తున్నాయి. జీడిపప్పు ఏమాత్రం ముక్కలైనా ఆ లెక్కలను పరిగణనలోకి తీసుకోవడం లేదు. పని ఒత్తిడి ఎక్కువైందని, వేతనం పెంచాలని అడిగితే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని, లేదా కంపెనీనే మూసేస్తామంటూ యాజమాన్యాలు బెదిరింపులకు పాల్పడుతున్నాయని కార్మికులు చెబుతున్నారు. సేఫ్టీ పరికరాలు కూడా ఇవ్వడం లేదని కార్మికులు వాపోతున్నారు.

అమలు కాని కార్మిక చట్టాలు

రోజుకి 8 గంటలు మాత్రమే పని చేయించాలని చట్టా లున్నప్పటికీ జీడిపిక్కల యాజమాన్యాలు పట్టించుకోవట్లేదు. ప్రతి మహిళతో 12 గంటలపాటు పనిచేయిస్తున్నారు. పరిశ్రమల్లో కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ చట్టాలను అమలు చేయాల్సి ఉంది. కేరళకు చెందిన పరిశ్రమలో చట్టాలను అ మలు చేస్తున్నా.. ఆంధ్రా పరిశ్రమల్లో అమలు కావడం లేదు.

కార్మిక చట్టాలను అమలు చేయాలి

కేరళ పరిశ్రమల్లో ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు అమలవుతున్నాయి. రాష్ట్రానికి చెందిన పరిశ్రమల్లో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చట్టాలు అమలు కావడం లేదు. పరిశ్రమలు ఉన్న ప్రాంతంలో పది పడకల ఇఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలి. కూలి రేట్లు పెంచాలి. పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలి. పీస్ రేట్ పెంచి ఇవ్వాలి. కార్మిక చట్టాల ప్రకారం కేరళలో మాదిరిగా ఇక్కడ కూడా కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి.

- ఎస్.కె.పద్మ, తుని ఏరియా సిఐటియు నాయకురాలు

ఎటువంటి సౌకర్యాలూ లేవు

ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక చేయూతా లేకపోవడంతో దగ్గరలోని ఉన్న ఫ్యాక్టరీల్లో పని చేస్తున్నాను. పని ప్రదేశంలో సరైన సదుపాయాలు లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఎంత కష్టపడినా కూలి మాత్రం పెంచట్లేదు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి పెంచాలి.

- ఎం.లోకేశ్వరి, కార్మికురాలు, డి.పోలవరం, తుని మండలం

శ్రీ లలితా త్రిపురసుందరీదేవిగా దుర్గమ్మ

ప్రజాశక్తి - వన్‌టౌన్ (విజయవాడ)

విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ కొలువుతీరారు. ఆదివారం సెలవు రోజు కావడంతో అమ్మవారిని దర్శించుకునేందుకు యాత్రికులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. తెల్లవారుజాము నుండే యాత్రికులతో క్యూలైన్లు నిండిపోయాయి. ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టారు. కలెక్టర్ సృజన, నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి రమేష్, విజయవాడ ఏడవ అడిషనల్ జిల్లా జడ్జి జస్టిస్ నాగేశ్వరరావు, కృష్ణా జిల్లా ప్రిన్సిపల్ జిల్లా జడ్జి అరుణ సారిక, తెలంగాణ రిటైర్డ్ జ్యుడీషియల్ జడ్జి సుబ్రహ్మణ్యం, ముంబయి సినీ నటి కాదంబరీ జత్వానీ, దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు.

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ IDFC FIRST Bank
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్‌గా తెలిసినది, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమల్గామేట్ చేయబడినది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా తెలిసినది)
CIN : L65110TN2014PLC097792
రిజిస్టర్డ్ ఆఫీసు: కెఆర్ఎం టవర్స్, 8వ అంతస్తు, హ్యారింగ్టన్ రోడ్, చెట్‌పేట్, చెన్నై-600031.
Tel : +91 44 4564 4000 | Fax: +91 44 4564 4022

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద ప్రకటన

దిగువ రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలు **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్‌గా తెలిసినది, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమల్గామేట్ చేయబడినది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా తెలిసినది)** నుండి దిగువ పేర్కొన్న సెక్యూర్డ్ రుణాలను పొంది యున్నారు. దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతల రుణాలకు వారి సంబంధించిన ఆస్తుల తాకట్టు ద్వారా హామీగా చూపబడినవి. ఆ విధంగా వారు సంబంధిత రుణ ఒప్పందాల నియమ& నిబంధనలు పాటించుటలో ఇర్రెగులర్ అయినందున, వారి రుణాలు ఆర్‌బిఐ మార్గదర్శకాల ప్రకారం ఎన్‌పిఏగా వర్గీకరించబడినవి. **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్‌గా తెలిసినది, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమల్గామేట్ చేయబడినది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా తెలిసినది)**కి వారిచే బాకీయున్న మొత్తాలు దిగువ పట్టికలో మరింత స్పష్టంగా వివరించబడిన సదరు నోటీసుల ప్రకారం పేర్కొనబడినవి మరియు సదరు మొత్తాలను తదుపరి వడ్డీతో వర్తించబడును మరియు దానిని వారి సదరు తేదిల నుండి వర్తించు ఒప్పంద రేటు ప్రకారం చెల్లించవలెను.

క్ర. సం.	రుణ ఖాతా నెం.	రుణం రకం	రుణగ్రహీతలు మరియు సహ- రుణగ్రహీతలపేరు	సెక్షన్ 13(2) నోటీసు తేది	సెక్షన్ 13(2) నోటీసు ప్రకారం బాకీపడిన మొత్తం
1	75343535 & 112120081	ఆస్తి పై రుణం	1) చేకూరి గీత శ్రీ 2) చేకూరి లక్ష్మీ ప్రసన్న 3) అర్వ ఇంటీరియర్స్	06.08.2024	INR 42,30,129.96/-

ఆస్తి చిరునామా: నిడమనూర్ గ్రామం మరియు పంచాయతీ, గుణదలసబ్-రిజిస్ట్రీ, విజయవాడ, కృష్ణా, ఆంధ్రప్రదేశ్-521104 లోని ఆర్ఎస్‌నెం.156-ఏ, అసిస్ట్ నెం.652, డోర్‌నెం.4-104లోని 221చ.అ.ల ప్లింత్ ఏరియాతో ఏ.సి.సి.షెడ్, 607 చ.అ.ల ప్లింత్ ఏరియాతో అందులోని ఏ.ఆర్. సి.సి.బిల్డింగ్ తో పాటుగా సైటుయొక్క 242 చ.గ.లు (202.33 చ.మీ.ల) విస్తీర్ణపు **మొత్తం భాగం** మరియు, **సరిహద్దులుగా: తూర్పు:**నిడమనూరు నుండి పోరంకి రోడ్డు, **పడమర:** పరిమి నాగభూషణం ఆస్తి, **ఉత్తరం:** పరిమి రామతులసమ్మ ఆస్తి, **దక్షిణం:** వేములపల్లి కన్నయ్య ఆస్తి.

మిమ్మలను ఇందుమూలంగా కోరబడునది ఏమనగా, ఈ ప్రకటన తేది నుండి 60 రోజుల్లోగా వారి సంబంధిత తేదీల నుండి దానిపై ఒప్పంద రేటుతో వడ్డీ మరియు ఇతర ఖర్చులు, చార్జీలు మొ॥న వాటితో పై పట్టికలో చూపిన వివరాల ప్రకారం **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్‌గా తెలిసినది, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమల్గామేట్ చేయబడినది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్‌బ్యాంక్ లిమిటెడ్‌గా తెలిసినది)** వారికి బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా కోరబడుచున్నది, విఫలం చెందినచో, క్రింది సంతకందారు **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్‌గా తెలిసినది, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమల్గామేట్ చేయబడినది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా తెలిసినది)** వారికి బకాయి మొత్తాలను రాబట్టుటకు ఇందు పై పేర్కొన్న తాకట్టుపెట్టిన ఆస్తులపై, SARFAESI చట్టంలోని సెక్షన్ 13(4) మరియు సెక్షన్ 14 క్రింద ప్రొసీడింగ్ ప్రారంభించెదరు. తదుపరి మీరు, అమ్మకం/ లీజు లేదా ఇతర రూపాల ద్వారా గాని సదరుసెక్యూర్డ్ అసెట్‌ను బదిలీచేయుట నుండి సదరు చట్టంలోని సెక్షన్ 13(13) క్రింద మీరు నిషేధింపబడినారు.

సం/- అధీకృత అధికారి
ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
తేది: 07-10-2024
ప్రదేశం: విజయవాడ
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్‌గా తెలిసినది, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమల్గామేట్ చేయబడినది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా తెలిసినది)

22 నుంచి అమరావతి డ్రోన్ సమ్మిట్

- దేశ వ్యాప్తంగా వెయ్యి మంది ప్రతినిధులు
- అదేరోజు సాయంత్రం కృష్ణా తీరంలో డ్రోన్‌షో
- పెట్టుబడులశాఖ కార్యదర్శి సురేష్‌కుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి డ్రోన్ సమ్మిట్-2024 జాతీయ సదస్సును ఈ నెల 22, 23 తేదీల్లో మంగళగిరిలోని సికె కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించనున్నట్లు పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి ఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. విజయవాడలోని ఫైబర్‌నెట్ కార్యాలయంలో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని దేశానికే డ్రోన్ రాజధానిగా మార్చాలన్నది సిఎం ఆశయమని, దానికి అనుగుణంగా డ్రోన్ సమ్మిట్ ఉంటుందని తెలిపారు. 22వ తేదీ ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీన్ని ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, పెట్టుబడులశాఖ మంత్రి బిసి జనార్ధనరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. డ్రోన్ టెక్నాలజీలో ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న సాంకేతిక సదుపాయాలు దైనందిన జీవితంలో, పాలనలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి వాటిని ఎలా ఉపయోగించాలనే అంశంపై సదస్సు జరగనుందని తెలిపారు.

ఈ సదస్సులో డ్రోన్ అప్లికేషన్లకు సంబంధించి ఏమి చేయాలనే అంశంపై ఒక నివేదిక తయారు చేస్తామని, అలాగే వాటితో చిత్రీకరించే అంశాలను ఎలా ఎనలైజ్ చేయాలనే అంశంపైనా చర్చ జరగనుందని వివరించారు. వరదలు వచ్చినప్పుడు ఆ ప్రాంతంలో ఉన్న భౌగోళిక స్థితి, డ్రోన్లను ఎలా ఉపయోగించుకోవాలనే అంశంపైనా చర్చ ఉంటుందన్నారు. ముంబయి, మద్రాస్, తిరుపతి ఐఐటి వంటి ప్రతిష్టాత్మక సంస్థల భాగస్వామ్యంతో ఇలాంటి సమస్యలపై డ్రోన్ కార్పొరేషన్ ద్వారా అధ్యయనం చేసి ఒక పరిష్కారం కనుక్కుంటామని తెలిపారు. ఈ సమ్మిట్‌కు దాదాపు వెయ్యిమంది ప్రతినిధులు హాజరవుతున్నారని, 400 మంది డ్రోన్ రంగంలో అనుభవం ఉన్న సంస్థలకు సంబంధించిన ప్రతినిధులని పేర్కొన్నారు. డ్రోన్ సమ్మిట్ సందర్భంగా ఔత్సాహికుల కోసం హ్యాకథాన్ నిర్వహిస్తున్నామని ఎపి డ్రోన్ కార్పొరేషన్ ఎమ్‌డి దినేష్‌కుమార్ తెలిపారు. 15వ తేదీలోపు ఔత్సాహికులు ఇందులో నమోదు చేసుకోవచ్చన్నారు. 20వ తేదీలోపు విజేతలను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 2024 డ్రోన్‌షో సమ్మిట్ లోగో, డ్రోన్ హ్యాకథాన్‌కు సంబంధించి లోగోలు, సదస్సు ఆహ్వాన పత్రికలను అధికారులు విడుదల చేశారు.

5 వేల డ్రోన్లతో షో

సదస్సులో భాగంగా 22వ తేదీ సాయంత్రం కృష్ణానది తీరంలో భారీ ఎత్తున డ్రోన్‌షో నిర్వహించనున్నట్లు సురేష్‌కుమార్ తెలిపారు. ఇప్పటి వరకూ దాదాపు 2,500 డ్రోన్లతోనే ఇలాంటి ప్రదర్శన చేశారని, ఎపిలో అంతకు రెట్టింపు స్థాయిలో డ్రోన్‌షో నిర్వహించబోతున్నట్లు పేర్కొన్నారు. అందరూ తిలకించొచ్చని తెలిపారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda
గాంధీ చౌక్ బ్రాంచ్, తెనాలి,
డి.నెం.6-2-35, బండ్లమూడివారి వీధి, గంగానమ్మపేట, తెనాలి తాలూకా, గుంటూరు జిల్లా-522201
ఆం.ప్ర., ఫోన్ నెం.08644-227707/225567, ఇ-మెయిల్ : VJTENA@BANKOFBARODA.COM

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(1) ప్రకారం నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం-2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదివే సదరు యాక్ట్‌లో సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **బ్యాంక్ ఆఫ్ బరోడా, గాంధీ చౌక్ బ్రాంచ్, తెనాలి, గుంటూరు జిల్లా** అధీకృత అధికారి నోటీసులో దిగువ పేర్కొన్న బకాయి మొత్తములను మరియు సదరు మొత్తములపై దిగువ ఉదహరించిన తేదీల నుండి కాంట్రాక్చువల్ రేటు ప్రకారం వడ్డీ + ఇతర ఖర్చులు మరియు ఛార్జీలతో సహా సదరు నోటీసు అందిన తేదీనుండి 60 రోజులలోపు తిరిగి చెల్లించవలసినదిగా దిగువ పేర్కొన్న ఋణగ్రహీతలను మరియు వారి హామీదారులను కోరుతూ దిగువ ఉదహరించిన తేదీలలో డిమాండు నోటీసులను జారీచేసినారు.

ఋణగ్రహీతలు / హామీదారులు సదరు రుణాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనారు. ఋణగ్రహీతలకు / హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా సదరు రూల్స్‌లో రూల్ 8తో చదివే సదరు సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు బ్యాంకునకు తనఖా ఉంచిన దిగువ వివరించిన ఆస్తులను **ది.03-10-2024న** స్వాధీనం చేసుకున్నారు.

సాధారణ ప్రజానీకానికి ముఖ్యముగా ఋణగ్రహీతలకు / హామీదారులకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తులతో ఎవ్వరు ఎట్టి లావాదేవీలు జరుపరాదు. సదరు ఆస్తులకు సంబంధించిన ఎట్టి లావాదేవీలైనను క్రింద ఉదహరించిన మొత్తాలకు మరియు సదరు బకాయి మొత్తములపై ఈ దిగువ పేర్కొన్న తేదీల నుండి అంగీకరించిన రేటు ప్రకారం వడ్డీ + ఇతర ఖర్చులతో సహా **బ్యాంక్ ఆఫ్ బరోడా, గాంధీ చౌక్ బ్రాంచ్, తెనాలి, గుంటూరు జిల్లా** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

ఋణగ్రహీతలు/ హామీదారులు సెక్యూర్డు ఆస్తులు విడిపించుకొనుటకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13(8)లోని నిబంధనలు గమనించగలరు.

ఋణగ్రహీత(లు) / సహ-ఋణగ్రహీతలు మరియు హామీదారు(లు) పేర్లు మరియు చిరునామా

1) **ఋణగ్రహీత: శ్రీమతి ఆలూరి కల్పన,** డి.నెం.3-14-23, భవనం వారి వీధి, రజక పేట, తెనాలి-522201.
సహ-ఋణగ్రహీత: శ్రీ ఆలూరి సుబ్రహ్మణ్యం, డి.నెం.3-14-23, భవనం వారి వీధి, రజక పేట, తెనాలి-522201
బకాయి సొమ్ము : తేది.18.05.2024 నాటికి రూ.3,37,673.00/- (అక్షరాల మూడు లక్షల ముప్పై ఏడు వేల ఆరు వందల డెబ్భై మూడు రూపాయలు మాత్రమే) + వర్తించని వడ్డీ + విధించని వడ్డీ+ కాంపౌండ్ వడ్డీ మరియు ఇతర చార్జీలు, తదుపరి చెల్లింపులు ఏమైనా ఉన్నచో నోటీసు అందిన తేదీనుండి 60 రోజులలోపు తిరిగి చెల్లించవలెను.
డిమాండ్ నోటీసు తేది: 18.05.2024. **లాంఛనాత్మకంగా స్వాధీనం తీసుకున్న తేది: 03.10.2024.**
తనఖాలో ఉన్న ఆస్తి వివరములు: షెడ్యూల్-ఏ: గుంటూరు జిల్లా రిజిస్ట్రేషన్, తెనాలి సబ్ రిజిస్ట్రేషన్, తెనాలి పరిధిలో (మునిసిపాలిటీ/ మున్సిపల్ కార్పోరేషన్/గ్రామ పంచాయితీ) చినరావూరు ఏరియా, ఎస్.నెం.38/2ఎ, 38/2బి, 41/3బి, 42, 4/2, 43/3ఎ, 43/4, 44/5ఎ, 44/5బి, 44/6ఎ, 47/7ఎ2, 48/1, 48/2బిఎమ్, 48/2ఎ1, 49/1, 50/1ఎ, 50/2బి, 51, 52/1ఎ, 52/1బి, 52/2ఎ, 52/2బి, 53/1బి లో ఉన్న మొత్తం భూమి విస్తీర్ణం
షెడ్యూల్-బి: తెనాలి, చినరావూరు, వైఎస్సార్ జగనన్న నగర్, బ్లాక్ నెం.బి8, 3వ అంతస్థులో ఫ్లాట్ నెం.టి8, విస్తీర్ణం 365.00 చ॥అ॥ సర్వే నెం.47-4ఎ, 47-4బి1 వద్ద మొత్తం బ్లాక్ ఏరియా 319.61 చ॥గ॥లలోని 19.00 చ॥గ॥ల అవిభాజ్యపు వాటా భూమి 19.00 చ॥గ॥ శ్రీమతి ఆలూరి కల్పన గారి పేరిట కలదు. **బ్లాక్ నెం.బి8: తూర్పు:** 12M వెడల్పు రోడ్డు, **పడమర:** ఓపెన్ స్పేస్, **ఉత్తరం:** బ్లాక్ నెం.బి7, **దక్షిణం:** 9M వెడల్పు రోడ్డు. **మూడవ అంతస్థులోని ఫ్లాట్ నెం.టి8: తూర్పు:** 12M వెడల్పు రోడ్డు, **పడమర:** బ్లాక్ నెం.బి8 టి5, **ఉత్తరం:** బ్లాక్ నెం.బి7 టి7, **దక్షిణం:** 9M వెడల్పు రోడ్డు.

2) **ఋణగ్రహీత: శ్రీమతి పుల్లేటికుర్తి వరలక్ష్మి, భర్త: శ్రీ పుల్లేటికుర్తి పాండు రంగారావు,** డి.నెం.17-3-25, ఇస్లాంపేట, తెనాలి, ఆంధ్రప్రదేశ్-522201.
సహ-ఋణగ్రహీత: శ్రీ పుల్లేటికుర్తి పాండు రంగారావు, తండ్రి: శ్రీ వీరా చారి, డి.నెం.17-3-25, ఇస్లాంపేట, తెనాలి, ఆంధ్రప్రదేశ్-522201.
బకాయి సొమ్ము : తేది.18.05.2024 నాటికి రూ.3,36,794.00/- (అక్షరాల మూడు లక్షల ముప్పై ఆరు వేల ఏడు వందల తొంభై నాలుగు రూపాయలు మాత్రమే) + వర్తించని వడ్డీ + విధించని వడ్డీ+ కాంపౌండ్ వడ్డీ మరియు ఇతర చార్జీలు, తదుపరి చెల్లింపులు ఏమైనా ఉన్నచో నోటీసు అందిన తేదీనుండి 60 రోజులలోపు తిరిగి చెల్లించవలెను.
డిమాండ్ నోటీసు తేది: 18.05.2024. **లాంఛనాత్మకంగా స్వాధీనం తీసుకున్న తేది: 03.10.2024.**
తనఖాలో ఉన్న ఆస్తి వివరములు: షెడ్యూల్-ఏ: గుంటూరు జిల్లా రిజిస్ట్రేషన్, తెనాలి సబ్ రిజిస్ట్రేషన్, తెనాలి పరిధిలో (మునిసిపాలిటీ/ మున్సిపల్ కార్పోరేషన్/గ్రామ పంచాయితీ) చినరావూరు ఏరియా, ఎస్.నెం.38/2ఎ, 38/2బి, 41/3బి, 42, 4/2, 43/3ఎ, 43/4, 44/5ఎ, 44/5బి, 44/6ఎ, 47/7ఎ2, 48/1, 48/2బిఎమ్, 48/2ఎ1, 49/1, 50/1ఎ, 50/2బి, 51, 52/1ఎ, 52/1బి, 52/2ఎ, 52/2బి, 53/1బి లో ఉన్న మొత్తం భూమి విస్తీర్ణం
షెడ్యూల్-బి: తెనాలి, చినరావూరు, వైఎస్సార్ జగనన్న నగర్, బ్లాక్ నెం.బి9, 2వ అంతస్థులోని ఫ్లాట్ నెం.ఎస్6, విస్తీర్ణం 365.00 చ॥అ॥ సర్వే నెం.47-4ఎ, 47-4బి1 వద్ద మొత్తం బ్లాక్ ఏరియా 319.61 చ॥గ॥లలోని 19.00 చ॥గ॥ల అవిభాజ్యపు వాటా భూమి 19.00 చ॥గ॥ శ్రీమతి పుల్లేటికుర్తి వరలక్ష్మి గారి పేరిట కలదు. **బ్లాక్ నెం.బి9: తూర్పు:** 12M వెడల్పు రోడ్డు, **పడమర:** ఓపెన్ స్పేస్, **ఉత్తరం:** 12M వెడల్పు రోడ్డు, **దక్షిణం:** 12M వెడల్పు రోడ్డు. **సెకండ్ ఫ్లోర్‌లోని ఫ్లాట్ నెం.ఎస్6: తూర్పు:** బ్లాక్ నెం.బి9 ఎస్ఎఫ్ 7, **పడమర:** బ్లాక్ నెం.బి9 ఎస్ఎఫ్ 3, **ఉత్తరం:** 9M వెడల్పు రోడ్డు, **దక్షిణం:** బ్లాక్ నెం.బి9 ఎస్ఎఫ్

తేది: 03.10.2024, స్థలం: తెనాలి **సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా**

ప్రభుత్వ విద్యతోనే అందరికీ చదువు

- ఎపిటిఎఫ్ రాష్ట్ర మహాసభలో ప్రొఫెసర్ జగ్‌మోహన్ సింగ్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ప్రభుత్వ విద్యతోనే సామాన్యుడికి చదువు అందుబాటులోకి వస్తుందని భగత్‌సింగ్ మేనల్లుడు, ప్రొఫెసర్ జగ్‌మోహన్ సింగ్ తెలిపారు. విజయనగరంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్లో ఆదివారం ఎపిటిఎఫ్ రాష్ట్ర మహాసభ ప్రారంభమైంది. ఈ మహాసభకు జగ్‌మోహన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు సామాజికంగా సేవలందించాలని సూచించారు. దేశంలో, రాష్ట్రంలో విద్యారంగంలో సంస్కరణలు తిరోగమనం చెందుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సామాన్యుడికి విద్య అందాలంటే.. అది ప్రభుత్వ విద్య ద్వారానే సాధ్యమని, ఆ దిశగా ఉపాధ్యాయులు ఆలోచించాలని కోరారు. విజయనగరం ఎమ్మెల్యే పి.అథితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ.. నేడు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ తగ్గిపోవడం వల్ల పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులపై ఉందన్నారు. ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శివారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు చాలా వరకు ఆర్థిక బకాయిలు ఉన్నాయని, వాటిని సాధించుకోవడం కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ 80 వసంతాల లోగోను, సావనీర్‌ను అతిథులు ఆవిష్కరించారు. మహాసభలో ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షులు చౌదరి పురుషోత్తం నాయుడు, డివి రమణ, జాతీయ నాయకులు ప్రేమ్‌చంద్, కె.సుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

వేదికపైనే రాముడి పాత్రధారి మృతి

న్యూఢిల్లీ : శరన్నవరాత్రుల వేడుకల సందర్భంగా రాజధాని ఢిల్లీలోని ఒక ప్రాంతంలో 'రామలీల' ప్రదర్శిస్తుండగా వేదికపై విషాద ఘటన చోటు చేసుకుంది. షహదారా ప్రాంతంలోని విశ్వకర్మ నగర్‌లో శనివారం రాత్రి వేదికపై రామలీల ప్రదర్శిస్తుండగా రాముడి పాత్ర పోషిస్తున్న ఓ కళాకారుడు గుండెపోటుతో మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. రాముని పాత్ర పోషిస్తున్న నటుని పేరు సుశీల్ కౌశిక్ (45). ఆయన స్టేజ్ పై రాముని పాత్రలో డైలాగులు చెప్పడం వీడియోలో కనిపిస్తుంది.

ఆర్థిక లావాదేవీల వివాదమే కారణం

- తండ్రిపై కోపంతోనే బాలిక ఆస్పియా హత్య : ఎస్‌పి

ప్రజాశక్తి- పుంగనూరు

గత నెల 29న అదృశ్యమైన బాలిక అస్పియా అంజుమ్ (7) హత్య కేసులో నిందితులను గుర్తించామని చిత్తూరు జిల్లా ఎస్‌పి మణికంఠ చందోలు తెలిపారు. పుంగనూరు అర్బన్ సర్కిల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్‌తో కలిసి విలేకర్లతో ఆయన మాట్లాడారు. వడ్డీ వ్యాపారైన అస్పియా తండ్రి అజ్మతుల్లా వారింటికి వంద మీటర్ల దూరంలో ఉన్న ఓ మైనార్టీ కుటుంబానికి చెందిన హసీనా, ఆమె కుమార్తె రేష్మలకు ఇంటి నిర్మాణానికి రూ.3.50 లక్షలు అప్పుగా ఇచ్చారని తెలిపారు. తీసుకున్న నగదు గడువులోపు ఇవ్వకపోవడంతో అజ్మతుల్లా వారితో అసభ్యకరంగా మాట్లాడారని, దీంతో, వారు మనస్తాపం చెంది ఆయన కుటుంబంపై కక్ష పెంచుకున్నారని తెలిపారు. గత నెల 29న ఇంటిముందు పిల్లలతో ఆడుకుంటున్న అస్పియాను హసీనా చాక్లెట్ ఇచ్చి తన ఇంటికి తీసుకెళ్లినట్లు చెప్పారు. తన ఇంటికి వెళ్లిపోతానని ఆ బాలిక ఏడ్చినా పట్టించుకోలేదని తెలిపారు. ఆ బాలిక వెళ్లపోకుండా ఇంటి ముందు తన కుమార్తె రేష్మను, ఓ బాలుడిని కాపలా ఉంచినట్లు చెప్పారు. అస్పియా ఏడుస్తూనే ఉండడంతో ఆమె ముక్కు, నోరును హసీనా గట్టిగా అదిమిపట్టుకున్నట్లు తెలిపారు. దీంతో, శ్వాస ఆడక ఆ బాలిక మృతి చెందిందని చెప్పారు. మృతదేహాన్ని ఓ బాలుడి సహాయంతో ద్విచక్ర వాహనంపై హసీనా తీసుకెళ్లి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో పడేసినట్లు తెలిపారు. మూడు రోజుల తర్వాత మృతదేహం నీటిలో తేలిందని, అనుమానం వచ్చి హసీనాను అదుపులోకి తీసుకొని విచారించడంతో కేసు మిస్టరీ వీడిందని ఎస్‌పి చెప్పారు.

మీడియాకు అత్యుత్సాహం పనికి రాదు : కలెక్టర్

బాలిక అదృశ్యం కేసులో మీడియా అత్యుత్సాహం చూపి వక్రీకరించడం తగదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. వక్రీకరించి చూపించిన మీడియాపై ఎందుకు చర్యలు తీసుకోకూడదని ప్రశ్నించారు. మైనర్లపై అఘాయిత్యాల సంఘటనలను ప్రచురించేటప్పుడు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అత్యాచారం జరగలేదు : వైద్యాధికారి

బాలికపై అత్యాచారం జరగలేదని పోస్ట్‌మార్టం రిపోర్టులో వెల్లడైందని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యాధికారి మధుసూదనాచారి తెలిపారు. మతదేహం మూడు రోజులపాటు నీటిలో ఉండడంతో శరీరంలో మార్పు వచ్చి ఉబ్బిపోయిందని చెప్పారు. ఐదుగురు వైద్యుల బృందం సమక్షంలో వీడియో కెమెరాల మధ్య పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. శరీరంలో ఎక్కడా గాయాలూ లేవన్నారు. ల్యాబ్ నుంచి పూర్తి రిపోర్టు వచ్చిన అనంతరం మరిన్ని వివరాలు తెలుస్తాయని చెప్పారు.

AXIS BANK LIMITED
రిటైల్ లెండింగ్ & పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీసు / బ్రాంచి) : యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డోర్ నం. 30-22-79, శ్రీ టవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520 002

స్వాధీనతా ప్రకటన రూల్8(1) క్రింద (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారు **యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్** (గతంలో యుటిఐ బ్యాంక్ లిమిటెడ్‌గా పేరుగలది) దీని రిజిస్టర్డు ఆఫీసు: "త్రిషూల్" సమర్తేశ్వర్ టెంపుల్ ఎదురుగా, లా గార్డెన్ దగ్గర, ఎల్లిస్‌బ్రిడ్జి, అహ్మదాబాద్-380006 వద్ద మరియు మరో ప్రదేశంలో దీని బ్రాంచి ఆఫీసు: **రిటైల్ లెండింగ్ & పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీసు / బ్రాంచి) : యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డోర్ నం. 30-22-79, శ్రీ టవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520 002** వద్ద కలిగియుండి, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, **డిమాండ్ నోటీసు** జారీచేసి, సార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద రుణగ్రహీత / హామీదారులు / తాకట్టుదారులను ఆహ్వానింపబడుచున్నది.

క్ర సం.	దరఖాస్తుదారు / సహ-దరఖాస్తుదారు / హామీదారులు పేరు చిరునామా	బకాయి రూ.లలో	ఆఫర్‌చేసిన ఈక్విటేబుల్ తాకట్టుపెట్టిన ఆస్తి & స్వాధీనతా తేది
2.	**1. శ్రీ గుండు కోటేశ్వర రావు,** తండ్రి గుండు కనక మల్లేశ్వర రావు, ఫ్లాట్ నం.ఎస్ఎఫ్-2, ఇష్టా ఆర్కెడ్ అపార్టుమెంట్, శ్రీ దుర్గ ఎస్టేట్స్, గరికాపర్రు రోడ్, వార్డు నం.7, వుయ్యూరు, కృష్ణా జిల్లా, ఆం.ప్ర-521 165 **మరియు : శ్రీ గుండు కోటేశ్వర రావు (యజమాని),** కేరాఫ్ శ్రీ లక్ష్మి వేంకటేశ్వర టెక్స్‌టైల్స్, ఫ్లాట్ నం.ఎస్ఎఫ్-2, ఇష్టా ఆర్కెడ్ అపార్టుమెంట్, శ్రీ దుర్గ ఎస్టేట్స్, గరికాపర్రు రోడ్, వార్డు నం.7, వుయ్యూరు, కృష్ణా జిల్లా, ఆం.ప్ర-521165. **2. శ్రీమతి గుండు సునీత** భర్త గుండు కో టేశ్వర రావు, ఫ్లాట్ నం.ఎస్ఎఫ్-2, ఇష్టా ఆర్కెడ్ అపార్టుమెంట్, శ్రీ దుర్గ ఎస్టేట్స్, గరికాపర్రు రోడ్, వార్డు నం.7, వుయ్యూరు, కృష్ణా జిల్లా, ఆం.ప్ర-521 165 **డిమాండ్ నోటీసు తేది :** 21.06.2024. **రుణ ఖాతా నం. :** పిహెచ్ఆర్006906740249 & హెచ్‌టిఆర్006906851307.	**రూ. 23,32,526/-** (రూపాయలు ఇరువై మూడు లక్షల ముప్పై రెండు వేల ఐదు వందల ఇరువై ఆరు మాత్రమే)	1) **షెడ్యూలు-ఎ :** కృష్ణా జిల్లా, వుయ్యూరు సబ్-రిజిస్ట్రార్ పరిధుల్లో కృష్ణా జిల్లా, వుయ్యూరు మున్సిపల్ కార్పొరేషన్, వుయ్యూరు పరిధిల్లో ఆర్.ఎస్.నం.648, 649 & 993, డోర్ నం.7-497 దగ్గర, ఫ్లాట్ నం.137 విస్తీర్ణం 266.66చ.గ.లు, ఫ్లాట్ నం.134 విస్తీర్ణం 346.66చ.గ.లు, ఫ్లాట్ నం.135 విస్తీర్ణం 266.66చ.గ.లు, ఫ్లాట్ నం.136 విస్తీర్ణం 266.66చ.గ.లు మొత్తం విస్తీర్ణం 1146.64చ.గ.లు. తో ఆస్తి యొక్క మొత్తం భాగం. **సరిహద్దులు : తూర్పు:** ఫ్లాట్ నం.లు 148, 149 & 150 ఆస్తులు, **దక్షిణం:** 33అ.ల వెడల్పు రోడ్డు, **పడమర:** 33అ.ల వెడల్పు రోడ్డు, **ఉత్తరం:** ఫ్లాట్ నం.138 ఆస్తి. ఈ పై నాలుగు సరిహద్దుల మధ్య సైటు విస్తీర్ణం 1146.64చ.గ.లు లేదా 958.59చ.మీ.లకుగాను పై సైటునకు అన్ని ఈజిమెంట్ హక్కులతోపాటు 57.33చ.గ.లు లేదా 47.92చ.మీ.ల విస్తీర్ణంతో విడదీయలేని, సూచించజాలని 1/20వ ఉమ్మడి వాటాగల షెడ్యూలు ఆస్తి. **షెడ్యూలు-బి:** పై సదరు షెడ్యూలు-ఎ ఆస్తిలో "ఇష్టా అపార్టుమెంట్స్" పేరు & స్టైల్‌తో రెండవ అంతస్తులోని ఫ్లాట్ నం. ఎస్ఎఫ్-2 విస్తీర్ణం 57.33చ.గ.లతో విడదీయలేని& సూచించజాలని భాగం. **సరిహద్దులు : తూర్పు:** ఉమ్మడి కారిడార్, **దక్షిణం:** ఒపెన్ టు స్కై, **పడమర:** ఒపెన్ టు స్కై, **ఉత్తరం:** మెట్లు & ఒపెన్ టు స్కై, పై సరిహద్దుల్లో ఎ& బి షెడ్యూల్లులో అన్ని ఈజిమెంట్ హక్కులతోపాటు 910.0చ.అ.ల ప్లింత్ ఏరియా, 150చ.అ.ల ఉమ్మడి ఏరియా, 90చ.అ.ల కార్ పార్కింగ్‌తో మొత్తం 1150చ.అ.లు. **లాంఛనప్రాయ స్వాధీనతా తేది : 04.10.2024**
7.	**1. శ్రీ వెలిశెట్టి రామ కోటేశ్వర రావు,** తండ్రి వెలిశెట్టి వెంకటాద్రి, డోర్ నం.32-13-55, ఫ్లాట్ నం.జి4, జగదీష్ అపార్టుమెంట్స్, బోయపాటి మాధవ రావు వీధి, మొఘల్‌రాజపురం, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-520010 **మరియు: శ్రీ వెలిశెట్టి రామ కోటేశ్వర రావు,** తండ్రి తమ్మినేని నరసింహులు, ఫ్లాట్ నం.119, పి & టి న్యూ కాలనీ నం.2, రోడ్ నం.4, గురునానక్ రోడ్డు, విజయవాడ, కృష్ణ జిల్లా, ఆం.ప్ర.-520008 **మరియు శ్రీ వెలిశెట్టి రామ కోటేశ్వర రావు,** తండ్రి వెలిశెట్టి వెంకటాద్రి, ఫ్లాట్ నం.152, టీచర్స్ కాలనీ, వికాస్ కాలేజీ దగ్గర, నున్నా, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-521212. **మరియు : శ్రీ వెలిశెట్టి రామ కోటేశ్వర రావు,** కేరాఫ్ ఎస్.జి. ల్యాబ్ సొల్యూషన్స్, 54-16-151, 1వ అంతస్తు, వేంకటేశ్వర నగర్, లోయల కాలేజీ ఆడిటోరియం ఎదురుగా, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-520008. **2. శ్రీమతి వెలిశెట్టి సుహాసిని** భర్త వెలిశెట్టి రామ కోటేశ్వర రావు, డోర్ నం.32-13-55, ఫ్లాట్ నం.జి4, జగదీష్ అపార్టుమెంట్స్, బోయపాటి మాధవ రావు వీధి, మొఘల్‌రాజపురం, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-520010 **మరియు : శ్రీమతి వెలిశెట్టి సుహాసిని,** భర్త వెలిశెట్టి కోటేశ్వర రావు, ఫ్లాట్ నం.119, పి& టి న్యూ కాలనీ నం.2, రోడ్ నం.4, గురునానక్ రోడ్డు, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-520008 **డిమాండ్ నోటీసు తేది :** 21.06.2024. **రుణ ఖాతా నం.** పిహెచ్ఆర్006902310639, ఎల్‌టిఆర్006903304539 & ఇసిఆర్006906293496.	**రూ. 56,53,633/-** (రూపాయలు యాభై ఆరు లక్షల యాభై మూడు వేల ఆరు వందల ముప్పై మూడు మాత్రమే)	2) కృష్ణా జిల్లా, విజయవాడ రూరల్ విజయవాడ జిల్లా రిజిస్ట్రార్, నున్నా గ్రామం వద్దగల ఆర్ఎస్ నం.348, 351 & 352పి, ఎల్‌పి నం.385/81, మున్సిపల్ కొ-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ కాలనీ, ప్లాట్ నం.152తో ప్రతిపాదిత ఆర్‌సిసి రూఫ్ గ్రౌండ్ & 1వ అంతస్తు భవనముతో 300చ.గ.లు లేదా 250.83చ.మీ.ల విస్తీర్ణంతో నివాసిత సైటు. **సరిహద్దులు : తూర్పు:** ప్లాట్ నం.135, **దక్షిణం:** ప్లాట్ నం.153, **పడమర:** 33అ.ల వెడల్పు రోడ్డు, **ఉత్తరం:** ప్లాట్ నం.151. **లాంఛనప్రాయ స్వాధీనతా తేది : 04.10.2024**

తేది : 07.10.2024, ప్రదేశం : ఆం.ప్ర. **సం/- అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్**



"సమాజంలో అసహాయులుగా ఉన్న వారిలో చైతన్యమూ, బెదిరి ఉన్నవాళ్లకు ధైర్యమూ, వ్యక్తిత్వం కోల్పోయినవారికి వ్యక్తిత్వమూ ఇవ్వడం కన్నా రచయితకు తన రచనల ద్వారా చేయగల ఉత్తమమైన పని ఇంకేమైనా ఉందా?"
– కొడవటిగంటి కుటుంబరావు

తిరోగమనం

అతడు అపసవ్య దిశలో పయనిస్తున్నాడు
కళ్ళకు గంతలు కట్టుకొని
కబోదిలా పయనం సాగిస్తున్నాడు
సతిని సంకనేసుకొని
శ్మశానంలో నిట్టనిలువునా
కాల్చేద్దాం పదండని
కాలయముడవుతున్నాడు!

ఏం చేద్దాం, మనం?

కత్తికి కంకణం కట్టి
కామందు రాబందులా
కోడిపిల్లని తన్నుకుపోయే గద్దలా
మగువను మాతంగిని చేసి
మరలా మన రుణం తీర్చుకుందామంటావా!
క్షుద్రపూజల చేతబడి, చిల్లంగి, బాణామతిని నెత్తుకొని
అమాయకులను అంతం చేద్దామా!?

అతడు కాలాన్ని మరిచి వెనక్కి నడుస్తున్నాడు
ఏం చేద్దాం, మనం?
కన్న బిడ్డలను కన్నిరకానికి
అప్పజెప్పి కాలయముడి
కబంధ హస్తాలకు అప్పగిద్దామంటావా?
అతడు పాదాలు వెనక్కి తిప్పి
పిశాచిలా నడుస్తున్నాడు
ఏం చేద్దాం, మనం?

పాలుగారే పసిబిడ్డలకు పెళ్ళి పేరున
పాడెకట్టి బంగారు భవిష్యత్‌ను
చితి మంటల్లో దగ్ధం చేద్దామా?
కులాన్ని, మతాన్ని భుజాలకెత్తుకొని
మనుధర్మాన్ని ముందుంచుకొని
మరలా వెనక్కి నడుద్దామంటారా!
ఆకులు అలములు మొలలకు కట్టుకొని
దుంపలు, గడ్డలు తిని
మళ్లీ రాతి గుహల్లో జీవిద్దామంటావా?
నిప్పును ఉప్పును పాతరేసి
అజ్ఞాన అంధకారపు బంధురాల్లోకి
మళ్లీ వెనక్కి నడుద్దామంటావా?
యంత్రాలు పక్కనబెట్టి మంత్రాలను వల్లిస్తూ
బిళ్ళగోచితో మళ్లీ వెనక్కి వెనక్కి నడుద్దామంటావా?

– ఎజ్రాశాస్త్రి
80962 25974

పిడుగుల పరిశ్రమ

నడినెత్తిన పడిన పిడుగును
శ్రద్ధగా పీకి చేతుల్లో పట్టుకొని
అప్పుడాలోచించటం మొదలు పెడతాం
విషపు గాలుల కౌగిట్లో
ఆకాశం బందీ అయిన విషయం
అత్యంత శ్రద్ధగా అప్పుడే గుర్తొస్తుంది
ఇనప ముళ్ల మధ్య
శరీరాలు రక్తమోడుతున్న రహస్యం
నిట్టనిలువునా బట్టబయలవుతుంది
వ్యూహాత్మక దాడుల మధ్య
జ్ఞాపకాలు శిథిలమవుతున్న సంగతి
లోలోపల ఘనీభవిస్తూ ఉంటుంది

కమ్చీ దెబ్బల ధాటికి
ఊపిరితిత్తుల్లో గడ్డ కట్టిన గాలి
కరిగి కన్నీరవుతూ ఉంటుంది
బద్దలయ్యే ఉరుముల మధ్య
ఆగకుండా కురుస్తున్న దుఃఖంలో
ఆరకుండా తనువు తడుస్తూ ఉంటుంది

నిజానికి
పిడుగులు ప్రతిరోజూ పడుతుంటాయి
కాకపోతే శబ్దం మన చెవిని తాకదు
మన చందాలతోనే పరిశ్రమ ఏర్పాటు చేసి
పిడుగులు తయారు చేస్తున్న దృశ్యం
మన కళ్లల్లో ప్రతిఫలించదు
మెరుపుల మెలికల నడుమ
చందాదారులకిది పరీక్షా సమయం
తయారీదారులకు తాత్కాలిక ఉపశమనం!
ఫలితాల కోసం ఎదురుచూపు

– ఎమ్వీ రామిరెడ్డి

వేలాడే కత్తి

ఆ పురాతన పూనకం ఇప్పుడు లడ్డులోకి దూరి
రాజకీయ యాసం కట్టింది
మొద్దు నాలికను పాములా తాటిస్తూ
మైనారిటీ బతుకు భయాల మీద
కత్తి నూరుకుంటోంది!

లడ్డు అపవిత్రమయ్యిందని
భూమి బల్లపరువు చాప మీద
ప్రాయశ్చిత్త దీక్షలోకి దిగి
పరమ చెత్త నాటకాలతో
అందరి ముఖాలకు మసి పూసి
మత్తెక్కిన తాగుబోతు తలతో ఊగిపోతుంది

రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన పదవి
మెట్ల మీద దేకుతూ, సెల్ఫీలు దిగుతూ
ప్రజాస్వామ్య పీఠిక మీద పంగనామాలు పెట్టి
ఆరున్నర శృతిలో రాగం తీస్తోంది!
సమానత్వాన్ని ప్రకటించటం చాతకాని వాళ్ళు
మనుషుల మధ్య అసమానత్వమే సబబని
అరచేతి వేళ్ళను ప్రదర్శనకు పెడతారు
అన్నీ కలుషితమై బతుకు భయం పుట్టే చోట
విద్వేష భక్తిని అందరి రక్త నాళాల్లోకి
డ్రైనేజీ మురుగులా పారిస్తారు!

మానవత్వం అంతరించిపోనీ
బతుకుదారులు మూసుకుపోనీ
నిరుద్యోగ శవాలు గుట్టలుగా రాలిపడనీ
రోజుకొక్క మానభంగాల పతాక శీర్షికలెక్కనీ..

పురాతన చేష్టలతో సమైక్య భారతాన్ని
పుక్కిలించే ధర్మ పన్నాగం పడగ మీద సవారీ చేస్తూ
మనిషి మనిషికి మధ్య మతాల మందు పాతర్లు పేర్చి
వాళ్ళు రాష్ట్రాలు ఏలాలి
దేశం గద్దె మీద ద్వేషం పంట కోసుకోవాలి!

– నేలపూరి రత్నాజీ

'మొలక' చిగురింతలో మౌన విస్ఫోటాలు

పరిచయం

నడుస్తున్న వర్తమాన చరిత్ర కాలానికి ఓ ప్రతీక. దీనిని అక్షరబద్ధం చెయ్యడంలో నిలదీసి ప్రశ్నించే కంఠస్వరాలు అనేకం. అలాంటి ప్రక్రియల్లో కవిత్వానిది ఎప్పుడూ పైచెయ్యే. దీనికి ఓ సజీవ తార్కాణం వర్ధమాన కవయిత్రి భానుశ్రీ కొత్వాల్ రచించిన కవితాసంపుటి 'మొలక'. దీని వేళ్ళు చాలా లోతుగా, బలంగా, జీవన సారాన్ని ఆకళింపు చేసుకుని, సమస్యల మూలాల్ని ఎండగడుతూ నిరసన స్వరంతో ప్రతిఘటించడం మొదలు పెట్టాయి. 56 కవితలతో విభిన్న పార్శ్వాల్ని తడుముతూ చైతన్యపరచడంలో ప్రధాన భూమిక పోషించాయి.

"అస్థిపంజరానికి కప్పిన/ చిల్లుల దుప్పటి ఆమె/ కొన ఊపిరితో నడుస్తూ/ సీతాకోకచిలుకైంది" అంటారు 'జీవశిల' అనే కవితలో. పీడితవర్గ పక్షాన నిలబడి స్త్రీవాద దృక్పథంతో కళాత్మక సౌందర్య దృష్టితో పలికిన పలుకులివి. దుప్పటిపై పడిన చిల్లుల్ని సీతాకోకచిలుక రెక్కలపై మెరిసే అందమైన మచ్చలతో పోల్చి చెప్పి భావానుగుణమైన సామ్యాన్ని రూపుకట్టించారు కవయిత్రి. విటుడు కామనీడ ముసుగులో విసిరిన చిల్లరకాసుల ఆసరాతో బతుకుని వెళ్లదీస్తున్న ఓ అభాగ్య వేశ్య దుర్భర జీవితఘట్టానికి సజీవ దృశ్యరూపం ఈ కవిత.

'కాన్వాసు' అన్న కవితలో ఓ అంధురాలి అంతర్వేదనని బాధతో ఒడిసిపట్టి చిత్రిక పట్టడంలో భానుశ్రీ ప్రదర్శించిన నేర్పు ఆశ్చర్య చకితుల్ని చేస్తుంది.

"మనోనేత్రాన్ని/ వేలి కొనలపై అతికించి
మనసు కాన్వాసుపై/ రంగులన్నీ పరిచేసుకున్నా
ఇప్పుడు అందరికి రెండే కళ్ళు
నాకు/ పంచభూతాలతో కలిసి వేల కన్నులు"

అంటూ నిశ్శబ్ద విస్ఫోటనాన్ని రగిలించడం వెనుక బ్రెయిలీ లిపిలోని అక్షరాల తడుములాటని చిత్రీకరించడంలో కవయిత్రి కనబరిచిన ప్రతిభ కవిత ఎత్తుగడ రూపంలో ప్రతిబింబిస్తుంది.

ధ్వని ప్రధానంగా చెప్పే ఈ శిల్ప రహస్యాన్ని ఆకళింపు చేసుకోవడంలో తనదైన వినూత్న శైలి ఉట్టిపడేలా చేస్తుంది. మామూలుగా ఐతే మనిషికి రెండే కళ్ళు. కానీ అంతర్దృష్టితో అక్షరాల్ని తడిమి చూసి చదివే చేతులకి పంచభూతాల మమేక స్థితి స్పర్శ అంతర్లీన స్పృహను కలిగిస్తుంది. దీనికి వేల కన్నుల చూపుల దృష్టిని అదనంగా సారించాల్సి ఉంటుంది. ఈ ఏకాగ్రత ఒడుపును చాలా సమర్ధవంతంగా వ్యక్తీకరించి అక్షరీకరించారు భానుశ్రీ. ఈ కోణంలో కవిత్వీకరించిన ఆమె నిజంగా అభినందనీయురాలు.

"శరీర కొలతలతో/ ఆడతనాన్ని
గుణించే
వైకల్యపు వెకిలి చూపులను చూసి
ఇక వీళ్ళింతే
అని మాత్రం సర్ది చెప్పుకోలేక
శరీర సాగరాన్ని కప్పి పెట్టలేక
నాలో నేను నలిగిపోతున్నా"

అంటూ భావగర్భితమైన బాధాతప్త హృదయ వేదనతో 'నలుగుతున్న క్షణాలు' శీర్షికలో ఓచోట వాపోతారు కవయిత్రి. స్త్రీలోని శరీర సౌష్టవాన్ని, ఆడతనాన్ని అశ్లీల దృష్టితో చూసే వెకిలిరాయుళ్ళ వక్రదృష్టితో ఎండగడుతూ ఎద్దేవా చేసే ఒక బలహీనమైన లోకం పోకడను చాలా సహజంగా చిత్రీకరించారు భానుశ్రీ. అనుభవిస్తే కాని అర్థంకాని ఈ రంపపుకోతని పరోక్ష వేదనగా మలచడంలో ఆమె సఫలీకృతమయ్యారు.

"వలసెల్లిన నీ ఎంటే/ కష్టం తోడైందా
నువ్వే వస్తావో/ నిన్నే తెస్తారో
ఇదంతా చూస్తూ/ నరకాన్ని మోస్తూ
మేమెలా బతకాలిరా బిడ్డా"

అంటూ 'వలసెల్లిన కొడుకా' కవితలో కుటుంబ భారంతో కుమిలిపోతూ తల్లడిల్లిపోయే ఓ మాతృమూర్తి జీవన ఆర్తిని విషాదంతో, ఆర్ద్రతతో గుండె బరువెక్కేలా వాపోయే దీనస్థితిని కళ్ళకు కట్టించే ప్రయత్నం చేస్తారు కవయిత్రి. కరెన్సీ నోట్లకోసం జన్మనిచ్చిన నేలనీ, ఊరినీ, కన్నవాళ్ళనీ విడిచిపెట్టి పరాయి దేశాలకు వలసపోయే బిడ్డలపై కడుపుతీపిని, మమకారాన్ని చంపుకోలేని ఓ నిస్సహాయ స్థితిని దయనీయంగా పట్టి చూపడంలో కొత్వాల్ కృతకృత్యులయ్యారు.



"కరువులెన్ని కాటేసినా/ కన్నీటి వరదలు
ముంచెత్తినా
మహావృక్షాలు నేలకొరిగినా/ మట్టి వాసనతో
మనుషులందరిని కలిపే/ మట్టిబంధం మా
ఇంటి అరుగు"

అంటారు 'మాఇంటి అరుగు' శీర్షికలో. వెనకటి రోజుల్లో అందర్నీ ఓచోట ఉమ్మడిగా కలిపి కూర్చోబెట్టేది ఈ ఇంటి అరుగే. ప్రేమాప్యాయతల ముచ్చట్లు, కాలక్షేపకబుర్లు, పలక-బలపంతో అక్షరాలు దిద్దే క్షణాలు, వివాదాల కలబోతలు, వినోదాల సందడులు, విషాదాల నిట్టూర్పులు అన్నీ ఈ ఒడినీడలోనే. పల్లెసీమల్లో ఇవి సర్వసాధారణం. మనుషుల్ని మనసులతో ముడేసే ఒక ప్రేమబంధం. మట్టి మనుషుల అనుబంధం. దీనికి ఎల్లలు లేవు. ఇంటి అరుగంటే విడదీయరాని ఒక పేగుబంధమే. గతానికి వర్తమానానికి మధ్య విడదీయరాని వారధి. ఈ దృశ్యాలనే స్మృతులుగా నెమరేసుకుంటారు ఈమె. 'సిరియా' అన్న కవితలో దేశాల మధ్య సాగుతున్న ఆధిపత్య పోరు పర్యవసానాన్ని వ్యంగ్య స్పృహతో ఆవిష్కరిస్తారు.

"పసికందుల శరీర భాగాలూ
ఏరుకోలేని ప్రపంచ శాంతి
కళ్ళు తేలేస్తుంది
అగ్ర రాజ్యాలకేం తెలుసు/ ఆకలిమంటలు
శాంతి కపోతం రక్తం కక్కుతోంది"

అంటూ నినదించడం వెనుక తొంగి చూసే ఒక భయోత్పాతం, యుద్ధబీభత్సం, మృత్యుఘోష, శవ దృశ్యాలు, క్షతగాత్రుల ఆర్తనాదాలు, ఆకలిమంటలు ప్రపంచానికి కీడు చేసి, మనుషుల్ని పొట్టన పెట్టుకునేవే. లోకకల్యాణానికి కంకణం కట్టుకోవాల్సింది పోయి, ప్రపంచ వినాశనానికి రక్తపాతం రూపంలో విధ్వంసాన్ని రగిలించడం అగ్నికి ఆజ్యం పోసే విధంగా మారిపోతుంది. దీనికి బలిపశువైన సిరియా చరిత్రలో ఓ కొండగుర్తు.

ఇక కవిత్వ విషయానికొస్తే పాఠకుల్ని అలరించే వాచ్యం కాని కవితావాక్యాలు ఈ సంపుటిలో కోకొల్లలు. "చూపులన్నీ/ నాలోకి ప్రవహిస్తున్నాయి", "మానవత్వం మొలుస్తూనే ఉంది", "వెలసిన దేహచిత్రానికి", "మధుర జ్ఞాపకాల పొంగు", "వెచ్చని కౌగిళ్ళ జలతారు", "మా ఇంటి గుమ్మానికి/ జ్ఞానతోరణానివి", "చిరునవ్వు చినుకులను చల్లింది", "శ్రమ మూలాల్లో మొలిచిన సౌజన్యం", "భూమిని మొలక చీల్చినట్లు", "ఎక్కిళ్ళు రాని దుఃఖం", "నిండు గుండెల నేత్రాన్ని తడిపి", "మనసు చీకటిలో/ తెలిసీ తెలియనిదేదో మాయమవుతుంది", "కన్నుల్లో అనంత విశ్వం", "మాటల కిటికీలు తెరిచి", "కరగని కన్నీటి చెమ్మను/ కాటుక కన్నుల వెనుక దాచడమే తెలుసు", "నలుగుతున్న సజీవ శిలను", "చిల్లుల చీరకు వేసిన అతుకులు/ పేదరికమై వెక్కిరిస్తుంది", "పరిసరాలన్నీ భావ కాలుష్యమే", "మనస్సాక్షి ఎన్ని మౌనరాగాలు పాడినా", "కన్నీటి వేసవి మంటలకు/ తొలకరి చినుకును కమ్ముంటుంది", "మూఢత్వానికి ఉరి వేసిందాకా", "విప్లవ పూలన్నీ అగ్గిరాజేసి", "శూన్య లోకాల్లో తచ్చాడుతుంది", "కోటి గొంతుకలై దీవిస్తుండగా", 'దేహమంతా కన్నీరు కారుస్తుంది", "విసిరేసిన మర్రి విత్తనాలకు/ కాసిన విప్లవాలెన్నో", "శిఖరాల శిరస్సును ముద్దాడి", "నిన్నటి నీకై వెతికే చూపులు", "ఆ గోడలకెన్ని కళ్ళో", "నిజమెప్పుడు నిప్పే/ దాచావో బూడిద చేస్తుంది", "ఎంత కన్నీటిని ఒడిసిపట్టాయో", "కని పెంచిన కలలన్నీ/ కన్నీరుతో కారిపోయి", 'వెన్నెల సెలయేరు', 'కాలుష్యం లేని ప్రాణవాయువు', 'నిత్య ఎద సందళ్ళను', 'నీ జాడను/ నాలోనే వెతుకుతుంది', 'నా మనసు పూలతోటే అయింది', 'భుజాలపై వాలిన కండువాలు/ పూటకో రంగు మారాయి', 'నా కోసం నడిచొస్తే/పారే నదికి దారిస్తా', 'చిందులు నన్ను వదలని జ్ఞాపకాల ఖవ్వాలీలు', 'నాకేసి చూసే ముద్దబంతుల కళ్ళలో', 'స్వేద బిందువుల చరిత్ర', 'కరుణలేని కఠిన మనస్సులు', 'కన్నీటి సుడిగుండాలను/ మనసు లోతుల్లో వెతికి', 'తడిమి నిలదీసే స్నేహాక్షరం', 'ఎక్కడో ఓ హాయినిచ్చే స్పర్శ', 'లేత మస్తిష్కాల మేధోమథన శాల', 'మట్టి సుగంధాల్లో/ వికసించే శైశవం', 'వ్యధాభరిత క్షణాలను మోస్తున్నా', 'ఉదయించే/ ఎర్రని కాంతిరేఖల బాణాలతో' వంటి వాక్యాలు మనసుని ఆహ్లాదపరిచి ఉద్వేగభరిత సందర్భాలకు ఆహ్వానం పలుకుతాయి. మృగారణ్యం, నడక దృశ్యం, చుక్కల పందిరి, ఆలోచించే అడుగులు, జీవశిల, కాలిపోతున్న మానవత్వం లాంటి వైవిధ్యమైన కవితాశీర్షికలు ఆలోచింపచేస్తాయి. వర్తమాన కోణాలను స్పృశించి తూర్పారబట్టడంలో కవయిత్రి భానుశ్రీ కొత్వాల్‌ది ప్రత్యేకముద్ర కనిపిస్తుంది. ఈ స్ఫూర్తిని అందిపుచ్చుకుంటూ మరిన్ని విలక్షణ కవితాసంపుటాలతో ఆమె మరింతగా ఎదగాలని ఆశిస్తూ అభినందిద్దాం.

– మానాపురం రాజా చంద్రశేఖర్
77940 39813

అస్తవ్యస్తతపై అక్షర క్షిపణుల పరంపర

పుస్తకం

జరిగిందో, జరుగుతున్నదో కాలాన్ని వాస్తవికంగా చిత్రించేది కవిత్వం. ఊహాపేహల కవితలు, పొద్దుపుచ్చే పద్యాలు అంత పరపతి గలవేమీ కాదు. బాధితుల పక్షంగా బలంగా నిలబడ్డ కవిత్వం ఊరేగించదగింది. మోస్తోన్న కన్నీటికి కారకుల్ని గుర్తించీ, వాళ్లను సామాజికబోనులో నిలబెట్టగల ధైర్యం ఎపుడూ కవులకు కావాలి. పిరికి కలాలు వినీ వినబడనట్టు గొణుగుతాయి. బెబ్బులి గొంతుకలు పచ్చి నిజాలను గాండ్రిస్తాయి. మనుషుల్ని వెలిపెట్టి, ఊరికి ఆవలకు నెట్టి దుఃఖపెట్టే దోషులు దొరలైనా ఎండగట్టాలి. వాళ్ల దురాచారాలకు కుండగొట్టాలి. ఇవన్నీ తెలియాలంటే 'పడమటీది నాటకం' వినడానికి సిద్ధపడండి.

"అవిటిచేతులతోనే/ మట్టిని పిసుకుతున్నోళ్లం/ వాకిలి లేని గుడిసెల్లోనే/ మసలుతున్నోళ్లం/ బొడ్డుతాడు రాలిపడ్డది మొదలు/ కన్నీటికుండలను/ మెడకు ముంతగానో/ ముడ్డికి తాటాకులానో/ మోసుకుంటునోళ్లం/ మీకే కాదు ఈ మట్టికి కూడా/ మేమంటే ఎరుసే/ విరిసే పూలకే కాదు/ పుట్టే నలుసుకు కూడా/ వర్ణాలంటకట్టడం ఈ మట్టికలవాటే/ ఇక మా కన్నీటి గునపాలతో/ ఆ మట్టిగుండెల్లోనే/ పాతాళం దాకా సమాధులు తవ్వి/ అన్నింటికంటే ముందుగా కులంకళేబరాన్ని పాతేయ్యాలి/ పుణ్యదేశపునేల సరిపోతుందో లేదో మరి!?"

మిరప మహేష్ మరుగుతోన్న సిరా. చల్లబడిన గొంతు కాదు. నలుదిక్కులకు సామాజిక వాస్తవాలను దండోరా వేసే గొంతుక. అతడి కవితలు నిప్పులా మండుతాయి. తప్పులు జేస్తోన్న జనానికి కాకలై అంటుతాయి. మూలాల్లోంచీ పదునుగా వ్యక్తీకరించబడ్డాడు. కాస్త వాడమనుషుల భాషను కవిత్వానికి ఎక్కించాడు. మిరపమహేష్ ది వాడకట్టు పదహారం. మాపిటి, యాలగడిసి, అల్లిపోవడం, ఒబ్బిడిగా, ఎరుసు, పుంజీల్ల కొద్దీ వంటి మాటలతో తనదైన బతుకుపదాలను మేళవించాడు. అస్తిత్వం, ఆత్మగౌరవాలను ప్రస్ఫుటంగా ప్రకటించాడు. ప్రతిఘటన చేతనాన్ని విప్లవ పంథాగానూ ఆకాంక్షించాడు. తిరగబడ్డమే ప్రగతిఫలాలకు తోవంటున్నాడు. పోరాటమే శరణంటున్నాడు.

"నీ ఒక్కడితో మొదలై / వందలు వేలు లక్షలుగా/ తెగిపడుతున్న పిడికిళ్లన్నీ/ ప్రతీకార పుంతల్లో/ గడ్డకట్టని రక్తనదులై/ పచ్చిపచ్చిగా పోటెత్తుతున్నాయి/ ఎరుపెక్కిన దారులనిండా/ ఎడతెగని నీ కాలిగుర్తులు/ వెనకొచ్చే సమూహాలకీ/ పోరుచుక్కై దారిచూపుతాయి/ చీకటున్నా కళ్లు మూసుకోని/ మిణుగురుల్లా/ యుద్ధం ప్రకటించడమే ఇప్పటి కర్తవ్యం".

సమకాలీనతను మిరప మహేష్ బాగా పట్టించుకున్నాడు. కుల వివక్ష వరకే ఆవేదన చెంది, ఆగిపోలేదు. తన జాతిని ఎలా డమ్మీలుగా చేస్తున్నారో నిలదీస్తున్నాడు. రాజకీయపు



స్వరంగానూ గట్టిగానే వినబడుతున్నాడు. "ఇంతకీ మేమరమంటే/ మనువు ఛీకొట్టిన చిట్టచివరి చెండాలులం/ ఆ మనువారసులు తరాలుగా/ తొక్కిపట్టిన శూద్రులం/ దోపిడీ వర్గాలు వాడుకునే మాలమాదిగలం/ నామినేషన్ మాది/ డామినేషన్ వారిది/ రిజర్వేషన్ కోటా మాది/ ప్రసారం మాది ప్రసంగం వారిది/ ఓటు మాది నోటు నాటు వారిది/ గెలుపుపేరు మాది/ పదవీ పెత్తనం వారిది"

స్వాతంత్ర్యం వచ్చి,డెబ్బై ఏళ్ల దాటినా, అంటరానివారిగా, శూద్రులుగా, చెండాలురుగా వున్నామనీ వాపోయాడు. వార్డుమెంబరు, సర్పంచీ వంటి పదవులను కంటితుడుపుగా ఇచ్చీ,పెత్తనాన్ని బలిసినోళ్లే అనుభవిస్తున్నారనీ నిజాన్ని నినదించాడు. అందుకే దళితులు, బహుజనులు డమ్మీలు కాక డైనమైట్లుగా మారమంటున్నాడు. రాజ్యాపాలనకోసం రొమ్మువిరిచి నిలబడమంటున్నాడు. అలాగే "డోర్ డెలివరీ" లాంటి కవితల్లో దళితులపై దాడులను, హత్యాకాండలను ఖండించాడు. స్వజాతి నాయకులు హత్యాకాండలు జరిపేవాళ్ల మోచేతినీళ్లు తాగడాన్నీ, విసిరేసిన ఎంగిలి మెతుకులు తినడాన్నీ ఎద్దేవా జేసాడు. ఆత్మగౌరవాన్ని చంపుకునే దళితనాయకుల దిగజారుడుతనాన్ని ఈసడించుకున్నాడు.ఇంకా మణిపూర్లో స్త్రీలను నగ్నంగా నడివీథులలో ఊరేగించడాన్ని సహించలేక 'అగ్గివాన' అక్షరాల్ని కురిపించాడు. "ఇప్పుడు బోసిమొలల చిత్రపటమే/ మువ్వన్నెలజెండాగా మారి/ రాజ్యాంగంపై నమ్మకంతో/ తడితడిగా తలవంచుకుని ఎగురుతోంది" అని రాజ్యాంగాన్ని భరోసాగా గుర్తుజేస్తున్నాడు.

మానవ సంబంధాలను కొడవలి కొసగా వర్ణించాడు. దళితమాతల కష్టాల కన్నీటి బతుకుల్ని పదాలలో బొమ్మ కట్టించాడు. అయితే మిరప మహేష్ అక్షరాలు వాడకే పరిమితం కాదు. వస్తువుకి విస్తృతిని అద్దాడు. కలానికి విశ్వాన్ని అంటుగట్టాడు. దీనజగతికి విశ్వాసాన్ని రేపాడు. మిరప కవిత్వంలో మిరపకాయతనం వుంది. ఘాటైన అక్షరాలు వున్నాయి. అది ధర్మాగ్రహమైన ఘాటే. అలాగే కళాత్మకతలో మంచి ప్రయత్నమూ వుంది. ఆలంకారిక శాస్త్రాన్ని వర్ణాలమధ్య నిపుణంగానే అద్దగలిగాడు. తన రెండవ అడుగులో మెరుగుదనం ప్రతిఫలించింది. గుర్తుండిపోయే పంక్తులెన్నో తనదైనవి రాసాడు. ఎటు నిలవడాలో అటు నిలిచాడు. అతడి కళాత్మక పాదాలను కొన్ని పరిశీలించండి.

1. సెమటతో తడిచి పొరలుపొరలుగా/ తెల్లని ఉప్పుసారలు పట్టిన అమ్మ/ ఇప్పుడు ఓ సజీవ బతుకుమడి.

2. "పనడు గడ్డిపరకలు/అరతూముడు కుడితినీళ్లకోసం/ ఒళ్లు చీరి తట్లు తేలేలా/కొల్లాకర్ర దెబ్బలు తింటూ/సాల్లు తప్పక/ నాగలికాడె మోస్తోన్న/జోడెద్దులను చూస్తుంటే/ పొద్దుటే సిలువ శ్రమయాత్ర/ కళ్లముందు కదలాడింది"

3. "జైళ్లలా ఇళ్లన్నీ విశాలమే/ మనుషులే బాగా ఇరుకు/కరకు మాటలు/కంట్లో నలుసులై/ మెరుగుతున్నంతకాలం/ ప్రాణాలు ఒంటరైపోతున్నాయి"

మిరప మహేష్ దళిత జీవిత కవిత్వంలో శ్రమతనాన్నీ, వెట్టినీ రాయడంతో పాటు, అనేకసార్లు "రాజకీయం మాకు తగదా"? అనే ప్రశ్నల్ని సంధించాడు. చాలా కవితల్లో సూటిగా మాట్లాడ్డం మహేష్ ప్రత్యేకత. వ్యంగ్యంగానూ కొన్ని ముగింపుల్ని కళశోభగా తీర్చిదిద్దాడు. అయితే మెటాఫర్ల మోజు అవసరం లేదనిపించింది. అలంకారాలో, భావచిత్రాలో రాస్తేనే కవిత్వమనే వాదం వుంది. అది అపవాదన కూడా. గుల్జార్ లాంటి కవులలో సరళమైన అభివ్యక్తితో పాఠకుల్ని సంపాదించుకునే గుణం వుంది గదా. కళాత్మకత శిల్పాన్ని కుదుర్చుకోవడంలోనే చాలావరకు దాగుంది. దళిత కవిత్వంలో పురాణప్రతీకలు, సౌందర్యాత్మకత, ధ్వని మెండుగా వుండాలి. సూటిదనపు వచనానికి కొన్ని ఎదురుదాడుతుంటాయి. ఈ మిరప మహేష్ కవిత్వం దరిదాపు ఫలవంతమైన కవిత్వం. సామాజిక స్వరాన్ని నిజాయితీగా, నిబద్ధంగా రాసాడు. ప్రశ్నించడం, నిశితంగా వర్తమానాన్ని పరిశీలించడం, తర్కించడం వంటి సల్లక్షణాలు మెండుగా వున్న ఈ కవికి అభినందనలు.

– మెట్టా నాగేశ్వరరావు
99510 85760



విరమణ చిహ్నం

నవ్వు మరిచిన నేల చుట్టూ
మట్టి గాయాల పొగ
మనిషి నెత్తుటి పొగ
బూడిదైన బతుకుల మధ్య
గుర్తుపట్టగల గురుతుల కోసం
గుండె తెంపుకొని ఏడుస్తూ
దినదిన గండంగా దిగులు దినచర్య

కమురుకంపు నేల కసుపు తుడవడానికి
చావు ముఖం మీద ఉమ్మేసి
నిప్పుల చీపురు పట్టుకొస్తుంది ఓ నాని
ఇక 'వీడు ఉన్నా లేకున్నా ఒకటే'నని
ఆకాశం వాకిలి నుంచి పిరికి సూర్యున్ని
తుడిచి పారేస్తుంది

పుట్టినప్పటికంటే బరువు తగ్గిపోయిన
నెత్తుటి గడ్డల్ని భుజాల మీదికెత్తి
ఏ క్షిపణులూ గురి చూడలేని సందుల కోసం
నడిచే శవాలు కొన్ని గాలిస్తుంటాయి
ఒకే ఏడాదిలో ఊపిరొదిలిన వేల కళేబరాలన్నీ
సమాధుల కింద చేతులు పట్టుకొని
నేల కంపించేలా పిచ్చిగా నవ్వుతుంటాయి

కార్టన్ పెట్టెల్లో దాచిన గాజుబొమ్మల్లా
తెల్లబట్టల్లో చుట్టిన ఊపిరి లేని పూలను
ఆలివ్ చెట్లకింద పోగేసి పూడుస్తుంటే
గుప్పుమంటుంది గన్ పౌడర్!
ఎర్ర భాస్వరం రగిలి అగ్గిపుల్ల బుసకొట్టినట్టు
లేని ప్రాణం లేచి ఆయుధాల మీదికి
కత్తులు చిమ్ముతుంది

కటిక శ్మశానం లాంటి ఇరుకు నేలలో
ముక్కు పచ్చలారని కలల్ని
ఖననం చేసుకుంటున్న వాళ్ళను
కారాగారం లాంటి స్వరం హెచ్చరిస్తుంది
'చావు మీకు వారసత్వ ఆస్తి!'
కటకటపడే ఎగశ్వాసలు బదులిస్తాయి
'మా నేలా గాలి మాదే, ఎప్పటికైనా..'
అకస్మాత్తుగా బద్దలౌతుండే ఆకాశం నుంచి
నిరంతరాయంగా కురుస్తుంది మృత్యువు

ఏ సీతాకోక ఎక్కడ రెక్కలాడిస్తే
ఈ యుద్ధ భూమిని నోట కరుచుకొని
ఒక తెల్ల పావురం పైకి లేస్తుందో..?
ఖోస్ థియరీ నిరూపించడానికి
ఏ చిన్న తెప్ప ఈ తీరానికొస్తే
అనంత దుఃఖసాగరం అలల సైన్యంతో
వెనక్కి మళ్ళుతుందో..?
ఇప్పటికైనా.. నీ వంతుగా
అటువైపుగా చిన్న తెడ్డువేయలేవా..?

– కంచరాన భుజంగరావు
94415 89602

దీపావళి కవితల పోటీ

శేషం లక్ష్మీ నరసింహాచార్యులు సార్మకార్థం వారి కుటుంబ సభ్యుల సౌజన్యంతో తెలుగు సాహితీ వనం దీపావళి కవితల పోటీ నిర్వహిస్తోంది. నలుగురు విజేతలకు ఒక్కొక్కరికి రూ.1,116 చొప్పున నగదు బహుమానం, సన్మానం ఉంటుంది. ఏదైనా సామాజిక అంశం పైన 25 పంక్తులు దాటని కవితను మెయిల్ చేయాలి. బహుమతి ప్రదానం కరీంనగర్‌లో జరిగే 'వైజయంతి' పుస్తక ఆవిష్కరణ సభలో ఉంటుంది. విజేతలు తప్పనిసరిగా కరీంనగర్ వచ్చి బహుమతిని అందుకోవాలి. కవితలు పంపటానికి చివరి తేదీ : 31.10.2024.
Email:sahitivanam82@gmail.com
సంప్రదింపులకు : 94908 05404

8న 'సుప్రభాత భావనలు' ఆవిష్కరణ

పొత్తూరి సుబ్బారావు రచించిన 'సుప్రభాత భావనలు' వ్యాస సంపుటి అక్టోబర్ 8వ తేదీ సాయంత్రం శ్రీ త్యాగరాయ గానసభ కళాసుబ్బారావు కళావేదికపై ఆవిష్కరణ జరుగుతుంది. తెలంగాణ రాష్ట్ర పూర్వ సలహాదారులు డా॥కె.వి.రమణాచారి ఆవిష్కరిస్తారు. ఈ పుస్తకాన్ని పెద్దూరి వెంకటదాసుకు అంకితం కావిస్తారు. రమణ వెలమకన్ని, వి.ఎస్.జనార్ధనమూర్తి, బైస దేవదాసు, డా॥వై.రామకృష్ణారావు పాల్గొంటారు. ఈ సందర్భంగా 'విజయీభవ' అనే అంశంపై డా॥ పి. లలితవాణి అధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహిస్తారు.

సోమేపల్లి చిన్న కథల పోటీ ఫలితాలు

రమ్యభారతి పత్రిక, సోమేపల్లి వెంకట సుబ్బయ్య గారి కుటుంబం సంయుక్తాధ్వర్యంలో – నిర్వహించిన కథల పోటీ ఫలితాలు ప్రకటిస్తున్నాం, ఈ పోటీలలో సోమేపల్లి సాహితీ పురస్కారాలు పొందిన విజేతల వివరాలు : వెంకు సనాతని, బాపట్ల (డొక్కుబండి) ప్రథమ బహుమతి; పి.వి.ఆర్.శివకుమార్, ముంబై (లంచ్ బాక్స్) ద్వితీయ బహుమతి; బి.కళాగోపాల్, నిజామాబాద్ (ఖల్లి వెల్లి) తృతీయ బహుమతి పొందారు. మయూఖ (బోడుప్పల్), శింగరాజు శ్రీనివాసరావు (ఒంగోలు) ప్రత్యేక బహుమతులు పొందారు. త్వరలో గుంటూరులో జరిగే ప్రత్యేక సభలో బహుమతి ప్రదానం ఉంటుంది. ఈ కథల పోటీకి ప్రఖ్యాత కథకులు విహారి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.

– వశిష్ట సోమేపల్లి, చలపాక ప్రకాష్

నేడు జాషువా స్మారక ఉపన్యాసం

హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో 7.10.2024 సోమవారం సాయంత్రం 5.30 గంటలకు అంబేద్కర్ ఆడిటోరియంలో అంబేద్కర్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మహాకవి గుర్రం జాషువా స్మారకోపన్యాసం ఉంటుంది. ఈ డా. కోయి కోటేశ్వరరావు, డా. సుదర్శన్ బాలబోయిన ప్రసంగిస్తారు. సాహిత్య ప్రియులకు, విద్యార్థులకు ఆహ్వానం.

గుజరాత్‌లో కొనసాగుతున్న బుల్డోజర్‌రాజ్

- కోర్టు ఆదేశాలను ధిక్కరించి కూల్చివేతలు
- మసీదులు, ప్రార్థనా మందిరాలే లక్ష్యం
- మైనార్టీల ఆవాసాలూ నేలమట్టం

న్యూఢిల్లీ : గుజరాత్‌లోని బిజెపి ప్రభుత్వం తన విధ్వంసకర పాలన కొనసాగిస్తోంది. అక్రమ నిర్మాణాలుగా ముద్ర వేసి మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని సాగిస్తున్న కూల్చివేతలను తక్షణమే నిలిపివేయాలని, బుల్డోజర్‌రాజ్‌కు చరమగీతం పాడాలంటూ ఇటీవల దేశ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను కూడా కాషాయ పార్టీ లెక్క చేయడం లేదు. ముస్లిం ప్రార్థనా మందిరాలను ధ్వంసం చేస్తోంది. అనేక జనావాసాలను కూడా నేలమట్టం చేస్తోంది. గిర్ సోమనాథ్ జిల్లాలోని వెరావల్ ప్రాంతంలో గత నెల 28న పిర్ షా సిలార్ దర్గాతో పాటు మరో 8 మత కట్టడాలను అధికారులు కూల్చివేశారు. ఇవన్నీ ముస్లింలకు చెందినవే. ఆ ప్రాంతంలో ముస్లింలు నివసిస్తున్న 37 ఇళ్లను కూడా నామరూపాలు లేకుండా చేశారు. కేవలం ఆరు గంటల వ్యవధిలోనే అవన్నీ గత జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి.

అన్యాయాన్ని ప్రశ్నిస్తే నిర్బంధం..

వెరావల్‌లోని పిర్ షా సిలార్ దర్గా ఈ నాటికి కాదు. ఈ పురాతన మందిరంలో అబ్దుల్ హమీద్ (51) ముత్తాత, తాత, తండ్రి ప్రార్థనలు చేసే వారు. ఈ దర్గాకు హమీద్ 11వ తరం భక్తుడు. దానిని తన కళ్ల ఎదుటే కూల్చివేస్తుంటే కన్నీటిని ఆపుకునేందుకు హమీద్ విఫల యత్నం చేశారు. ఇళ్ల కూల్చివేత కారణంగా 200 మంది స్థానికులు నిరాశ్రయులయ్యారని హమీద్ ఆవేదనతో చెప్పారు. ఓ వైపు కూల్చివేతలు కొనసాగుతుండగానే ఈ అన్యాయాన్ని ప్రశ్నించిన 150 మందిని పోలీసులు అదుపులోకి తీసుకొని నిర్బంధించారని హమీద్ తెలిపారు.

మోడీ నేతృత్వంలోని ట్రస్ట్ కోసం...

కూల్చివేతలకు జిల్లా మెజిస్ట్రేట్, కలెక్టర్ డిడి జడేజా ఆదేశాలు జారీ చేశారు. వెరావల్ ప్రాంతంలోని 100 ఎకరాల భూమిపై తమకు హక్కులు ఉన్నాయని శ్రీ సోమనాథ్ ట్రస్ట్, రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకుంటున్నాయి. మత ధార్మిక సంస్థ అయిన ఈ ట్రస్ట్‌కు సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వం వహిస్తున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బిజెపి సీనియర్ నేత ఎల్‌కె అద్వానీ దీనిలో ట్రస్టీలు.

భయపెట్టి భూమి ఖాళీ చేయించేందుకే...

ప్రభాస్ పటాన్ ప్రాంతంలో అనేక చారిత్రక మసీదులు ఉన్నాయి. హాజీ మంగ్రోల్ షా దర్గా, షా సిలార్ దర్గా, గరీబ్ షా దర్గా, జాఫర్ ముజఫర్ దర్గా...వీటన్నిటినీ బుల్డోజర్లతో నేలమట్టం చేశారు. 1924 నాటి జునాగఢ్ రాష్ట్ర రెవెన్యూ రికార్డులలో హాజీ మంగ్రోల్ షా దర్గా పేరు ఉంది. ముస్లింలను భయపెట్టి వెరావల్ నుండి వారిని ఖాళీ చేయించేందుకే కూల్చివేతలు చేపట్టారని పిసిసి ఉపాధ్యక్షులు, అదే ప్రాంతానికి చెందిన నస్రత్ పంజా అన్నారు. కూల్చివేసిన నిర్మాణాలు పురాతనమైనవి, చారిత్రకమైనవి అని ఆయన తెలిపారు. 'ఘన చరిత్ర కలిగిన ఇస్లామిక్ నిర్మాణాలను ఇళ్లతో పాటే ధ్వంసం చేశారు. ఈ మసీదులు 800 సంవత్సరాల నాటివి. వీటికి చట్టబద్ధమైన పత్రాలు కూడా ఉన్నాయి. అలాంటప్పుడు కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వం వీటిని ఎందుకు కూల్చివేసింది?' అని ఆయన ప్రశ్నించారు.

ఆటవిక చర్య

హైడ్రాలిక్ క్రేన్లు, కనీసం 60 ఎక్స్‌కవేటర్లు, 50 ట్రాక్టర్ ట్రైలర్లు, ఐదు డంపర్లు, 1400 మంది పోలీసుల సాయంతో కూల్చివేతలను పూర్తి చేశారు. ఇది కేవలం రాజకీయపరమైన చర్య అని, ఆటవికమైనదని సామాజిక కార్యకర్త జబీర్ గోయల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సూరత్‌లో కొద్ది రోజుల క్రితం ఇలాంటిదే జరిగిందని ఆయన గుర్తు చేశారు.

కాగా ఆక్రమణదారులు తమ చట్టబద్ధతను నిరూపించుకోలేదని, అందుకే కూల్చివేతలు జరిపామని కలెక్టర్ జడేజా తమ చర్యలను సమర్థించుకున్నారు. ఈ వ్యవహారం కోర్టులో ఉన్నప్పటికీ ఎందుకు కూల్చివేతలు సాగించారని ప్రశ్నించగా ఆయన సరైన సమాధానం ఇవ్వలేదు.

కోర్టు ఆదేశించినా...

హడావిడిగా కూల్చివేతలు జరపడంపై గుజరాత్ మైనారిటీ కోఆర్డినేషన్ కమిటీ నిరసన వ్యక్తం చేసింది. గత నెల 28వ తేదీన ఈ కమిటీ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌కు లేఖ రాస్తూ ముస్లిం సమాజానికి న్యాయం చేయాలని కోరింది. తన అనుమతి లేకుండా అక్టోబర్ 1వ తేదీ వరకూ దేశంలో ఎక్కడా కూల్చివేతలు జరపవద్దంటూ గత నెల 17న సుప్రీంకోర్టు స్టే ఇచ్చిన విషయాన్ని ఆ లేఖలో ప్రస్తావించింది. కూల్చివేతలు చట్టవిరుద్ధమని, రాజ్యాంగ వ్యతిరేక చర్య అని రాష్ట్ర హైకోర్టు కూడా తప్పుపట్టింది. అయితే రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వం తన పని తాను చేసుకుపోయింది.

ఉచిత విద్యుత్ ఇస్తే... బిజెపికి ప్రచారం చేస్తా

- ఢిల్లీ మాజీ సిఎం, ఆప్ అధినేత కేజ్రీవాల్ సవాల్

న్యూఢిల్లీ : ఢిల్లీ శాసనసభ ఎన్నికలు జరిగే లోగా బిజెపి అధికారంలో ఉన్న 22 రాష్ట్రాలలో ప్రజలకు ఉచిత విద్యుత్ అందించాలని ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సవాలు విసిరారు. అలా చేస్తే ఢిల్లీ ఎన్నికల్లో బిజెపి తరఫున ప్రచారం చేస్తానని చెప్పారు. జార్ఖండ్, మహారాష్ట్రతో పాటే నవంబరులో ఢిల్లీ శాసనసభకు కూడా ఎన్నికలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు ఎన్నికలకు తమ పార్టీ సిద్ధంగా ఉన్నదని తెలిపారు. ఆదివారం నిర్వహించిన 'జనతా కీ అదాలత్' కార్యక్రమంలో కేజ్రీవాల్ ప్రసంగిస్తూ రాష్ట్రాల్లో బిజెపి డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. హర్యానా, జమ్మూకాశ్మీర్‌లో బిజెపి ఓటమి తప్పదని అన్నారు.

డబుల్ ఇంజన్ అంటే ద్రవ్యోల్బణం, నిరుద్యోగం

బిజెపి చెబుతున్న 'డబుల్ ఇంజన్ ప్రభుత్వం'అంటే ద్రవ్యోల్బణం, అవినీతి, నిరుద్యోగం అని కేజ్రీవాల్ ఎద్దేవా చేశారు. హర్యానా, జమ్మూకాశ్మీర్‌లో బిజెపి డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు త్వరలోనే కుప్పకూలుతాయని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయని తెలిపారు. తమ ప్రభుత్వం విద్యుత్, నీరు, మహిళలకు బస్సు ప్రయాణం, వృద్ధులకు పుణ్యక్షేత్రాల సందర్శన, ఆరోగ్య రక్షణ, విద్య...వంటి ఆరు ఉచిత సేవలు అందించిందని చెప్పారు. ప్రజలు పొందుతున్న ఆరు ఉచిత సేవలను కోల్పోతారని హెచ్చరించారు. ఢిల్లీలో బిజెపి అధికారంలోకి వస్తే డిటిసి, ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు ప్రైవేటు పరం అవుతాయని ఆరోపించారు. మణిపూర్‌లో ఏడు సంవత్సరాలు అధికారంలో ఉన్న బిజెపి ఆ రాష్ట్రాన్ని రావణకాష్టం చేసిందని మండిపడ్డారు. డబుల్ ఇంజిన్‌ను ఆయన డబుల్ దోపిడీ...డబుల్ అవినీతిగా అభివర్ణించారు. లెఫ్టినెంట్ గవర్నర్ పాలనలో ఢిల్లీలో ప్రజాస్వామ్యం అనేదే లేకుండా పోయిందని అంటూ రాష్ట్రాన్ని 'ఎల్జీ రాజ్' నుండి విముక్తి చేస్తామని, రాష్ట్ర హోదా కల్పిస్తామని కేజ్రీవాల్ హామీ ఇచ్చారు.

అధికారులు సీజ్ చేసిన ఫ్యాక్టరీ ఇదే

మధ్యప్రదేశ్‌లో డ్రగ్స్ తయారీ కలకలం

- రూ.1814 కోట్ల సరుకు స్వాధీనం - ఇద్దరు అరెస్టు

అహ్మదాబాద్/భోపాల్ : మధ్యప్రదేశ్‌లో మాదక ద్రవ్యాల తయారీ వ్యవహారం తీవ్ర కలకలం రేపింది. భోపాల్‌లోని ఒక మందుల తయారీ కేంద్రంలో భారీ ఎత్తును డ్రగ్స్‌ను, ముడిసరుకును స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను గుజరాత్ హోంశాఖ సహాయ మంత్రి హర్ష్ సంఘ్వీ ఆదివారం సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వ్యాధులను నయం చేయడానికి ఉపయోగించే మందుల తయారు చేసే భోపాల్‌లోని ఒక ఫ్యాక్టరీలో అదే మాటున మాదక ద్రవ్యాలు తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గుజరాత్ ఉగ్రవాద నిరోధక బృందం (ఎటిఎస్), నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి) సోదాలు నిర్వహించాయి. స్థానిక పోలీసులతో కలిసి చేపట్టిన ఈ ఆపరేషన్‌లో దర్యాప్తు అధికారులు సదరు ఫ్యాక్టరీ నుంచి ఏకంగా రూ.1,814 కోట్ల విలువైన ఎండి డ్రగ్స్, ముడిసరుకును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. డ్రగ్స్‌పై పోరాటంలో భారీ విజయాన్ని సాధించిన గుజరాత్ ఎటిఎస్ మరియు ఎన్‌సిబి (ఒపిఎస్), ఢిల్లీ మంత్రి సంఘ్వీ అభినందనలు తెలిపారు.

నీట్ ప్రశ్నాపత్రం లీక్ కేసులో సిబిఐ మూడో చార్జ్‌షీట్

న్యూఢిల్లీ : నీట్ ప్రశ్నాపత్రం లీక్ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) మూడో చార్జ్‌షీట్ దాఖలు చేసింది. పాట్నాలోని సిబిఐ కేసులకు సంబంధించి ప్రత్యేక కోర్టులో శనివారం 21 మంది నిందితులకు వ్యతిరేకంగా చార్జ్‌షీట్ సమర్పించింది. సెప్టెంబర్ 20న ఆరుగురు నిందితులకు వ్యతిరేకంగా సిబిఐ చార్జ్‌షీట్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. తాజా పరిణామంతో ఇప్పటివరకు చార్జ్‌షీట్‌లో మొత్తం నిందితుల సంఖ్య 40 మందికి చేరింది. ఈ కేసులో 2024,ఆగస్టు 1న సిబిఐ 13 మందిపై మొదటి చార్జ్‌షీట్‌ను దాఖలు చేసిన సంగతి తెలిసిందే. జార్ఖండ్‌లోని హజరీబాగ్‌లోని నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్‌టిఎ) సంస్థ నుండి నీట్ ప్రశ్నాపత్రాన్ని దొంగిలించారన్న నేరంపై అదుపులోకి తీసుకున్న బొకరో నివాసి మరియు సివిల్ ఇంజనీర్ పంకజ్ కుమార్ అలియాస్ ఆదిత్య కీలక నిందితుడిగా ఉన్నట్లు సిబిఐ వర్గాలు తెలిపాయి. ప్రశ్నాపత్రాన్ని దొంగిలించేందుకు రాజ్ సింగ్ అనే వ్యక్తి సహాయం అందించినట్లు పేర్కొన్నాయి. దీంతో జులై 16న పంకజ్ మరియు రాజు సింగ్‌లను అరెస్ట్ చేసినపుడు కటకమ్‌డాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామ్‌నగర్ ప్రాంతంలోని రాజ్ గెస్ట్ హౌస్‌ను సిబిఐ సీల్ చేసింది.

ఎల్జీకి ఆ అధికారం లేదు

- సభ్యుల నామినేషన్‌పై జమ్మూకాశ్మీర్ పార్టీల మనోగతం

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్ శాసనసభ ఎన్నికలలో ఏ పార్టీకి లేదా కూటమికి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ లభించదని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేసిన నేపథ్యంలో రాజకీయ పార్టీలు గందరగోళంలో పడిపోయాయి. ముఖ్యంగా లెఫ్టినెంట్ గవర్నర్ ఐదుగురు సభ్యులను శాసనసభకు నామినేట్ చేసే విషయంలో కొనసాగుతున్న అనిశ్చితిపై అవి ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో మంత్రిమండలి ఏర్పడిన తర్వాత దాని సలహా, సూచన మేరకే లెఫ్టినెంట్ గవర్నర్ సభ్యులను నామినేట్ చేయాల్సి ఉంటుందని ప్రతిపక్ష పార్టీలు అభిప్రాయపడ్డాయి. అయితే ఆ అవసరం లేదని బిజెపి చెబుతోంది. న్యాయ నిపుణులు సైతం దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. శాసనసభకు అదనంగా నామినేట్ అయ్యే సభ్యులకు ఇతర ఎమ్మెల్యేలకు ఉండే అధికారాలు, ఓటింగ్ హక్కులు ఉంటాయి. ఐదుగురి నామినేషన్‌తో శాసనసభలో సభ్యుల సంఖ్య 95కు పెరుగుతుంది. అప్పుడు ప్రభుత్వ ఏర్పాటుకు 48 మంది సభ్యుల మద్దతు అవసరమవుతుంది. పద్ధతి ప్రకారం అయితే ఎన్నికైన ప్రభుత్వమే సభ్యులను నామినేట్ చేయాలని, అంతేకానీ నామినేటెడ్ సభ్యుడైన వ్యక్తి (లెఫ్టినెంట్ గవర్నర్) సభ్యులను ఎలా నామినేట్ చేస్తారని నేషనల్ కాన్ఫరెన్స్ ప్రతినిధి ఇమ్రాన్ నబీ దార్ ప్రశ్నించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కేంద్రం విస్మరించరాదని ఆయన అన్నారు. మంత్రిమండలి సలహా తీసుకోకుండా సభ్యులను నియమించే అధికారం లెఫ్టినెంట్ గవర్నరుకు లేదని చెప్పారు. మంత్రిమండలి సలహా తీసుకోకుండా సభ్యులను నామినేట్ చేయడమంటే ప్రజాతీర్పును నీరుకార్చడమే అవుతుందని పిడిపి సీనియర్ నేత మెహబూబ్ బేగ్ తెలిపారు. జమ్మూకాశ్మీర్ పునర్విభజన చట్టం ప్రకారం శాసనసభకు సభ్యులను నామినేట్ చేసే ముందు లెఫ్టినెంట్ గవర్నర్ మంత్రిమండలి సలహా తీసుకోవాల్సిన అవసరం లేదని జమ్మూకాశ్మీర్ మాజీ న్యాయ కార్యదర్శి మహమ్మద్ అష్రఫ్ మిర్ అభిప్రాయపడ్డారు. అయితే శాసనసభకు ఏకపక్షంగా సభ్యులను నామినేట్ చేసే అధికారం లెఫ్టినెంట్ గవర్నరుకు ఉండదని సుప్రీంకోర్టు న్యాయవాది షరీక్ రియాజ్ చెప్పారు.

రైల్వే అధికారుల నియామకాలపై కేంద్రం యూటర్న్

- యూపీఎస్‌సీ ద్వారా ఇకపై రెండు పరీక్షల నిర్వహణ

న్యూఢిల్లీ : రైల్వే అధికారుల నియామక విధానంపై కేంద్రం యూటర్న్ తీసుకుంది. రైల్వే ఉద్యోగాలలో నియామకాలకు సంబంధించి సుమారు ఐదు సంవత్సరాల క్రితం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ఎనిమిది రైల్వే సర్వీసులను ఒకే సివిల్ సర్వీస్‌గా విలీనం చేస్తూ ఐదు సంవత్సరాల క్రితం కేంద్రం నిర్ణయం తీసుకుంది. అయితే 2019లో తీసుకున్న క్యాబినెట్ నిర్ణయానికి విరుద్ధంగా రైల్వే సర్వీసులలో నియామకాలను రెండు వేర్వేరు పరీక్షల ద్వారా చేపట్టాలని తాజాగా నిర్ణయించింది. సాంకేతికేతర సర్వీసులకు సివిల్ సర్వీసెస్ పరీక్షలు (సీఎస్‌ఈ), సాంకేతిక సర్వీసులకు ఇంజినీరింగ్ సర్వీస్ పరీక్షలు (ఈఎస్‌ఈ) నిర్వహిస్తారు. ఈ పరీక్షలను యూపీఎస్‌సీ చేపడుతుంది. ఈ మేరకు రైల్వే మంత్రిత్వ శాఖ శనివారం టెలికమ్యూనికేషన్ మంత్రిత్వ శాఖకు ఓ లేఖ రాసింది. దానిపై 'ఎలాంటి జాప్యం లేకుండా' అని పేర్కొంది. ఈఎస్‌ఈకి టెలికమ్యూనికేషన్ మంత్రిత్వ శాఖ నోడల్ మంత్రిత్వ శాఖగా వ్యవహరిస్తుంది. రైల్వే శాఖలో సాంకేతిక, సాంకేతికేతర సిబ్బంది అవసరాలను పరిగణనలోకి తీసుకొని ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలుపుతున్నామని సిబ్బంది, శిక్షణ మంత్రిత్వ శాఖ తన ఆఫీస్ మెమొరాండంలో తెలియజేసింది. సర్వీసుల విలీనం తర్వాత సాంకేతిక అధికారుల కొరత పెరిగిన నేపథ్యంలో విలీన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

లడఖ్ భవన్‌లో వాంగ్‌ఛుక్ దీక్ష

న్యూఢిల్లీ : వాతావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌ఛుక్, ఆయన మద్దతుదారులు ఆదివారం దేశ రాజధానిలో నిరవధిక దీక్షను చేపట్టారు. దీక్షకు అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుచెప్పినప్పటికీ వారంతా అందుకు సిద్ధపడ్డారు. గత నాలుగు రోజులుగా తమను నిర్బంధించిన లడఖ్ భవన్‌లోనే దీక్ష ప్రారంభించామని వాంగ్‌ఛుక్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తెలిపారు. తామంతా 70 సంవత్సరాల పైబడిన వారమేనని, మహిళలతో సహా అనేక మంది 32 రోజుల పాటు వెయ్యి కిలోమీటర్ల పాదయాత్ర చేసి లెహ్ నుండి ఢిల్లీ చేరుకున్నామని ఆయన వివరించారు. గాంధీజీ చూపిన మార్గాన్ని అనుసరించేందుకు ఆయన దేశంలోనే ఎందుకు ఇబ్బందులు వస్తున్నాయని ప్రశ్నించారు. లడఖ్‌లో ఆరో షెడ్యూల్ అమలు సహా వివిధ అంశాలపై ప్రధాని, రాష్ట్రపతి లేదా హోం మంత్రితో చర్చించేందుకు తేదీలను నిర్ణయించాల్సిందిగా వాంగ్‌ఛుక్, ఇతర కార్యకర్తలు ప్రభుత్వానికి సమాచారం పంపారు. అయితే ప్రభుత్వం వైపు నుండి ఎలాంటి సమాధానం రాకపోవడంతో నిరవధిక దీక్ష చేపట్టాలని నిర్ణయించారు. కనీసం ఒక నాయకుడితో అయినా సమావేశం అవుతామని హోం మంత్రిత్వ శాఖ హామీ ఇవ్వడంతో వాంగ్‌ఛుక్ బృందం ఈ నెల 2వ తేదీన రాజ్‌ఘాట్‌లో 48 గంటల దీక్షను విరమించింది. అయితే ఆ తర్వాత ప్రభుత్వం నుండి ఎలాంటి సమాచారం అందకపోవడంతో దీక్షను తిరిగి ప్రారంభించాలని వాతావరణ కార్యకర్తలు నిర్ణయించారు. దీక్షకు అనుమతి నిరాకరిస్తూ ఆదివారం ఉదయమే వాంగ్‌ఛుక్‌కు లేఖ అందింది. 'జంతర్ మంతర్‌లో దీక్షకు అనుమతించకపోతే వేరే ప్రదేశాన్ని చూపాలని కోరాము. అన్ని చట్టాలకు కట్టుబడి ఉంటామని చెప్పాము. శాంతియుతంగా తమ సమస్యలు చెప్పుకుంటామని అన్నాము. అలాంటప్పుడు గాంధీ మార్గాన్ని అనుసరించడానికి ఆయన దేశంలోనే ఎందుకు ఇబ్బంది వస్తుంది?' అని వాంగ్‌ఛుక్ ప్రశ్నించారు.

ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి ఏడాది

- అమానవీయదాడులకు గాజాలో 42 వేల మంది మృతి
- లెబనాన్, ఇరాన్‌కూ విస్తరించిన దాడులు

కైరో : ఉగ్రవాదాన్ని అంతమొందించే పేరుతో పాలస్తీనా పౌరులను లక్ష్యంగా చేసుకొని గాజా స్ట్రిప్‌లో యుద్ధోన్మాదంతో ఇజ్రాయిల్ దాడులను ప్రారంభించి ఈ నెల 7 నాటికి ఏడాది పూర్తయింది. అమానవీయ దాడులను ప్రతిఘటించేందుకు ఇజ్రాయిల్‌లో హమాస్‌కు చెందిన సాయుధులు గతేడాది ఏడున దాడులకు పాల్పడ్డారు. వంద మంది పైగా ఇజ్రాయిలను అదుపులోకి తీసుకున్నారు. ఇక అప్పటి నుంచి ఇజ్రాయిల్ గాజా స్ట్రిప్‌పై విరుచుకుపడుతోంది. చిన్నారులు, మహిళలు, శరణార్థులతో సహా అమాయక పాలస్తీనా ప్రజలను లక్ష్యంగా చేసుకొని వైమానిక, భూతల దాడులు చేస్తూవస్తోంది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకు జీవుడా అంటూ అక్కడి ప్రజలు తలదాచుకున్న పాఠశాలలపైనా, ఆసుపత్రులపైనా, మసీదులపైనా ఇజ్రాయిల్ బలగాలు దాష్టీక దాడులకు తెగించాయి. వేలాది మంది ప్రాణాలను బలి తీసుకున్నాయి. ఘోరమైన హింసాత్మక దాడుల్లో చిక్కుకుపోయిన గాజా ప్రజానీకం అంతులేని పెను విషాదాన్ని చవిచూస్తున్నారు.

మరోవైపు ఎర్ర సముద్రంలో హౌతీ సాయుధుల దాడుల, ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య పెరిగిన ఉద్రిక్తతలు, అమెరికా నీచపు సైనిక ఎత్తుగడలతో మధ్యప్రాచ్య ప్రాంతం రణభూమిగా మారిపోయింది. ఈ నెల ప్రారంభంలో ఇజ్రాయిల్ మరింతగా రెచ్చిపోయి లెబనాన్‌లోనూ భూతల దాడులకు తెగించింది. ఈ దాడుల్లో అనేక మంది చనిపోయారు. వేలాది మంది రక్షిత ప్రాంతాలకు వలస వెళ్లారు. ఇరాన్‌కు కూడా ఈ దాడులు విస్తరించాయి. ఇజ్రాయిల్ వైమానిక దాడుల్లో ఒక్క గాజా స్ట్రిప్‌లోనే దాదాపు 42,000 మంది పైగా ప్రాణాలు కోల్పోయారు. ఇది ఆ ప్రాంతంలోని మొత్తం జనాభాలో 2 శాతంగా ఉంది. ఇక్కడి జనాభాలో 90 శాతం కంటే ఎక్కువ మంది ప్రజలు బలవంతంగా తమ ఇళ్లను ఖాళీ చేసి రక్షిత ప్రాంతాలకు వలస వెళ్లారు. రక్షిత శిబిరాల్లో తలదాచుకుంటున్న బాధిత పాలస్తీనీయన్లకు మానవతాసాయం అందించేందుకు వెళ్తున్న అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలను కూడా ఇజ్రాయిల్ అడ్డుకుంటూ వస్తోంది. సహాయక సామగ్రి వెళ్లనీయకుండా భద్రతా బలగాలతో అడ్డుకుంది. కుటుంబాలకు కుటుంబాలు ఛిద్రమయ్యాయి. జీవనోపాధులకు దిక్కులేకుండా పోయింది. భవిష్యత్ సంపద అయిన చిన్నారులపై ఇజ్రాయిల్ యుద్ధోన్మాద దాడులు మాయనిమచ్చలుగా మిగిలిపోయాయి.

బీరుట్‌లో భీకరదాడులు

- 25 మంది మృతి

బీరుట్ : హిజ్బుల్లాను అంతమొందించే నెపంతో లెబనాన్‌పైనా విరుచుకుపడుతున్న ఇజ్రాయిల్ శనివారం రాత్రి బీరుట్ శివారు ప్రాంతంలో భారీ స్థాయిలో వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో 25 మంది పైగా చనిపోయారు. ఇప్పటికే నస్రల్లా సహా పలువురు కీలక నేతలను చంపేసినట్లు ప్రకటించిన ఇజ్రాయిల్ తాజా దాడుల్లో మరికొందరు కీలక నేతలను చంపేసినట్లు వెల్లడించింది. కాగా బీరుట్‌లో ఇజ్రాయిల్ జరిపిన తాజా దాడుల్లో 25 మంది చనిపోయారని, మరో 127 మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్యశాఖ తెలిపింది. బీరుట్ శివారు ప్రాంతాలపై ఇప్పటి వరకు ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో గత శనివారం రాత్రి జరిపినవే అత్యంత దారుణమైనవని లెబనాన్‌లో విధులు నిర్వహిస్తున్న పలువురు పాత్రికేయులు పేర్కొన్నారు. బాణసంచాలా మొదలైన దాడులు అంతకంతకూ పెరుగుతూ ఆదివారం ఉదయం వరకూ భీకరంగా సాగాయని చెప్పారు.

ఈ దాడుల్లో పాలుపంచుకున్న ఇజ్రాయిల్ సైనికులు కూడా పెద్ద సంఖ్యలోనే చనిపోయారు. గతేడాది అక్టోబరు 7న జరిగిన హమాస్ దాడిలో 1200 మంది ఇజ్రాయిలీలు చనిపోయారు. ఆ తర్వాత దాడులు, ఇతర ఘటనల్లో కనీసం 350 మంది ఇజ్రాయిలీ సైనికులు చనిపోయారు. అంతకంతకూ పెరిగిపోతున్న మానవ హనన్ని, హింసకు అడ్డుకట్ట వేయాలని శాంతియుత చర్చలే అందుకు పరిష్కారమార్గమని అంతర్జాతీయంగా ప్రగతిశీల శక్తులన్నీ నినదిస్తూవున్నా..

ఇజ్రాయిల్‌లోని నెతన్యాహూ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదు. అయితే ఈ విషయంలో అగ్రరాజ్యాలుగా చెప్పుకునే దేశాల తీరు చాలా దుర్మార్గంగా ఉంటోంది. ఎప్పటిలాగే అమెరికా తన యుద్ధోన్మాద వికృత రూపాన్ని నిస్సిగ్గుగా చాటుకుంటోంది. ఇజ్రాయిల్‌కు సైనికంగా, ఆర్థికంగా గణనీయమైన సహాయాన్ని అందిస్తూ దాడులకు ఆజ్యం పోస్తోంది. మరోవైపు కమ్యూనిస్టు చైనా శాంతియుత పరిష్కారం కోసం ఎనలేని కృషి చేస్తోంది. దాడులకు స్వస్తి పలికి కాల్పుల విరమణ పాటించాలని అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశించినా ఇజ్రాయిల్ పెడచెవిన పెట్టడాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. ఇది అంతర్జాతీయ న్యాయాన్ని అపహాస్యం చేయడమేనని ఐరాసలో చైనా శాశ్వత ప్రతినిధి ఫు కాంగ్ అన్నారు. ఇజ్రాయిల్ సాగిస్తున్న హింసకు తెరపడాలంటే అంతర్జాతీయ సమాజం ఒకతాటిపై నిలిచి దౌత్యపర ఒత్తిళ్లు తీసుకురావడం ద్వారానే ఇజ్రాయిల్‌కు ముకుతాడు వేయగలని వివిధ ప్రజా సమూహాలు నినదిస్తున్నాయి.

పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా లండన్‌లో ర్యాలీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా లండన్ వివిధ ప్రజా సంఘాలు శనివారం భారీ ప్రదర్శన నిర్వహించాయి. ఈ కార్యాక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ యుకె కమిటీ కూడా భాగస్వామ్యం అయింది. 'నేషనల్ మార్చ్ ఫర్ పాలస్తీనా' పేరిట వివిధ ప్రగతిశీల సమూహాలు నిర్వహించిన ఈ ర్యాలీతో రస్సెల్ స్క్వేర్‌కు వెళ్లే వీధులన్నీ నినాదాలతో హోరెత్తాయి. పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా నిధులు సేకరించేందుకు ఏర్పాటు చేసిన స్టాల్స్‌తో నిండిపోయాయి. జాతీయ విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, కార్మికుల ఉమ్మడిగా అనేక సంఘాలు ప్రదర్శనలో పాల్గొన్నాయి. స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా - యునైటెడ్ కింగ్‌డమ్ (ఎస్‌ఎఫ్‌ఐ-యుకె) కూడా పోరాటంలో పాల్గొన్నది. స్కాటిష్ పాలస్తీనా సాలిడారిటీ క్యాంపెయిన్‌తో సహా అనేక సోదర సంఘాలతో ఈ ప్రదర్శన చేపట్టిన సంస్థల్లో ఉన్నాయి. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత ప్రధాన కార్యదర్శి మయూఖ్ బిశ్వాస్ మాట్లాడుతూ పాలస్తీనా ప్రజలపై మారణహోమం తీవ్రతరమై ఏడాది అవుతోందని, అప్పటి నుండి అంతర్జాతీయ చట్టాలు, మానవతా పరిస్థితులను పూర్తిగా విస్మరించడంతో ఇజ్రాయెల్ రాజ్య హింస విస్తరిస్తోందని విమర్శించారు. విస్తరణవాద స్వభావాన్ని సంతరించుకున్న ఈ దాడులను ఎస్‌ఎఫ్‌ఐ ఖండిస్తోందని అన్నారు. పాలస్తీనాలో న్యాయం కోసం పోరాటానికి అవిశ్రాంతంగా, అలుపెరగని పోరాటం అవసరమని అన్నారు. ఇతర ప్రగతిశీల వ్యక్తులు, సంఘాలు సంఘీభావంతో పాలస్తీనా మద్ధతుగా చేరాలని కోరారు.

పంజాబ్‌లో ఆప్ నేతపై కాల్పులు

చండీగఢ్ : పంజాబ్‌లో ఆప్, శిరోమణి అకాలీ దళ్ (ఎస్‌ఎడి) నేతల మధ్య జరిగిన వాగ్వివాదం కాల్పులకు దారితీసింది. ఈ ఘటనలో ఆప్ నేత మందీప్ సింగ్ బ్రార్‌కు బుల్లెట్ గాయాలయ్యాయి. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. పంజాబ్‌లోని ఫజిల్కా జిల్లాలో ఆదివారం ఉదయం ఈ ఘటన జరిగింది. వివరాల ప్రకారం.. ఓ పాఠశాలకు సంబంధించిన ఫైల్‌ను క్లియర్ చేయాల్సిందిగా ఎస్‌ఎడి నేత వీర్‌దేవ్ సింగ్ తన అనుచరులతో కలిసి స్థానిక బ్లాక్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయత్ అఫీసర్ (బిడిపిఒ) కార్యాలయానికి వెళ్లారు. బిడిపిఒ సిబ్బంది నిరాకరించడంతో ఆగ్రహంతో బయటికి వెళ్లిపోయారు. కార్యాలయం ఎదుట ఆప్ నేత మందీప్ సింగ్ బ్రార్‌తో వాగ్వివాదానికి దిగారు. వెంటనే వీర్‌దేవ్ సింగ్ ఆప్ నేతపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు.

ఎఫ్ఐఆర్ నమోదైనా మారని తీరు

- తాజాగా ముస్లింలపై హింసకు ఘజియాబాద్ స్వామి పిలుపు

లక్నో : ద్వేషపూరిత ప్రసంగాల విషయంలో యూపీలో ఒక స్వామిపై ఎఫ్ఐఆర్ దాఖలు అయినప్పటికీ ఆయన తీరులో మార్పు రాలేదు. తాజాగా ముస్లింలపై హింసకు ఆయన పిలుపునిచ్చాడు. ఇదంతా వారం వ్యధిలోనే జరగటం గమనార్హం. అయితే, తాజా వ్యాఖ్యలకు సంబంధించి సదరు స్వామిపై పోలీసులు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవటం గమనార్హం. దీంతో ఇటు స్వామి, అటు పోలీసు అధికారుల తీరుపై ముస్లిం సంఘాల నేతలు, సామాజిక కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామస్వరూపానంద సమాజంలో శత్రుత్వాన్ని, ద్వేషాన్ని పెంచుతున్నారని దలన్‌వాలా పోలీసులు ఆయనపై సుమోటో చర్యను తీసుకున్నారు. ఆయనపై ఎఫ్ఐఆర్‌ను దాఖలు చేశారు. ద్వేషపూరిత ప్రసంగాలపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయనపై చర్య తీసుకున్నట్టు దలన్‌వాలా పోలీసులు ఇప్పటికే వెల్లడించారు. ఒక వారం కిందటే ఇది చోటు చేసుకున్నది. అయితే, రామస్వరూపానంద తీరులో మాత్రం ఏ మార్పు రాలేదు. ఒక వర్గానికి వ్యతిరేకంగా హింసకు ఆయన పిలుపునిచ్చారు. గతనెల 14 నుంచి 18 మధ్య ఘజియాబాద్‌లోని ఒక ఫామ్‌హౌజ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ముస్లింలకు వ్యతిరేకంగా ఆయుధాలు పట్టాలని ఈ కార్యక్రమానికి వచ్చిన భారీ జనసందోహాన్ని ఉద్దేశిస్తూ ఆయన అన్నట్టు ఆ వీడియోలో ఉన్నది. అయితే, ఆయన తాజాగా చేసిన ద్వేషపూరిత వ్యాఖ్యలపై పోలీసులు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవటం గమనార్హం. దీనిపై స్థానిక ఏసీపీ అభిషేక్ శ్రీవాస్తవను ప్రశ్నించగా.. ఆయన స్పందించలేదు.

ద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తూ సమాజంలో అలజడిని సృష్టిస్తున్న రామస్వరూపానందపై కఠిన చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. యూపీలోని యోగి పాలనలో ముస్లింపై ద్వేషపూరిత వ్యాఖ్యలు నిత్యకృత్యమయ్యాయనీ, వీటికి అడ్డుకట్ట పడాల్సిన అవసరం చాలా ఉన్నదని వారు అంటున్నారు.

AXIS BANK LIMITED

రిటైల్ లెండింగ్& పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీసు/బ్రాంచి): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డోర్ నం. 30-22-79, శ్రీ టవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520002.

స్వాధీనతా ప్రకటన రూల్8(1) క్రింద (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారు **యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్** (గతంలో యుటిఐ బ్యాంక్ లిమిటెడ్‌గా పేరుగలది) దీని రిజిస్టర్డు ఆఫీసు: "త్రిషూల్" సమర్తేశ్వర్ టెంపుల్ ఎదురుగా, లా గార్డెన్ దగ్గర, ఎల్లిస్‌బ్రిడ్జి, అహ్మదాబాద్-380006 వద్ద మరియు మరో ప్రదేశంలో దీని బ్రాంచి ఆఫీసు: **రిటైల్ లెండింగ్& పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీసు/బ్రాంచి): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డోర్ నం. 30-22-79, శ్రీ టవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520002** వద్ద కలిగియుండి, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, **డిమాండ్ నోటీసు** జారీచేసి, సార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద రుణగ్రహీత/ హామీదారులు/ తాకట్టుదారులను ఆహ్వానింపబడుచున్నది.

క్ర సం.	దరఖాస్తుదారు/సహ-దరఖాస్తుదారు/ హామీదారులు పేరు చిరునామా	బకాయి రూ.లలో	ఆఫర్‌చేసిన ఈక్విటేబుల్ తాకట్టుపెట్టిన ఆస్తి & స్వాధీనతా తేది
3	1) **శ్రీ. కన్నెగంటి ప్రవీణ్ కుమార్,** తండ్రి. కన్నెగంటి సాంబశివరావు, డో.నం.417, 3వ క్రాస్ రోడ్డు, 1వ మెయిన్ మంజునాథ్ లే అవుట్, మరతహల్లి, బెంగళూరు, కర్నాటక-560037. **ఇక్కడ కూడా : శ్రీ.**కన్నెగంటి ప్రవీణ్ కుమార్, అసోసియేటివ్ ఇట్ కన్సల్టెంట్, ఐటిసి ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, పులికేశినగర్ పోస్ట్, బెంగళూరు, కర్నాటక-560005. **2. శ్రీమతి. కన్నెగంటి సీతామహాలక్ష్మి,** భర్త. కన్నెగంటి సాంబశివరావు, డో.నం.3-180-134, హిమాని నగర్, 3వ లైన్, నగరాలు పోస్ట్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522034. **ఇక్కడ కూడా : శ్రీమతి. కన్నెగంటి సీతామహాలక్ష్మి,** భర్త. కన్నెగంటి సాంబశివరావు, డో.నం.9-54, లలిత నగర్, రైల్వే రిజర్వేషన్ ప్రక్కన, దిల్‌షుక్ నగర్, సరూర్‌నగర్, రంగారెడ్డి, తెలంగాణ-500035. డిమాండ్ నోటీసు తేది: 25.06.2024 ఎల్ఏఎన్ ఎకౌంట్ నెం. **PHR006900714409**	**రూ.6,94,489/-** (ఆరు లక్షల తొంభై నాలుగు వేల నాలుగు వందల ఎనభై తొమ్మిది రూపాయలు మాత్రమే)	గుంటూరు జిల్లా, గుంటూరు ఉపజిల్లా, గుంటూరు గ్రామంలో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా (రెడ్డిపాలెం గ్రామ పంచాయతీ ఏరియా) డో.నం.276/5 పరిధి ఎ.లు. 1.45 సెంట్లు. ఆ విక్రేత హక్కు పరిధి 120 చ.గ.లు. గిఫ్ట్ సైట్ హద్దులు : తూర్పు : 20 అ.లు. వెడల్పు రోడ్డు-27 అ.లు., దక్షిణం : తాడిబోయిన వీరా స్వామి ద్వారా ఇతరులకు అమ్మబడిన సైట్-27 అ.లు., ఉత్తరం : గుడివాడ రామ కోటేశ్వరరావు సైట్-40 అ.లు. ఈ సరిహద్దుల సైట్ పరిధి 120 చ.గ.లు. లేదా 100.33 చ.మీ.లు. మాత్రమే. లాంఛనప్రాయ స్వాధీనత : **05.10.2024**

తేది: 07.10.2024
ప్రదేశం: ఆంధ్రప్రదేశ్

సం/- అధీకృత అధికారి
యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

మీకోసం

అజీర్తి, అసిడిటీతో బాధపడుతుంటే ఒక యాలక్కాయ తిని గోరువెచ్చని నీరు తాగితే ఉపశమనం కలుగుతుంది.

జీవన సౌరభం

సమయాన్ని సరిగ్గా వినియోగించుకోలేని వారు ఎందులోనూ ముందుకు సాగలేరు.

జీవిత పాఠం



మధ్యాహ్నం మూడు గంటలు అయింది. సుందర్ నగర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సత్యం మాస్టర్ ప్రతి తరగతి గదిని పరిశీలించేందుకు బయలుదేరారు. ఆయనకి పదో తరగతి నుండి విశ్వం మాస్టర్ అరుపులు వినిపించాయి. విద్యార్థులకు లెక్కల పరీక్షలో తక్కువ మార్కులు వచ్చాయని, ఆయన పిల్లలను తిడుతున్నారు. 'ఎందుకు తక్కువ మార్కులు వచ్చాయి రా..!' అని కేకలు వేస్తూ.. బెత్తంతో బాదుతున్నారు. 'బాగా చదువుకోకపోతే రేపు మీ పరిస్థితి కూడా కూలీనాలీ చేసుకుని బతకాల్సిందే' అని బాగా కోప్పడుతున్నారు.

ఇదంతా గమనించిన సత్యం మాస్టర్ తరగతి గదిలోకి వచ్చారు. మాస్టారు నిలబెట్టిన విద్యార్థుల నుద్దేశించి 'మీ అందరికీ ఎందుకు తక్కువ మార్కులు వచ్చాయి?' అని అడిగారు. 'సరిగ్గా చదవలేదు సార్' అని విద్యార్థులు బదులిచ్చారు. 'మీ తల్లిదండ్రులు రక్తాన్ని చెమటగా మార్చి శ్రమించి రూపాయి రూపాయి కూడగట్టి మిమ్మల్ని బాగా చదివించాలి అనుకుంటున్నారు. చదువు విలువ వారికి అర్థమైంది. 'మరి మీరు ఏం చేస్తున్నారు. మీ తల్లిదండ్రుల కష్టాన్ని, కాలాన్ని వృధా చేస్తున్నారు. మీ అమ్మానాన్న అంతా కూలీనాలీ చేసుకుని బతికేవాళ్లే. ఏ వత్తినైనా గౌరవించాలి. ప్రతి మనిషికి విలువ ఇవ్వాలి. కానీ సమాజంలో ఆ పరిస్థితి ఉందా? వారు చేసే పనిని బట్టి విలువిస్తున్నారు. మీ తల్లిదండ్రులు కష్టం చేయటమే తప్ప. గౌరవం పొందటం లేదు. ఆ కష్టం మీకు రాకూడదని. మీ అందరినీ చదివిస్తున్నారు.

చదువు మాత్రమే మన జీవితాలను, దేశ భవిష్యత్తును మార్చగలుగుతుంది. బాగా చదివి ఉన్నత స్థాయికి చేరి, వారి కన్నీళ్లు తుడిచే గొప్ప వారిగా మీరందరూ మారాలి. అంటే బాధ్యత కలిగిన పౌరుడుగా, నీతి కలిగిన రాజకీయ నాయకులుగా, నిజాయితీ కలిగిన అధికారులుగా, ప్రజా వైద్యులుగా, ప్రగతిని నిర్మించే ఇంజనీర్లుగా, నైపుణ్య కార్మికులుగా ఎదిగి అందరి జీవితాలను మార్చే విధంగా తయారు కావాలి. ఆ స్థాయికి చేరాలంటే దానికి ఏకైక మార్గం చదువు ఒక్కటే' అని సత్యం మాస్టారు చెప్పిన మాటలు విద్యార్థులను ఆలోచనల్లో పడేశాయి.

మరుసటి రోజు నుండి పిల్లలందరూ చక్కగా చదవటం మొదలెట్టారు. పిల్లల్లో సృజనాత్మకత శక్తి పెరిగింది. శాస్త్రీయ దృక్పథంతో కూడిన విద్యనభ్యసించడం మొదలుపెట్టారు. ఆ ఏడాది విద్యార్థులందరికీ మంచి మార్కులు వచ్చాయి. పదవ తరగతి ఫలితాల్లో వాళ్ల స్కూలు స్టేట్ ఫస్ట్ సాధించింది.

– ఎస్. కె. బాజీ సైదా,
88972 82981.

నేను గీసిన బొమ్మ

ఎం.సాహిత్య,
6వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
సిద్దిపేట.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

గురి పెడితే 'పతకమే'!

'ఒకటే గమనం ఒకటే గమ్యం
గెలుపు పొందె వరకూ అలుపు లేదు మనకు
బతుకు అంటే గెలుపూ
గెలుపు కొరకె బతుకు' అంటూ సాగిన పాట 'భద్రాచలం సినిమాలోనిది. అక్షరాల ఈ పాటను నిజం చేస్తూ గుంటూరు నగరానికి చెందిన నేలవల్లి ముఖేష్ షూటింగ్ స్పోర్ట్స్‌లో రాణిస్తున్నాడు. ప్రస్తుతం పెరూలో జరుగుతోన్న ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఐదు బంగారు పతకాలు సాధించి సత్తా చాటాడు. చిన్నప్పటి నుంచీ ముఖేశ్‌కి షూటింగ్ అంటే అమితమైన ఇష్టం. అతని ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు ఆ క్రీడలో ప్రోత్సహించారు. పాఠశాలలోని సమ్మర్ క్యాంపులో వ్యాయామ ఉపాధ్యాయుడు ముఖేష్‌తో పిస్టల్ పట్టించి చేసిన ప్రయోగం నెలలోనే ఫలితాన్నిచ్చింది. ఆ స్కూల్‌లోనే నిర్వహించిన జిల్లా స్కూల్ గేమ్స్ షూటింగ్ పోటీలో రజత పతకం గెలిచాడు. ముఖేష్ ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు శిక్షణ నిమిత్తం అకాడమీలో చేర్పించారు. ఇక అక్కడ నుంచి వెనుదిరిగి చూసుకోలేదు.

అంతర్జాతీయ క్రీడావేదికపై ఆంధ్రా క్రీడాతార తళుక్కుమంది. తన గురికి తిరుగులేదని నిరూపిస్తూ గుంటూరు నగరంలోని శ్రీనగర్ నాలుగో లైన్‌కు చెందిన నేలవల్లి శ్రీనివాసరావు, మాధవి దంపతుల కుమారుడే యువ షూటర్ నేలవల్లి ముఖేష్. శ్రీనివాసరావు న్యాయవాది కాగా, తల్లి మాధవి ఇంగ్లీషు ఉపాధ్యాయిని. ముఖేష్ గుంటూరులోని లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీషు మీడియం స్కూలులో చదివాడు. ఇంటర్ విజ్ఞాన్‌లో పూర్తిచేశాడు. ప్రస్తుతం కె.ఎల్ యూనివర్శిటీలో బిటెక్ మూడో సంవత్సరం (సిఎస్ఐటి) చదువుతున్నాడు. 10, 25, 50 మీటర్ల పిస్టల్ విభాగంలో షూటర్‌గా రాణిస్తున్నారు. 2019 వరకూ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో గుంటూరులోని ఇండియన్ అకాడమీ ఆఫ్ షుఉటింగ్ స్పోర్ట్స్‌లో నాగిశెట్టి సుబ్రహ్మణేశ్వరరావు వద్ద శిక్షణ తీసుకుని జాతీయ క్రీడాకారుడిగా ఎదిగాడు.

25, 50 మీటర్ల షూటింగ్ స్పోర్ట్స్‌లో ఆంధ్రప్రదేశ్‌లో శిక్షణకు అవసరమైన టార్గెట్ పరికరాలు, శిక్షకులు లేకపోవటంతో పూనేలోని ఒలింపిక్ పతక విజేత గగన్ నారంగ్‌కు చెందిన 'గన్ ఫర్ గ్లోరీ షూటింగ్ అకాడమీ'లో చేరాడు. అక్కడ అంతర్జాతీయ కోచ్‌లు సికె చౌదరి, ఓయ్ కనెప్ (జర్మన్) వద్ద శిక్షణ తీసుకుంటున్నాడు. ఎస్ఎఐ సౌజన్యంతో 'ఖేలో ఇండియా', గగన్ నారంగ్ స్పోర్ట్స్ ప్రమోషన్ ఫౌండేషన్ ద్వారా 'ప్రాజెక్ట్ లీప్' పథకం ద్వారా ఈ శిక్షణను పొందుతున్నాడు. ఇప్పటికే అనేక రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పలు పతకాలు గెల్చుకున్నాడు. 2019 నుంచి ఇప్పటివరకు ఖేలో ఇండియా తో పాటు జాతీయ షూటింగ్ ఛాంపియన్ షిప్ లలో పదుల సంఖ్యలో పతకాలు గెలిచాడు. 2022లో జరిగిన జాతీయ షూటింగ్ ఛాంపియన్ షిప్‌లో 25 మీటర్ల పిస్టల్‌లో 2 జాతీయ రికార్డులు నెలకొల్పాడు.

ప్రపంచ చాంపియన్‌షిప్ లక్ష్యం

10, 25, 50 మీటర్ల విభాగాల్లో ప్రపంచస్థాయిలో చాంపియన్‌షిప్‌గా నిలవటమే లక్ష్యం. అప్పటి వరకూ విశ్రమించేది లేదు. ఇప్పటికే అనేక జాతీయ, అంతర్జాతీయ విభాగాల్లో పోటీల్లో సత్తా చాటాను. భారత దేశానికి ప్రపంచస్థాయి గుర్తింపు తేవటానికి ఒలంపిక్స్‌లో పతకం గెలిచి ప్రపంచచాంపియన్‌గా నిలవాలన్నదే నా లక్ష్యం. ఆ దిశగా నాకు అకాడమీ కోచ్‌లు శిక్షణ ఇస్తున్నారు. తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. యూనివర్శిటీ అండగా నిలబడుతోంది.

పెరూలోనూ పతకాల పంట

సెప్టెంబర్ 26 నుంచి ఈనెల ఏడోతేదీ వరకూ పెరూ దేశ రాజధాని లిమాలో ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్ కొనసాగుతోంది. భారత జట్టు క్రీడాకారులు విశేష ప్రతిభతో పతకాల పట్టికలో దేశాన్ని ప్రథమ స్థానంలో నిలిపారు. వీరిలో ముఖేష్ సరికొత్త రికార్డులతో పతకాలు సాధించాడు. 25 మీటర్ల ఫిస్టల్ విభాగంలో 585/600 స్కోర్‌తో బంగారు పతకం గెలిచాడు. మన దేశానికే చెందిన సూరజ్ శర్మ 583/600 రజత పతకం గెలవగా, ఉక్రెయిన్‌కు చెందిన మెడుషేవ్స్కి వ్లాదిస్లావ్ కాంస్య పతకం గెలిచారు. ఈనెల ఒకటో తేదీన అర్ధరాత్రి జరిగిన ఈ 25 మీటర్ల పిస్టల్ టీం విభాగంలో కూడా ముఖేష్, సూరజ్ శర్మ, ప్రద్యుమ్న సింగ్‌లతో కూడిన భారత జట్టు 1729 పాయింట్లతో స్వర్ణం గెలిచింది. పోలాండ్ జట్టు 1726 పాయింట్లతో రజత పతకం గెలవగా, ఇటలీ జట్టు 1712 పాయింట్లతో కాంస్య పతకం గెలిచింది. మంగళవారం పోటీలు పూర్తయ్యే సమయానికి భారత జట్టు పది స్వర్ణ, ఒక రజత, మూడు కాంస్య పతకాలతో పట్టికలో ప్రథమ స్థానంలో నిలిచింది.

ఐదు బంగారు పతకాలు, రెండు కాంస్యాలు

వరల్డ్ జూనియర్ షూటింగ్ చాంఫియన్‌షిప్‌లో 10 మీటర్ల ఎయిర్ ఫిస్టల్ టీం విభాగంలో ముఖేష్, ప్రమోద్, ఉమేష్ చౌదరిలతో కూడిన భారత జట్టు స్వర్ణ పతకం గెలిచింది. సెప్టెంబర్ 30న అర్ధరాత్రి జరిగిన ఈ పోటీలో ముఖేష్ భారతజట్టు విజయంలో ముఖ్య పాత్ర పోషించాడు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్ విభాగంతో పాటు 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్, రాపిడ్ ఫైర్ పిస్టల్, స్టాండర్డ్ పిస్టల్, 50 మీటర్ల ఫ్రీ పిస్టల్ విభాగాలలో కూడా ముఖేష్ భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. శుక్రవారం జరిగిన పోటీల్లో 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో బంగారు పతకాన్ని ముఖేష్ సాధించాడు. ఈ పోటీల్లో మొత్తంగా ఐదు బంగారు, రెండు కాంస్య పతకాలు సాధించాడు. ఓవరాల్ ప్రతిభతో విశ్వవేదికపై తన సత్తా చాటాడు. ఒలంపిక్ వేదికపై తన సత్తా చాటి షూటింగ్‌లో చాంఫియన్‌గా నిలుస్తారని ఆశిద్దాం.

– యడవల్లి శ్రీనివాసరావు

వెండి తెరపై విజయదశమి



తెలుగు వాళ్లకు రెండు రకాల పండుగలుంటాయి. ఒకరకం పండుగలను క్యాలెండర్ డిసైడ్ చేస్తుంది. మరో రకం పండుగలను సినిమా రిలీజ్ డేట్ ఫిక్స్ చేస్తుంది. తెలుగు వాళ్ల జీవితాలు సినిమాతో అంతలా పెనవేసుకుపోయాయి. ఇక పండుగ సమయంలో రిలీజయ్యే సినిమాలైతే ఆ ఆనందాన్ని డబుల్ చేస్తాయి. అది దసరా కావొచ్చు, సంక్రాంతి కావొచ్చు...ఆ రోజు చాలామంది ఫ్యామిలీ అంతా కలిసి ఫస్ట్ షో సినిమాకి వెళ్లొచ్చాకే ఆ పండుగ పూర్తయినట్టు. పండుగ సమయంలో రిలీజయ్యే సినిమాలతో పాటు, పండుగ పేరుతో రిలీజయ్యే సినిమాలకు కూడా స్పెషల్ అటెన్షన్ ఉంటుంది. ఈ దసరా సందర్భంగా దసరా పేరుతో రిలీజ్ అయిన సినిమాలను ఒకసారి గుర్తుచేసుకుందాం.

నానీ దసరా

తెలుగు సినీ ప్రేక్షకుల హృదయాల్లో నానీకి స్పెషల్ ప్లేస్ ఉంది. పక్కింటి అబ్బాయ్ ఇమేజ్ ఉంది. దానికి తగ్గట్టు ఫ్యాన్ బేస్ కూడా ఉంది. కానీ వీటిన్నింటితో పాటు ఏదో మిస్ అయింది. అదే నానీని టైర్2 హీరోల లిస్టుకే పరిమితం చేసింది. సినిమాలు ఆడుతున్నాయి. కలెక్షన్లు వస్తున్నాయి. కానీ చాలా కాలం పాటు అవేవీ నానీని మరో మెట్టు ఎక్కించలేకపోయాయి. వంద కోట్ల క్లబ్‌లో చేర్చ లేకపోయాయి. చాలా కష్టపడుతున్నా, ఫలితం కనిపించలేదు. ఒక పెద్ద కమర్షియల్ విజయం కోసం నానీ ఎదురుచూస్తున్న సమయంలో 'దసరా' వచ్చింది.

'దసరా వచ్చిందయ్యా, సరదా తెచ్చిందయ్యా' అనే బాలక్రిష్ణ సినిమాలోని పాట నానీ కెరీర్‌లోకి వచ్చింది. ఓపెనింగ్స్ అదిరిపోయాయి. సినిమాకు ఆడియన్స్ క్యూ కట్టారు. కలెక్షనల్ల వర్షం కురిసింది. 'దసరా' సినిమానే టైర్2 నుంచి టైర్ 1 హీరోల లిస్ట్‌లోకి వెళ్లడానికి నానీకి ఒక దారిని వేసింది. మొదటి అడుగును కూడా వేయించింది. డెబ్యూ డైరక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నానీ, కీర్తీ సురేష్‌ల కాంబోలో వచ్చిన ఈ సినిమాను చెరుకూరి సుధాకర్ నిర్మించారు. 2023 మార్చ్ 30న విడుదలైన ఈ సినిమా 177.5 కోట్ల రూయాలను వసూలు చేసింది. ఎప్పటి నుంచో నానీ ఎదురుచూస్తున్న వంద కోట్ల క్లబ్‌లో కూర్చోబెట్టింది. బోనస్‌గా నానీ, కీర్తీలకు ఉత్తమ నటీనటులుగా ఫిల్మ్‌ఫేర్ అవార్డులు వచాయి.

కళ్యాణ్ రామ్ విజయదశమి

చాలా ఫ్లాప్‌లు, కొన్ని హిట్లు ఉన్న హీరో కళ్యాణ్ రామ్. అయినా తనకంటూ కొంత ఫ్యాన్ బేస్ ఉంది. నందమూరి అభిమానుల నీడలో వచ్చిందేమీ కాదు. కళ్యాణ్ రామ్ చేసిన ప్రయోగాల వల్ల వచ్చింది.

తమ కుటుంబం మొత్తంలో అత్యధిక ప్రయోగాలు చేసిన హీరో కళ్యాణేనంటూ స్వయంగా జూనియర్ ఎన్టీఆరే ఒక సందర్భంలో చెప్పారు. అలా కళ్యాణ్ రామ్ చేసిన ప్రయోగాల్లో ఈ విజయదశమి కూడా ఒకటి. అయితే ఈ సినమా బాక్సాఫీస్ దగ్గర బోల్తాకొట్టి పరాజయాన్ని మూటకట్టుకుంది. వి.సముద్ర దర్శకత్వంలో కళ్యాణ్ రామ్, వేదికలు హీరోహీరోయిన్లగా వచ్చిన ఈ సినిమా 2007 సెప్టెంబర్ 21న విడుదలైంది. నటన పరంగా కళ్యాణ్ రామ్‌కి మంచి మార్కులే పడ్డా, నిర్మాతలకూ, డిస్టిబ్యూటర్లకూ నష్టాలే మిగిలాయి.

ఏఎన్నార్ దసరా బుల్లోడు

తెలుగు కమర్షియల్ సినిమాల గురించి మాట్లాడితే దసరా బుల్లోడు గురించి మాట్లాడాలి. దసరా బుల్లోడి గురించి మాట్లాడితే తెలుగు కమర్షియల్ సినిమాల గురించి మాట్లాడాలి. అంత సక్సస్‌ను చూసిన సినిమా అది. ఏఎన్నార్, వాణిశ్రీ జంటగా వి.బి రాజేంద్ర ప్రసాద్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా 1971 జనవరి 13న రిలీజ్ అయింది. పాతతరం వాళ్లని ఈ సినిమా పేరు చెప్పి ఒకసారి కదిలించి చూస్తే, ఎడ్లబండ్లు కట్టుకుని ఊర్లకు ఊర్లు దసరా బుల్లోడి కోసం బారులతీరిన సంఘటనలను కోకొల్లలుగా చెప్తారు. ఈ సినిమా తర్వాత అప్పటి అమ్మాయిలు ఎంతో మంది పట్టుబట్టి మరీ వాణిశ్రీ లంగా ఓణీల స్టయిల్‌ను అనుసరించారు. దసరా బుల్లోడిని నిర్మించిన రాజేంద్ర ప్రసాదే ఈ సినిమాకు దర్శకుడు కూడా అవ్వడం మరో విశేషం. ఒకప్పుడు హీరోగా, ఇప్పుడు విలన్‌గా ఫుల్ ట్రెండ్‌లో ఉన్న జగపతిబాబు దసరా బుల్లోడు దర్శకుడు రాజేంద్ర ప్రసాద్ కొడుకే.

కేవీ మహదేవన్ ఈ సినిమాకు సంగీతాన్ని అందించారు. ఘంటసాల, ఎస్పీబీ, సుశీల పాటలు పాడారు. ఆత్రేయ తన పెన్ను కదిపారు. ఇందులోని పాటలూ, మాటలూ ఇప్పటికీ వినిపిస్తూనే ఉన్నాయి. కొత్త తరాన్ని కూడా అలరిస్తూనే ఉన్నాయి.'ఎట్టాగో ఉన్నాది ఓలమ్మీ... ఏటేటో అవుతుందే చిన్నమ్మీ', 'చేతిలో చెయ్యేసి చెప్పు బావా. చేసుకున్న బాసలు చెరిగిపోవనీ, మరిచిపోననీ', 'నల్లవాడే అమ్మమ్మో అల్లరి పిల్లవాడే'. 'పచ్చగడ్డి కోసేటి పడుచుపిల్లా' లాంటి ఫేమస్ పాటలు ఈ సినిమాలోనివే.

అరుంధతి అదరహో

- మూడు వికెట్లతో మెరిసిన తెలుగు పేసర్
- పాకిస్థాన్‌పై భారత్ అలవోక విజయం
- ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్

హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ అరుంధతి రెడ్డి అదరగొట్టింది. దుబాయ్ స్లో వికెట్‌పై పాకిస్థాన్ బ్యాటర్ల భరతం పట్టింది. మూడు వికెట్లతో నిప్పులు చెరిగిన అరుంధతి రెడ్డి..ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో టీమ్ ఇండియాకు తొలి విజయాన్ని అందించింది. భారత పేసర్లు, స్పిన్నర్ల మెరుపులతో పాకిస్థాన్ 105 పరుగులే చేయగా.. కఠిన పరిస్థితుల్లో స్వల్ప లక్ష్యాన్ని భారత్ 18.5 ఓవర్లలోనే ఛేదించింది.

దుబాయ్ (యుఏఈ) : చావోరేవో తేల్చుకోవాల్సిన సమరంలో టీమ్ ఇండియా అమ్మాయిలు అలవోక విజయం నమోదు చేశారు. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 6 వికెట్ల తేడాతో సాధికారిక విజయం సాధించింది. ఛేదనలో ఓపెనర్ షెఫాలీ వర్మ (32, 35 బంతుల్లో 3 ఫోర్లు) బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో కదం తొక్కగా.. జెమీమా రొడ్రిగస్ (23, 28 బంతుల్లో), హర్మన్‌ప్రీత్ కౌర్ (29, 24 బంతుల్లో 1 ఫోర్) సమయోచిత ఇన్నింగ్స్‌లతో రాణించారు. 18.5 ఓవర్లలో 108 పరుగులు చేసిన భారత్ గ్రూప్ దశలో తొలి విజయం నమోదు చేసింది. అంతకుముందు, తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ మహిళలు 20 ఓవర్లలో 8 వికెట్లకు 105 పరుగులు చేశారు. నిదా దార్ (28, 34 బంతుల్లో 1 ఫోర్), మునీబా అలీ (17, 26 బంతుల్లో 2 ఫోర్లు), ఫాతిమా సనా (13, 8 బంతుల్లో 2 ఫోర్లు), సయీద (14 నాటౌట్) రాణించారు. హైదరాబాదీ పేసర్ అరుంధతి రెడ్డి (3/19), స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ (2/12) పాకిస్థాన్ బ్యాటర్లను కట్టడి చేశారు. అరుంధతి రెడ్డి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకుంది. గ్రూప్–ఏలో భారత్ బుధవారం శ్రీలంకతో తలపడనుంది. రెండు మ్యాచుల్లో ఓ విజయం సాధించిన టీమ్ ఇండియా.. పాయింట్ల పట్టికలో నాల్గో స్థానంలో ఉంది.

కష్టమైనా.. ఛేదించారు : 106 పరుగుల లక్ష్య ఛేదన టీమ్ ఇండియాకు కఠిన సవాల్ విసిరింది. పవర్‌ప్లేలో భారత్ దూకుడు మంత్ర నుంచి బయటికొచ్చి ఆడింది. స్మృతీ మంధాన (7) ఆరంభంలోనే అవుటవగా.. భారత్‌పై ఒత్తిడి పడింది. యువ ఓపెనర్ షెఫాలీ వర్మ (32) సహజశైలికి భిన్నంగా ఆడింది. స్లో అవుట్‌ఫీల్డ్‌పై బౌండరీలు రావటం గగనమైంది. జెమీమా రొడ్రిగస్ (23), షెఫాలీ రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నమోదు చేశారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (29)తో కలిసి జెమీమా మరో కీలక భాగస్వామ్యంలో భాగమైంది. ఈ ఇద్దరు క్రీజులో నిలువగా భారత్ గెలుపు లాంఛనం చేసుకుంది. ఆఖర్లో హర్మన్‌ప్రీత్ రిటైర్డ్‌హర్ట్‌గా నిష్క్రమించగా.. దీప్తి శర్మ (7 నాటౌట్), సజన (4 నాటౌట్) లాంఛనం ముగించారు. 18.5 ఓవర్లలోనే భారత్ 108 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. పాకిస్థాన్ బౌలర్లు చక్కగా బౌలింగ్ చేశారు. లైన్ అండ్ లెంగ్త్ తప్పకుండా బంతులు సంధించటంతో పరుగుల వేట కష్టమైంది. వికెట్ల మధ్య పరుగుతోనే భారత్ ఎక్కువగా పరుగులు చేసింది. పాక్ పేసర్ ఫాతిమా సనా (2/23) రెండు వికెట్లతో మెరిసింది.

అరుంధతి నిప్పులు : టాస్ నెగ్గిన పాకిస్థాన్ అమ్మాయిలు తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నారు. ఓపెనర్ మునీబా అలీ (17) దూకుడుగా బ్యాటింగ్ చేసింది. కానీ రేణుక సింగ్ తొలి ఓవర్లోనే బ్రేక్ సాధించింది. దీప్తి శర్మ పవర్‌ప్లేలోనే సిద్ర (8)ను సాగనంపింది. ఆరు ఓవర్లలో 29/2తో నిలిచిన పాకిస్థాన్‌ను పేసర్ అరుంధతి రెడ్డి పుంజుకోనివ్వలేదు. నిప్పులు చెరిగే బంతులతో మూడు కీలక వికెట్లు పడగొట్టింది.

స్కోరు వివరాలు...

పాకిస్థాన్ మహిళల ఇన్నింగ్స్ : మునీబా (స్టంప్డ్) రిచా (బి) శ్రేయాంక 17, ఫెరోజా (బి) రేణుక 0, సిద్ర (బి) దీప్తి , ఒమిమా (సి) షెఫాలీ (బి) అరుంధతి 3, నిదా (బి) అరుంధతి 4, అలియా (ఎల్బీ) అరుంధతి 4, ఫాతిమా (సి) రిచా (బి) శోభన 13, ట్యూబా (సి) షెఫాలీ (బి) శ్రేయాంక 0, సయీద నాటౌట్ 14, నష్ర నాటౌట్ 6, ఎక్స్‌ట్రాలు :12, మొత్తం : (20 ఓవర్లలో 8 వికెట్లకు) 105. **వికెట్ల పతనం :** 1–1, 2–25, 3–33, 4–41, 5–52, 6–70, 7–71, 8–99. **బౌలింగ్ :** రేణుక సింగ్ 4-0-23-1, దీప్తి శర్మ 4-0-24-1, అరుంధతి రెడ్డి 4-0-19-3, శ్రేయాంక పాటిల్ 41-12-2, ఆశా శోభన 4-0-24-1.

భారత మహిళల ఇన్నింగ్స్ : షెఫాలీ (సి) అలియా (బి) ఒమిమా 32, మంధాన (సి) ట్యూబా (బి) సదియా 7, జెమీమా (సి) మునీబా (బి) ఫాతిమా 23, హర్మన్‌ప్రీత్ (రిటైర్డ్‌హర్ట్) 29, రిచా (సి) మునీబా (బి) ఫాతిమా 0, దీప్తి నాటౌట్ 7, సజన నాటౌట్ 4, ఎక్స్‌ట్రాలు :6, మొత్తం :(18.5 ఓవర్లలో 4 వికెట్లకు) 108. **వికెట్ల పతనం :** 1-18, 2-61, 3-80, 4-80. **బౌలింగ్ :** ఫాతిమా 4-0-23-2, సదియా 4-0-23-1, నిదా 1.5-0-10-0, ఒమిమా 3-0-17-1, నష్ర 4-0-21-0, ట్యూబా 2-0-14-0.

తొలి టి20లో టీమిండియా సునాయాసంగా..

- బంగ్లాదేశ్‌పై ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం
- నితీశ్‌రెడ్డి, మయాంక్ అరంగేట్రం

గ్వాలియర్ : బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టి20 టీమిండియా ఘన విజయం సాధించింది. బంగ్లాదేశ్ నిర్దేశించిన 128పరుగుల లక్ష్యాన్ని టీమిండియా కేవలం 11.5 ఓవర్లలోనే ఛేదించింది. ఓపెనర్ సంజు శాంసన్(29), కెప్టెన్ సూర్యకుమార్ (29)కి తెలుగు కుర్రాడు నితీశ్ రెడ్డి(16నాటౌట్), హార్దిక్(39నాటౌట్) మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. తొలుత గ్వాలియర్ స్టేడియంలో భారత బౌలర్ల ధాటికి బంగ్లా టాపార్డర్ కుప్పకూలింది. పేసర్ అర్ష్‌దీప్ సింగ్(3/14), మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి(31/31)లు మూడేసి వికెట్లతో విజృంభించగా బంగ్లా ఆటగాళ్లతో సగం మంది కనీసం రెండంకెల స్కోర్ కూడా చేయలేకపోయారు. 10 ఓవర్లలోపే సగం వికెట్లు కోల్పోయిన జట్టును మెహిదీ హసన్ మిరాజ్(35), కెప్టెన్ నజ్ముల్ హుసేన్ శాంటో(27)లు ఆదుకున్నారు. దాంతో, బంగ్లాదేశ్ 19.5 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌటయ్యింది. టాస్ ఓడిన బంగ్లాదేశ్‌ను యువపేసర్ అర్ష్‌దీప్ సింగ్ సూపర్ స్పెల్‌తో ముప్పతిప్పలు పెట్టాడు. మొదట ఓపెనర్ లిట్టన్ దాస్(8)ను ఔట్ చేసిన ఈ లెఫ్ట్ ఆర్మ్ పేసర్ ఆ తర్వాత మరో ఓపెనర్ పర్వేజ్ హుసేన్ ఎమోన్(4)ను బౌల్డ్ చేసి భారత్‌కు బ్రేకిచ్చాడు. అతడి తర్వాత మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి మ్యాజిక్ చేశాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అర్ష్‌దీప్‌కు దక్కింది.

నితీశ్‌రెడ్డి, మయాంక్ అరంగేట్రం

ఐపిఎల్ సీజన్-17లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన హైదరాబాద్‌కు చెందిన తెలుగు కుర్రాడు నితీ శ్ కుమార్ రెడ్డి అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. తొలుత జింబాబ్వే పర్యటనకు అతడు ఎంపికైనా గాయం కారణంగా ఆ సిరీస్ ఆడలేదు. దీంతో సెలెక్టర్లు అతడికి మరో అవకాశం ఇచ్చారు. ఇక ఢిల్లీకి మయాంక్ యాదవ్.. గంటకు 153 కిలోమీటర్ల వేగంతో బంతులు సంధించగల నేర్పరి. ఐపిఎల్ 17వ సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌కు ఆడిన మయాంక్ తన పేస్‌తో ప్రత్యర్థులను భయపెట్టాడు. బంగ్లాపై అరంగేట్రం చేసి 4-1-21-1 బౌలింగ్ గణాంకాలతో మెరిసాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68